ప్రభాతనవ

SINGIDI | తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగుా ఓ నిజం

శనివారం 25 జులై 2026 సంపుటి: 1 సంచిక: 38 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar




పరీక్షలకు తాత్కాలిక సర్దుబాట్లు

## సరికాదు

**శాశ్వత ప్రాతిపదికన పక్కాగా నిర్వహణ చేపట్టాలి**

**నివేదిక కోరుతూ కేంద్రం, ఎటిఏకు సుప్రీం ఆదేశం**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీక వ్యవహారం తర్వాత చేపట్టిన సంస్కరణల పురోగతిపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది.

**న్యూఢిల్లీ,జూలై24 (సింగిడి)**

## సిజెపి ఆందోళనలపై ఎలాంటి పిటిషన్లు లేవు

**వాటిని విచారించకుండా తిరస్కరించారని ఎలా రాస్తారు**

**మీడియా తీరుపై చీఫ్ జస్టిస్ ఆగ్రహం**

2

## విద్యార్థుల భవిష్యత్ కోసమే ఆందోళన

### ఇప్పుడు మౌనం వహిస్తే... మరెప్పుడూ ప్రశ్నించలేం

**ధర్మేంధ్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు వెనక్కి తగ్గం**

**కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడి**



కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకూ తమ ఆందోళనలు కొనసాగుతాయని కాక్రోచ్ జనతా పార్టీ స్పష్టం చేసింది. అదే తమ ప్రధాన డిమాండ్ అని తెలిపింది. గతంలో తమకు ఆందోళనలు చేసిన నేపథ్యం ఏమీ లేదని.. విద్యార్థుల భవిష్యత్తు కోసమే పోరాటం కొనసాగిస్తున్నామనీ సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. విద్యా వ్యవస్థ నాశనమైనందుకు దేశంలో యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. అందుకే కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. 2

**న్యూఢిల్లీ,జూలై24 (సింగిడి)**

## పేపర్ లీక్ కేసులపై కఠిన నిర్ణయం

### దోషులకు పదేళ్ల జైలు.. పదికోట్ల జరిమానా

**చట్టంలో మార్పులకు కేంద్ర కేబినేట్ నిర్ణయం**

**అధికారికంగా వెల్లడించని ప్రభుత్వం**



పేపర్ లీకులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన చట్టాన్ని సవరించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించినట్లు సంబంధిత వర్గాల సమాచారం. ముఖ్యంగా ప్రశ్నపత్రాల లీకలే ఘటనలో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ముసాయిదా బిల్లును రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. 2

**న్యూఢిల్లీ,జులై 24 (సింగిడి)**

## పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

### వరుసగా ఐదోరోజూ కొనసాగని సభ

**లోక్ సభ సోమవారానికి వాయిదా**

**రాజ్యసభలో వందేమాతరం బిల్లు పెట్టిన నిత్యానందరాయ్**



లోకసేభ, రాజ్యసభల్లో పేపర్ లీకలేపై చర్చ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో లోకసేభ ప్రారంభమైన కొద్దిసేపటికే మధ్యాహ్నం 12:00 గంటల వరకు వాయిదా పడింది. అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్టంభన కొనసాగింది. నీట్ యూజీ సహా దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న పరీక్షల పేపర్ లీక వ్యవహారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది. 2

**న్యూఢిల్లీ, జూలై24 (సింగిడి)**



## డ్రగ్స్‌పై ఉక్కుపాదం

### మరిన్ని కఠిన నిబంధనలు

### ఉన్నతాధికారులకు సిఎం రేవంత్ అదేశాలు

డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలని ఉన్నతాధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. డ్రగ్స్ నిరోధంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధం, భద్రత కమిటీలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. విద్యా సంస్థల్లో డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి ఆయా సంస్థల యాజమాన్యాలను బాధ్యులను చేయాలని స్పష్టం చేశారు. క్యాంపస్ లోపల డ్రగ్స్‌కు సంబంధించి ఏ ఘటనకైనా యాజమాన్యాన్నే బాధ్యులను చేయాలని సూచించారు.

**-హైదరాబాద్,జులై 24 (సింగిడి)**

2

## జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

### ఓఆర్ఆర్ లోపల ప్రభుత్వ భూముల గుర్తింపు



**పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల భూముల సేకరణ**

**క్యూర్ పరిధిలో ఇళ్ల నిర్మాణంపై సిఎం రేవంత్ సమీక్ష**

## పాలమూరు ఎత్తిపోతల..

# కన్నీటి కల?

> *గంగ వచ్చిందని గిన్నె బయట పెట్టుకుంటే... గిన్నె నిండదు. నీళ్లు ఇంటి గుమ్మం దాటినప్పడే దాహం తీరుతుంది. పాలమూరు, రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిస్థితి కూడా ప్రస్తుతం అదే వాస్తవాన్ని గుర్తు చేస్తోంది. వేల కోట్ల రూపాయలు ఖర్చయ్యాయి, భారీ నిర్మాణాలు పూర్తయ్యాయి, ప్రభుత్వాలు మారాయి, కానీ రైతు పొలానికి నీరు మాత్రం ఇంకా పూర్తిస్థాయిలో చేరలేదు. రాజకీయ ప్రకటనలు ఒకవైపు... ప్రజల అంచనాలు మరోవైపు... ఈ రెండింటి మధ్య పాలమూరు ప్రాజెక్టు ఎక్కడో నిలిచింది.*

(స్పెషల్ కరస్పాండెంట్- సింగిడి)

### నిర్మాణంలో పురోగతి... ప్రయోజనం మారనిగతి.!

ప్రభుత్వాలు మారినా...నీటి కోసం ఎదురుచూపేనా?

జల ప్రవాహంలా దక్షిణ తెలంగాణా ప్రజల ఆశలు


2

**దక్షిణ తెలంగాణ ఆశలకు శ్రీకారం... పాలమూరు ప్రాజెక్టు ఆవిర్భావం**

దశాబ్దాలుగా నీటి కోసం ఎదురుచూస్తున్న దక్షిణ తెలంగాణకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో 2015లో పాలమూరు, రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలకు సాగునీరు, తాగునీరు అందించాలనే ఉద్దేశంతో దీనికి రూపకల్పన జరిగింది. సుమారు 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఇది తెలంగాణలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది.

**భారీ నిర్మాణాలు... వేల కోట్ల వ్యయం**

ప్రాజెక్టు ప్రారంభమైన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మాణ పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లింది. పంప్‌హౌస్‌లు, సొరంగ మార్గాలు, రిజర్వాయర్లు, కాలువల నిర్మాణంపై భారీగా పెట్టుబడులు పెట్టింది. అధికారిక లెక్కల ప్రకారం ప్రాజెక్టు పనులు 75 నుంచి 80 శాతం వరకు పూర్తయ్యాయి. ప్రారంభంలో రూ.35 వేల కోట్లుగా ఉన్న అంచనా వ్యయం... సవరణలతో రూ.45 వేల కోట్లకు పైగా చేరింది. ఇప్పటివరకు సుమారు రూ.30 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి.



**నిర్మాణంలో పురోగతి... కానీ నీటి ప్రయాణం ఇంకా అసంపూర్తి**

భారీ నిర్మాణాలు పూర్తయినా... ప్రాజెక్టు లక్ష్యం మాత్రం ఇంకా పూర్తిగా నెరవేరలేదు. పంపింగ్ వ్యవస్థ, పంపిణీ కాలువలు, విద్యుత్ మౌలిక వసతులు, కొన్ని రిజర్వాయర్ల అనుసంధానం వంటి కీలక పనులు మిగిలిపోవడంతో... రైతులకు ఆశించిన స్థాయిలో సాగునీరు అందలేదు. అందుకే నిర్మాణ పురోగతి కనిపిస్తున్నా... ప్రయోజనం మాత్రం ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు.

**ప్రభుత్వ మార్పు... పనుల దిశలో కొత్త సమీక్ష**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు పనులపై సమగ్ర సాంకేతిక సమీక్ష చేపట్టింది. భూసేకరణ, మిగిలిన ప్యాకేజీలు, విద్యుత్ కనెక్షన్లు, పంపింగ్ వ్యవస్థ, పంపిణీ నెట్‌వర్క్ వంటి అంశాలను తిరిగి పరిశీలించింది. నిర్మాణంలో పురోగతి ఉన్నప్పటికీ... పూర్తి స్థాయి నీటి సరఫరాకు అవసరమైన చివరి దశ పనులపైనే ప్రస్తుతం ప్రధాన దృష్టి కేంద్రీకృతమైంది.

## హిమాచల్ ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

### టాటా సుమోపై పడిన కొండచరియలు

### 13 మంది మృతి!

**పంగీ-కిలాడ్ రహదారిపై ఈ దుర్ఘటన**

**చంబా వద్ద కారుపై పడిన కొండచరియలు**

**ప్రమాదంలో ఇద్దరికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు**

**కుల్లు నుంచి పంగీ వైపు వెళ్తోన్న టాటా సుమో**

**ప్రమాదం తర్వాత వాహనంలో మంటలు**

2



హిమాచల్ ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. కదులుతున్న వాహనంపై కొండచరియలు విరిగిపడడంతో 13 మంది మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. మరణించిన వారిలో ఆరు నెలల చిన్నారి ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**- సిమ్లా (సింగిడి)**

2

**డిజిటల్ అడ్వర్‌టైజింగ్ హబ్‌లుగా**

## మీసేవ కేంద్రాలు

**చిన్న వ్యాపారాలకు అందుబాటులోకి డిజిటల్ మార్కెటింగ్ సేవలు**

## 20 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు

### విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్లుగా ఏర్పాట్లు

**క్షేత్రస్థాయి పర్యటనలతో సమీక్షిస్తున్నాం**

**భద్రాద్రి జిల్లా పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి**



సింగరేణి బొగ్గు బ్లాకులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళితే సంస్థ ఉనికికే తీవ్ర ప్రమాదమని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రి జిల్లా పర్యటనలో ఆయన మాట్లాడుతూ, గతంలో వేలంలో పాల్గొనకపోవడం వల్లే రెండు బొగ్గు బ్లాకులు ప్రైవేటు పరం అయ్యాయని, తమ ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితిని మార్చి సింగరేణిని వేలం పాటల్లో పాల్గొనేలా అనుమతులు ఇచ్చామని తెలిపారు.

**- భద్రాద్రి కొత్తగూడెం (సింగిడి)**

2

## సింగరేణి విస్తరణకు ప్రజా ప్రభుత్వం నిర్ణయం

### రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌లోకి సింగరేణి విస్తరణ: భట్టి

## కాక్రోచ్ ఆందోళనలకు బిఆర్ఎస్ సంఘీభావం

### కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే.. ఇందిరాపార్క్ ధర్నాలో కెటిఆర్ డిమాండ్

*ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడులు అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. యువత జవాబుదారీతనం కోరుతోందని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.* 2

**హైదరాబాద్,జూలై24 (సింగిడి)**



యువతపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద కేటీఆర్ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులు, యువత పోరాటానికి బీఆర్ఎస్ తరపున కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. 25 రోజులుగా ఢిల్లీలో పార్టీలకు అతీతంగా యువత పోరాడుతోందన్నారు. యువతపై జరుగుతున్న దాడులను దారుణమని తీవ్రంగా ఖండించారు. ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే ప్రధాని మోదీ పెట్టుకున్నారని.. ఈ జనరేషన్ చావుకు, ఐటీ, ఈడీ సోదాలకు భయపడేది కాదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ.. మేక ఇన్ ఇండియా అడిగితే లీక ఇన్ ఇండియా ఇచ్చారంటూ సెటైర్లు వేశారు. న్యాయం చేయాలని విద్యార్థులు అడుగుతున్నారని, వారికి అండగా నిలబడతామని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీపై కొట్లాడితే చోటాభారుకు ఎందుకు కోపం వస్తుందో అర్థం కావడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ చురకలు అంటించారు.

## పిల్లలే మన భవిష్యత్ ఆస్తి

### పిల్లలు పుడితే భారం కాకుండా చేశాం

**ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలు**

**విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లది**

**రంపచోడవరంలో తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల భేటీలో సిఎం చంద్రబాబు**



2

### పరీక్షలకు తాత్కాలిక సర్దుబాట్లు

# సరికాదు

పరీక్షల నిర్వహణలో తాత్కాలిక సర్దుబాట్లు కాకుండా, శాశ్వత వ్యవస్థాగత సంస్కరణలు ఎలా అమలు చేస్తున్నారో వివరిస్తూ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలను సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకత, భద్రత పెంచేందుకు చేపట్టిన చర్యలపై 10 ప్రధాన రంగాల వారీగా వివరాలు సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. డిజిటల్ మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, పరిశోధన, పారదర్శకత, పరిపాలన, మానవ వనరులు వంటి అంశాలపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని సూచించింది. పరీక్ష జరగడానికి ముందు, పరీక్ష సమయంలో, పరీక్ష పూర్తయిన తర్వాత చేపట్టిన సంస్కరణలపై స్టేటస్ రిపోర్ట్ అందించాలని ఆదేశించింది. పరీక్షా పత్రాల సురక్షిత రవాణా కోసం భారత వైమానిక దళాన్ని ఉపయోగించడంపై జస్టిస్ పీ.ఎస్. నరసింహ వ్యాఖ్యానిస్తూ... ఇది ఒక తాత్కాలిక నివారణ చర్య మాత్రమే తప్ప, పరీక్షల భద్రతకు శాశ్వత పరిష్కారం కాదని స్పష్టం చేశారు. అలాగే, భవిష్యత్తులో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం అమలు పురోగతి, అభ్యర్థుల సమాచారాన్ని కాపాడే డేటా రక్షణ చర్యలపై వివరణ ఇవ్వాలని కోరింది. అభ్యర్థుల ధృవీకరణ కోసం 'డిజియాత్ర' వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించే ప్రతిపాదనలపై స్పష్టత ఇవ్వాలని కేంద్రానికి సూచించింది. పరీక్షల పర్యవేక్షణకు ప్రతిపాదించిన గవర్నింగ్ బోర్డు, నిపుణుల కమిటీలు, స్టేక్‌హోల్డర్ నామినేషన్ల ఏర్పాటు ఎంతవరకు వచ్చిందో నివేదికలో తెలపాలని ఆదేశించింది. దీనిపై స్పందించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, కోర్టు సూచించిన అన్ని అంశాలతో సమగ్రమైన తాజా అఫిడవిట్‌ను త్వరలోనే దాఖలు చేస్తామని హామీ ఇచ్చారు. దానికి ధర్మాసనం ఆమోదం తెలిపింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

### సిజెపి ఆందోళనలపై

## ఎలాంటి పిటిషన్లు లేవు

**న్యూఢిల్లీ,జూలై24 (సింగిడి)**

'చలో పార్లమెంట్' నిరసన సందర్భంగా పోలీసుల తీరుపై అత్యవసర పిటిషన్ దాఖలు కాగా.. విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరించిందన్న వార్తలను సీజేఐ జస్టిస్ సూర్య కాంత్ కొట్టిపారేశారు. అవన్నీ తప్పుడు కథనాలని పేర్కొన్నారు. కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) ఆందోళనలపై అసలు పిటిషనే దాఖలు కాలేదని అన్నారు. గత రెండు రోజులుగా మీడియా బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తోందని తీవ్రంగా వ్యాఖ్యానించారు. అత్యవసర పిటిషన్‌ను సీజేఐ విచారణకు స్వీకరించలేదని తప్పుడు వార్తలు ప్రసారం చేస్తోందన్నారు. శుక్రవారం కోర్టు విచారణ ప్రారంభమైన తర్వాత న్యాయవాదులు తమ కేసులను అత్యవసరంగా స్వీకరించాలని విజ్ఞప్తి చేసిన సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల వరకు సీజేపీ ఆందోళనలకు సంబంధించి ఒక్క పిటిషన్ కూడా దాఖలు కాలేదు. ఈ అంశంపై విచారణ చేపట్టాలని ఎవరో ఒక లాయర్ మాత్రం విజ్ఞప్తి చేశారు. ఓ అభ్యర్థనను పిటిషన్‌గా ఎలా స్వీకరిస్తాం అని సీజేఐ అన్నారు. జూలై 20న సీజేపీ చేపట్టిన చలో పార్లమెంట్ ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో అత్యవసరంగా విచారణ చేపట్టాలని న్యాయవాది నరేంద్ర మిశ్రా బుధవారం సుప్రీం కోర్టును అభ్యర్థించారు. పోలీసు దాడులకు సంబంధించిన తన వద్ద వీడియో ఆధారాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఆందోళనకారుల్లో ఎక్కువ మంది విద్యార్థులే ఉన్నారని, వారి కోసమైనా అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. అయితే, సుప్రీం కోర్టు అందుకు తిరస్కరించినట్టు వార్తలు వచ్చాయి. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని, అలాగే పిటిషనర్ కూడా సమయం వృథా చేసుకోవద్దని సీజేఐ హితవు పలికినట్టు రాసుకొచ్చారు. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోలు గురించి పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా..' మాకు వీడియోలు చూసే సమయం లేదు' అని సీజేఐ అన్నట్టు కూడా కథనాలు వెలువడ్డాయి. మరోవైపు, కోర్టు విచారణలకు సంబంధించిన ఆడియో, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంపై సుప్రీం కోర్టు నిషేధం విధించింది. ఒక వేళ పోస్టు చేయాలనుకుంటే సుప్రీం కోర్టు లేదా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్స్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆదేశించింది. కోర్టు కార్యకలాపాలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం వల్ల దుర్వినియోగమవు తున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది వికాస్ సింగ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా అంగీకరించారు. నియంత్రణ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై పూర్తి వివరణ ఇవ్వాలని కేంద్రానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. ముందస్తు చర్యల్లో భాగంగా నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించింది.

## హిమాచల్ ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

ప్రమాద స్థలిలో భయానకర దృశ్యాలు నెలకొన్నాయి. కొండపై నుంచి రాళ్లు అకస్మాత్తుగా పడడంతో వాహనం నుజ్జు నుజ్జు అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, లాహౌల్-స్పితి జిల్లాలోని పాంగి-ఉదయ్‌పూర్ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో వాహనంలో 15 మంది ప్రయాణిస్తున్నట్లు చెప్పారు. వారందరూ పాంగి లోయ నివాసితులేనని సమాచారం. కాగా, సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన తర్వాత వాహనం వెనుక భాగంలో మంటలు చెలరేగినట్లు అధికారులు పేర్కొన్నారు. స్థానికులు, ఆర్మీ సిబ్బంది మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు.

**ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం**

ఈ ఘటనపై ముఖ్యమంత్రి సుఖ్వీంధర్ సింగ్ సుఖు స్పందించారు. ప్రమాదంలో 13 మంది ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలని కోరారు. అలాగే, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే, లాహౌల్-స్పితి డిప్యూటీ కమిషనర్‌ను వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు.

**సహాయక చర్యలను వేగవంతం చేసిన అధికారులు**

మరోవైపు, ఈ ఘటనపై భర్మోర్ ఎమ్మెల్యే జనక్ రాజ్ స్పందించారు. వాహనంలో ఉన్న 15 మందిలో 13 మంది మరణించారని, వాహనం నుంచి బయటకు దూకిన ఇద్దరు వ్యక్తులు ప్రాణాలతో బయటపడ్డారని తెలిపారు. చంబా, లాహౌల్-స్పితి డిప్యూటీ కమిషనర్లను సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆయన కోరారు. చంబా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విజయ్ కుమార్ సక్లానీ ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కొండచరియలు విరిగిపడడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. కాగా, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు.

**కొండచరియలు పడడంతో ఆ మార్గాన్ని మూసేసిన అధికారులు**

ప్రాథమిక సమాచారం ప్రకారం, పంగీ-కిలాద్ రోడ్డులో గురువారం కొండచరియలు విరిగిపడటంతో ఈ మార్గాన్ని మూసివేశారు. మరమ్మతుల అనంతరం శుక్రవారం ఉదయమే రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో ప్రయాణికులు పాంగికి బయలుదేరిన సమయంలో ఈ విషాదం జరిగింది.

ఇక, మండి జిల్లాలోని జోగిందర్‌నగర్ పరిధిలోని గుమ్మా ప్రాంతంలో కొండచరియల విరిగిపడ్డాయని అధికారులు తెలిపారు. ఆ ఘటనలో ఒక మహిళ మరణించగా, ఏడుగురు గాయపడ్డారని పేర్కొన్నారు. కులు నుంచి సింసా మాత ఆలయానికి వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. కాగా, ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా కొండచరియలు విరిగిపడే ఘటనలు పెరుగుతున్నాయని వెల్లడించారు.

## విద్యార్థుల భవిష్యత్ కోసమే ఆందోళన

కొందరు వ్యక్తులకు భయపడి ప్రశ్నించకపోతే భవిష్యత్తు ఉండదని.. ఇప్పుడు మౌనం వహిస్తే, దేశం ఇంకెప్పటికీ ముందుకు సాగదని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగు తున్నాయని.. ప్రజల మద్దతును ఎప్పటికీ మరిచిపోబోమని దీప్కే పేర్కొన్నారు. యువత మద్దతుతోనే ఇన్ని రోజులు జంతర్‌మంతర్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. చర్చల కోసం తాము కేంద్రమంత్రి జేపీనడ్డా నివాసానికి వెళ్లబోమని.. జంతర్‌మంతర్ వద్దే చర్చలు జరగాలని డిమాండ్ చేశారు. కేంద్రంతో చర్చలు తటస్థ వేదికపైనే జరుగుతాయని స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి తప్పించడమే.. ఈ విషయంలో తీసుకునే కఠిన చర్య అని పేర్కొన్నారు. విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల దమనకాండను ఖండించారు. సీజేపీ నేడు దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్దకు వేల సంఖ్యలో యువకులు చేరుకుంటున్నారు. దీంతో అక్కడ పెద్ద ఎత్తున భద్రతాబలగాలను మోహరించారు.

# జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

**హైదరాబాద్,జూలై24 (సింగిడి):**

నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇళ్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న వివిధ స్థలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించిన స్థలాలను తీసుకుని.. ఆయా శాఖలకు వేరే చోట కేటాయించాలని రేవంత్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను జనావాసాలకు దూరంగా కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా.. జనావాసాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ప్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఇళ్లు



నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ. 5 లక్షల మేర సబ్సిడీని అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్ధిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ప్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలకపేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పాలమూరు ఎత్తిపోతల.. కన్నీటి కల?

**పూర్తి కావాలంటే...**
**ఇంకా మిగిలిన పనులే కీలకం**

ఇప్పటికే భారీ మొత్తంలో ఖర్చు జరిగినప్పటికీ... ప్రాజెక్టు పూర్తికి ఇంకా నిధులు అవసరమే. మిగిలిన నిర్మాణాలు, విద్యుత్ మౌలిక వసతులు, పంపిణీ కాలువలు, నెట్‌వర్క్ పూర్తి చేయడానికి మరో రూ.10 వేల కోట్ల నుంచి రూ.15 వేల కోట్ల వరకు అవసరమవుతుందని అధికార వర్గాల అంచనా. చివరి దశ పనులు ఎంత వేగంగా పూర్తవుతాయన్నదే ఇప్పుడు ప్రాజెక్టు భవిష్యత్తును నిర్ణయించనుంది.

**లక్ష్యం కనిపిస్తోంది... కానీ**
**గడువు ఇంకా స్పష్టతలో లేదు**

ప్రస్తుతం ప్రభుత్వం ప్రాజెక్టును దశలవారీగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. పరిపాలనా వర్గాల అంచనాల ప్రకారం 2027–28 నాటికి ప్రధాన నిర్మాణాలు పూర్తి చేసి... అనంతరం పూర్తిస్థాయి నీటి సరఫరా అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. అయితే నిధుల విడుదల, భూసేకరణ, సాంకేతిక అనుమతుల పురోగతిపైనే తుది గడువు ఆధారపడి ఉంటుంది.

**ప్రజల అంచనాలు ఒక్కటే...**
**ప్రకటనలు కాదు, నీటి ప్రవాహం కావాలి**

ఈ ప్రాజెక్టు గురించి రాజకీయ పార్టీలకు వేర్వేరు వాదనలు ఉండొచ్చు. ఒకరు నిర్మాణాన్ని తమ ఘనతగా చెబుతుంటే... మరొకరు పూర్తి బాధ్యతను తమది అంటున్నారు. కానీ దక్షిణ తెలంగాణ రైతులకు ఆ వాదనలు ముఖ్యమేమీ కావు. తమ పొలాలకు సాగునీరు ఎప్పుడు చేరుతుందన్నదే వారి అసలు అంచనా. ప్రాజెక్టు శాతం కాదు... నీటి ప్రవాహమే ప్రజలకు అభివృద్ధికి కొలమానం.

**చరిత్ర నిర్మాణాన్ని గుర్తుంచుకుంటుంది...**
**ప్రజలు ఫలితాన్ని గుర్తుంచుకుంటారు**

పాలమూరు–రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఇప్పుడు కేవలం ఒక నిర్మాణ ప్రాజెక్టు కాదు... దక్షిణ తెలంగాణ భవిష్యత్తుతో ముడిపడిన అభివృద్ధి ప్రణాళిక. ఈ ప్రాజెక్టు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు, వేలాది కుటుంబాలకు భరోసా, ప్రాంతీయ అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుంది. అందుకే ప్రజలు ఇప్పుడు ప్రభుత్వాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కాదు... స్పష్టమైన కార్యాచరణ, నిర్దిష్ట గడువు, పూర్తి స్థాయి అమలును కోరుకుంటున్నారు.
ప్రాజెక్టును ఎవరు ప్రకటించారన్నది చరిత్రలో నిలుస్తుంది... కానీ ఆ ప్రాజెక్టు నీటిని రైతు పొలానికి చేర్చిన ప్రభుత్వమే ప్రజల హృదయాల్లో నిలిచిపోతుంది.

## డ్రగ్స్‌పై ఉక్కుపాదం

డ్రగ్స్ విషయంలో క్యాంపస్ బయట జరిగే యాక్టివిటీని గుర్తించి సమాచారాన్ని అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. సంస్థలకు అధికారంతో పాటు బాధ్యతను అప్పగించాలని తెలంగాణ సీఎం పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకునేలా చూడాలని అన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అందించేందుకు విద్యాసంస్థల ఆవరణలో టోల్ ఫ్రీ నెంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. గుర్తించడం, మాన్పించడం, శిక్షించడం.. ఈ మూడు దశలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం తెలిపారు. డ్రగ్స్ స్వీకరించి పట్టుబడితే డీ–అడిక్షన్ సెంటర్‌కు తరలించాలని అన్నారు. తరచూ పట్టుబడితే కఠినంగా శిక్షించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు అవసరమైతే చట్టాన్ని రూపొందించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులకు తెలంగాణ సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

## డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్‌లుగా మీసేవ కేంద్రాలు

**హైదరాబాద్,జులై 24 (సింగిడి) :**

తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ మీ సేవ ఆధ్వర్యంలో, అంతర్జాతీయంగా పేరొందిన మెటా సంస్థ సహకారంతో రాష్ట్రంలోని మీ సేవ కేంద్రాలను డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్‌లుగా తీర్చిదిద్దే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు తక్కువ వ్యయంతో డిజిటల్ ప్రకటనల సేవలు అందుబాటులోకి రానున్నాయి. కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో క్యూర్ ప్రాంతానికి చెందిన 150 మందికి పైగా మీ సేవా విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్ పాల్గొన్నారు. మెటా ప్లాట్‌ఫామ్‌లలో ప్రకటనలను రూపొందించడం, వాట్సప్ బిజినెస్ ఎకౌంట్ ను క్రియేట్ చేయటం, తమ ఉత్పత్తులను ఆ ఎకౌంట్ ద్వారా ప్రచారం చేయడం, వినియోగదారులను గుర్తించడం, డిజిటల్ ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం వంటి అంశాలపై వారికి శిక్షణ అందించారు. కార్యక్రమం ద్వారా కిరాణా షాప్స్, పండ్ల వ్యాపారులు, స్వీట్ షాపులు, రెస్టారెంట్లు, మెడికల్ షాపులు, ఆసుపత్రులు, పాఠశాలలు, సెలూన్లు, మెకానికల్స్, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, పెద్ద సంస్థలు తదితర అన్ని రకాల వ్యాపారాలు తమ సమీపంలోని మీ సేవా కేంద్రాన్ని సంప్రదించి మెటా ప్లాట్‌ఫామ్‌లలో ప్రొఫెషనల్ డిజిటల్ ప్రకటనలను రూపొందించి ప్రచారం చేసుకునే అవకాశం పొందుతాయి. మీ సేవా నిర్వాహకులు ప్రకటనల రూపకల్పన, ప్రచార కంటెంట్ తయారీ, సరైన వినియోగదారుల ఎంపిక, ప్రకటనల ప్రచురణ తదితర అంశాల్లో పూర్తి సహాయాన్ని అందిస్తారు. దీంతో వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తులు, సేవలకు మరింత ప్రచారం కల్పించుకొని, ఎక్కువ మంది వినియోగదారులను చేరటం ద్వారా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా మీ సేవ కమిషనర్ టి. రవి కిరణ్ మాట్లాడుతూ.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం సాంకేతికత ద్వారా పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారుల అభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. మెటా సంస్థకు ఉన్న ప్రపంచ స్థాయి డిజిటల్ అడ్వర్టైజింగ్ నైపుణ్యాన్ని, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న మీ సేవా కేంద్రాల నెట్‌వర్క్ తో అనుసంధానం చేయడం ద్వారా ఇప్పటివరకు డిజిటల్ మార్కెటింగ్‌కు దూరంగా ఉన్న చిన్న, గ్రామీణ వ్యాపారాలకు కూడా నాణ్యమైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వినూత్న భాగస్వామ్యంతో మీ సేవా కేంద్రాలు ఇకపై కేవలం పౌర సేవలకే పరిమితం కాకుండా డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్‌లుగా రూపాంతరం చెంది, చిన్న, మధ్య తరహా వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు మీ సేవ కేంద్రాలను నడిపేవారికి కూడా అదనపు ఉపాధి, ఆదాయ అవకాశాలను కల్పిస్తూ తెలంగాణ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడనున్నాయి.

### 20 ఏళ్లకు సరిపడా

## బొగ్గు నిల్వలు

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా రాబోయే 20 సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అందులో భాగంగానే ఈ క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో పేరుకుపోయిన బకాయిలను తాము అధికారంలోకి వచ్చాక సమన్వయంతో సరిచేస్తున్నామని స్పష్టం చేశారు. పదేళ్ల క్రితం బిఆర్ఎస్, బిజెపిలు అధికారంలో ఉన్నప్పుడు నోరు మెదపకుండా, తాడిచెర్ల బ్లాకనూ అడ్డుపెట్టుకుని ఇప్పుడు సింగరేణిపై నకిలీ ప్రేమ ఒలకబోస్తున్నారని, ఈ విషయాన్ని కార్మికులు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల డిమాండ్‌కు తగ్గట్టుగా సరైన ప్రణాళికలు రూపొందించకపోవడం వల్లే నేడు తీవ్ర బొగ్గు కొరతను ఎదుర్కోవాల్సి వస్తోందని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ పునరావృతం కాకుండా తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిని భట్టితదితరులు క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది. గనిలోకి స్వయంగా వెళ్లి బొగ్గు నాణ్యతను పరిశీలించి, బొగ్గు ఉత్పత్తి, గని పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించాను. రాష్ట్ర భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వేలం ప్రక్రియలో చురుగ్గా పాల్గొని కొత్త బొగ్గు బ్లాకులను సొంతం చేసుకోవాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. తాడిచెర్ల బొగ్గు బ్లాక సింగరేణికి కేటాయించడం శుభపరిణామం. అలాగే భవిష్యత్ అవసరాల దృష్ట్యా పీకే ఓసీ డిప్ సైడ్ బ్లాక కూడా సింగరేణికే దక్కేలా మన ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇస్తున్నట్లు వెల్లడించారు. సింగరేణి ప్రయోజనాల పరిరక్షణెళి మన ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని భట్టి అన్నారు.

## కాక్రోచ్ ఆందోళనలకు బిఆర్ఎస్ సంఘీభావం

మోదీ అంటే రేవంత్‌కు ఎందుకంత భయమంటూ ప్రశ్నించారు. పాత కేసులు తోడుతారని సీఎం భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. మోదీ ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తే రేవంత్ ఎక్కడ ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్ పై ఆయన ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నలు సంధించారు. విద్యార్థులను కొడుతుంటే సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. పేపర్ లీకకూ తనకు సంబంధం ఏంటని, యూత్ కాంగ్రెస్ వాళ్లకు బుద్ధి ఉందా అంటూ మండిపడ్డారు. వాళ్లు దేశంలో ఏం జరిగినా.. కేసీఆర్, కేటీఆర్‌దే తప్పు అంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి నిద్రలో కూడా కేసీఆరే గుర్తు వస్తున్నారని కేటీఆర్ చురకలు అంటించారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.



## పేపర్ లీక్ కేసులపై కఠిన నిర్ణయం

అయితే, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టానికి కేంద్రం కీలక సవరణలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ చట్టం కింద ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వ్యక్తిగత కేసుల్లో దోషులకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానాను విధిస్తున్నారు. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. ఈ శిక్షలు, జరిమానాలను భారీగా పెంచుతూ చట్టాన్ని సవరిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలపై శుక్రవారం జరిగిన క్యాబినెట్ భేటీలో చర్చలు జరిపారు. అనంతరం ఈ ముసాయిదా బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. ఇక, పేపర్ లీకులపై విచారణకు ఫాస్ట్‌ట్రాక కోర్టులను ఏర్పాటు చేస్తామని మోదీ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఢిల్లీ న్యాయస్థానంలో తొలి ఫాస్ట్‌ట్రాక కోర్టు ఏర్పాటవ్వగా.. మరో నాలుగింటిని త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. ఈ న్యాయస్థానాల పరిధిలో.. లీకులకు సంబంధించిన కేసుల విచారణను మూడు నెలల్లో పూర్తిచేసి దోషులకు శిక్ష విధించేలా బిల్లులో ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. వచ్చే వారం ఈ బిల్లును లోకసేభ ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉంది. నీట్ పేపర్ లీకనూ వ్యతిరేకిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళన ఉద్ధృతమైన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలకు ఉపక్రమించింది. లీకేజీ ఘటనలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని స్వయంగా ప్రధాని మోదీ గురువారం అర్ధరాత్రి ప్రత్యేక వీడియో విడుదల చేశారు. ఈ బిల్లును వీలైనంత త్వరగా ఆమోదించేందుకు ప్రయత్నిస్తామని ప్రధాని తెలిపారు.

## పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సహా ప్రధాని నరేంద్ర మోదీ సభాముఖంగా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. మరోవైపు.. పరీక్షల పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన శిక్షలు విధించేలా కొత్త బిల్లును తీసుకొస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తుది రూపుదిద్దిన తర్వాత ఆ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతామన్నారు. ఈ విషయమై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. నీట్ అంశంపై సభలో చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. మరోవైపు.. విద్యార్థులపై జులై 20న జరిగిన పోలీస్ చర్యలో పెల్లెట్ గన్స్ వినియోగించారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ఈ అంశాన్నీ పార్లమెంట్‌లో లేవనెత్తనున్నట్లు పార్టీ రాజ్యసభ ఉపనేత సాగరికా ఘోష్ వెల్లడించారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో స్పీకర్.. లోకసేభను సోమవారానికి వాయిదా వేశారు. ఇదిలావుంటే వందేమాతరం గేయానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో 'వందేమాతరం బిల్లు'ను ప్రవేశపెట్టింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరారు సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించే వారికి జైలుశిక్ష సహా ఇతర శిక్షలు విధించేలా, అలాగే గేయాన్ని పూర్తిగా ఆలపించాల్సిందేననే నిబంధనలనూ ఇందులో పొందుపరిచారు. అయితే.. ఈ బిల్లుపై విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలుపుతూ సభలోనే ఆందోళనకు దిగారు. బిల్లు వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రాజ్యసభ కార్యకలాపాలను సభాపతి సోమవారానికి వాయిదా వేశారు.

# పిల్లలే మన భవిష్యత్ ఆస్తి

**రంపచోడవరం,జూలై24 (సింగిడి):**

పిల్లలు ఆనందంగా చదువుకోవడానికి ఏర్పాట్లు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రంపచోడవరంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల కొరత లేదన్నారు. విద్యా వ్యవస్థకు ఉపాధ్యాయులే వెన్నెముక అని అన్నారు. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులను ప్రయోజకులుగా చేయడం టీచర్ల బాధ్యతన్నారు. పిల్లలందరికీ పౌష్టికాహారం ఇస్తున్నామని తెలిపారు. పీ4 కార్యక్రమంలో పేదవారిని ఆదుకునేలా కృషి చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో పిల్లలే ఆస్తి అని సీఎం తెలిపారు. పిల్లలు పుడితే భారం కాదని.. ఆదాయంగా మార్చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం డబ్బులు ఇస్తున్నామన్నారు. 67 లక్షల మంది పిల్లలకు రూ.10,120 కోట్లు జమ చేస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లోనే 5 లక్షల మందికి రూ.664 కోట్లు జమ చేస్తున్నామన్నారు. గిరిజనులకు ఐటీలో ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ఆగస్టు నుంచి సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ప్రతి ఇంటికీ సోలార్ ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఆర్థిక అసమానతలు తగ్గించి జీవన ప్రమాణాలు పెంచుతామని వెల్లడించారు. పది లక్షల కోట్లు అప్పులు ఉన్నా.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. విద్య పైనే ఎక్కువ దృష్టి సారించినట్లు తెలిపారు. పీటీఎం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అనుసంధానం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భవిష్యత్తులో పిల్లలే ఆస్తి. పిల్లలు పుడితే భారం కాదు.. ఆదాయంగా మార్చేశాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గిరిజన ప్రాంతాల్లోనే 5లక్షల మందికి రూ.664 కోట్లు వారి ఖాతాల్లో వేశామని చెప్పారు. ఆర్థిక అసమానతలు తగ్గించాలని ధ్యేయంగా పెట్టుకున్నాం. సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తూనే అభివృద్ధిని నడిపిస్తున్నాం. పీ4 కార్యక్రమంతో పేదవారిని ఆదుకునేలా కృషి చేస్తున్నాం. అప్పులు కాదు.. ఆదాయాన్ని పెంచాలి. పిల్లలు సమాజానికి ఉపయోగపడాలి. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉంది. విద్యా వ్యవస్థకు వెన్నెముక ఉపాధ్యాయులు. సమాజంలో టీచర్లకు మంచి గుర్తింపు ఉంది. శనివారం నో బ్యాగ్ డే అమలు చేస్తున్నాం. పిల్లలు ఆనందంగా ఉంటే బాగా చదువుతారు. అందుకే వారికి పౌష్టికాహారం అందిస్తున్నాం. ఆగస్టు నుంచి సంజీవని ప్రాజెక్టు రాబోతోందని సీఎం తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం
25-7-2026



అసంపూర్తి రోడ్డు పనులను..

# వేగంగా పూర్తిచేయాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

స్వయంగా రహదారిని పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ

**యాదాద్రి భువనగిరి జూలై 24 (నినాదం ):** ఆలేరు నియోజకవర్గం లోని ఆత్మకూరు మండలం నుండి మోత్కూరు వెళ్లే ప్రధాన రహదారిలో సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. శుక్రవారం ఆ మార్గంలో ప్రయాణిస్తున్న తెలంగాణ రాష్ట్ర రోడ్లు, రవాణా మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అక్కడే ఆగి రోడ్డు పరిస్థితిని స్వయంగా పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య , జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తో కలిసి రోడ్డు పరిస్థితిని పరిశీలించి, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత కాంట్రాక్టర్‌తో మంత్రి చరవాణీ లో మాట్లాడి పనులు నిలిచిపోవడానికి గల కారణాలపై వివరణ కోరారు. కాంట్రాక్టర్ కు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు నుంచి మూడు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించాలని సూచించారు. అదేవిధంగా యాదగిరి గుట్ట--తుర్కపల్లి రహదారిలో మిగిలి ఉన్న నిర్మాణ పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువులో పనులు ప్రారంభించకపోతే సంబంధిత టెండర్‌ను రద్దు చేసి, ఇతర ఏజెన్సీలకు అప్పగించి రోడ్డు నిర్మాణపు పనులు పూర్తి చేయిస్తామని



మంత్రి కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. ప్రజలకు అసౌకర్యం కలిగేలా పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోమని స్పష్టం చేశారు. దీనికి స్పందించిన కాంట్రాక్టర్, రెండు నుంచి మూడు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి, వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యాన్ని సహించబోమని, ఆలేరు నియోజకవర్గంలో చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఆర్ అండ్ బి అధికారి సరిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలను ప్రోత్సహించాలి

- విద్యార్థులకు ఆగస్టు నెలాఖరులోగా ఏకరూప దుస్తులు అందించాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, జూలై 24 (సింగిడి):** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగు వైపు మళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టించి ఆగస్టు నెలాఖరులోగా అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఏకరూప దుస్తుల పంపిణీ, ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం పరిస్థితులు, ఖరీఫ్ పంటల సాగు తదితర




అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులను ఆగస్టు నెలాఖరులోగా అందజేయాలని సూచించారు. అలాగే ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు మండలాల వారీగా విత్తన మేళాలను నిర్వహించి రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు యూనిఫాంల కుట్టింపుకు అవసరమైన వస్త్రాలు, ఇతర సామగ్రిని సకాలంలో అందజేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏకరూప దుస్తులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య, అవసరమైన యూనిఫాంల వివరాలను అధికారులతో చర్చించారు. జిల్లాలో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా ఆరుతడి పంటలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. క్రాప్ డైవర్సిఫికేషన్‌కు అవసరమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక అమలు చేసి, రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు పాల్గొన్నారు.

# కామన్ డైట్ మెనూ తప్పనిసరి పాటించాలి

జిల్లా కలెక్టర్ హైమావతి



**సిద్దిపేట బ్యూరో, జూలై 24 (సింగిడి):** జిల్లాలోని అన్ని గురుకులాల్లో విద్యార్థులతో మెస్ కమిటీలు వేసి, వంట సరుకులను వారి సమక్షంలో అందించాలని జిల్లా కలెక్టర్ హైమావతి ప్రిన్సిపల్ లను ఆదేశించారు. కోహెడ మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ శుక్రవారం రోజున ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, క్యాబేజీ, పప్పు, రసం, పెరుగులను తనిఖీ చేశారు. కూరలు నాణ్యతతో పాటు రుచికరంగా ఉన్నాయా అని విద్యార్థులతో ఆరా తీశారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని వండిన ప్రతి వంటకం రుచికరంగా విద్యార్థులందరికీ సరిపోయేలా వండాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. రికార్డు రాయకపోవడం పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట సిబ్బందికి సరుకులు అందించే ముందు గురుకులంలో విద్యార్థులతో వేసిన మెస్-కమిటీ సమక్షంలోనే అందించాలని ఇష్టానుసారంగా జూనియర్ అసిస్టెంట్, ఉపాధ్యాయులు, వంట సిబ్బంది వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి రోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం సంబంధించి సరుకులు కొలత ప్రకారం అందించినప్పుడే రికార్డులో రాయాలని ఇలా రాయకపోవడం పైన విచారణ జరపాలని డీసీఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు.

# ఆశా వర్కర్లకు రూ.18000/- వేతనం ఇవ్వాలి

- తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రేవతి కళ్యాణి

**అల్వాల్, జూలై 24(సింగిడి):** ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, కార్మిక వర్గ ప్రయోజనాల కోసం, మహిళల హక్కుల సాధన కోసం తన యావత్ జీవితాన్ని అంకితం చేసిన అమరజీవి, ప్రముఖ కమ్యూనిస్టు నేత లీలకామ్రేడ్ విమల్ రణదివే 26వ వర్ధంతి జరిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం రేవతి కళ్యాణి మాట్లాడుతూ ఆమెకు హృదయపూర్వక విప్లవ నివాళులు అర్పిస్తోంది. మహిళా కార్మికులను సంఘటితం చేసి, భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి బలమైన పునాదులు వేసిన కామ్రేడ్ విమల్ రణదివే నిరంతర పోరాట జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని సీఐటీయూ కొనియాడింది. 1915 ఏప్రిల్ 10న జన్మించిన ఆమె, కేవలం 15 ఏళ్ల ప్రాయంలోనే బ్రిటీష్ వలస పాలకులను ధైర్యంగా ఎదుర్కొని స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. క్షమాపణ చెప్పడానికి నిరాకరించి తన అచంచల దేశభక్తిని, ధైర్యాన్ని చాటుకున్నారు. పేదలు, కార్మికుల పట్ల ఉన్న ఆర్తితో కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని స్వీకరించిన ఆమె.. జైలు జీవితం, అజ్ఞాతవాసం వంటి కష్టాలను లెక్కచేయలేదు. 1946లో జరిగిన ముంబై కార్మిక వర్గం, నౌకాదళ సైనికుల చారిత్రాత్మక తిరుగుబాటులో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అనంతరం యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి కోమలి మాట్లాడుతూనేటి ఉద్యోగ మహిళల సమస్యలు కామ్రేడ్ విమల్ రణదివే ఆశయ సాధనలో భాగంగా, నేటి సమాజంలో మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై సీఐటీయూ పోరుబాటు సాగించనుంది. శ్రమిస్తున్నప్పటికీ అనేక రంగాల్లో మహిళలకు నేటికీ తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. 'సమాన పనికి సమాన వేతనం' చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లకు కార్మిక హోదా:లేలి అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం వంటి రంగాల్లో పనిచేస్తున్న లక్షలాది మంది మహిళలను ప్రభుత్వాలు 'కార్మికులుగా' గుర్తించి, రూ. 26,000 కనీస వేతనం, ఈఎస్ఐ పీఎఫ్ వంటి సామాజిక భద్రత



కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కే ఉన్నికృష్ణ మాట్లాడుతూ పని ప్రాంతాల్లో రక్షణ చట్టాలమలు ఐటీ, ఫ్యాక్టరీలు, సేవా రంగం, గిగ్ ఎకానమీ మరియు అసంఘటిత రంగాల్లో మహిళా ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలి. లైంగిక వేధింపుల నిరోధక చట్టం ప్రకారం ప్రతి పని ప్రదేశంలో 'అంతర్గత ఫిర్యాదుల కమిటీ' లను ఏర్పాటు చేసి కఠినంగా అమలు చేయాలి లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తాం హెచ్చరించారు. మహిళా కార్మికులను శాశ్వత స్వరూపం ఉన్న పనుల్లో సైతం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతుల్లో తక్కువ వేతనాలతో ప్రమాదపెడీ చేయడాన్ని అరికట్టి, ఉద్యోగ భద్రత కల్పించాలని,మాతాశిశు సంక్షేమం ఒ మౌలిక సదుపాయాలు:లేలి అన్ని రంగాల మహిళలకు 26 వారాల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, పని ప్రదేశాల్లో ఉచిత శిశు సంరక్షణ కేంద్రాలు, రాత్రి షిఫ్టుల్లో పనిచేసే మహిళలకు సురక్షిత రవాణా వసతి కల్పించాలని కోరారు.కామ్రేడ్ విమల్ రణదివే అందించిన పోరాట స్ఫూర్తితో.. కార్మిక వర్గంపై, ముఖ్యంగా మహిళా కార్మికులపై జరుగుతున్న అన్ని రకాల దోపిడీలు, లింగ వివక్షను అంతం చేయడానికి సీఐటీయూ పునరంకితమవుతోంది. ప్రతి కార్మికునికి హక్కులు, గౌరవం, సమానత్వం సాధించే వరకు, న్యాయబద్ధమైన సమాజ నిర్మాణం కోసం ఆమె ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా సీఐటీయూ ప్రతిజ్ఞ చేస్తోంది. ఈ కార్యక్రమంలో అల్వాల్ మచ్చ బొల్లారం ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# సకల సంపదలకు చదువువే ఆధారం

- వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి

**వికారాబాద్, జూలై 24(సింగిడి):** సకల సంపదలకు చదువువే మూలాధారమని వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మున్నిపాలిటీ పరిధిలోని అనంతగిరి పల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న వ్యక్తి ఈ ప్రపంచంలో ఎక్కడైనా జీవించగలడని అన్నారు. చదువుకునే ప్రాయంలో చదువు విలువ తెలియదని అన్నారు. విలువ తెలుసుకున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు. చదువే అసలైన ఆస్తిగా భావించాలని ఏ ఒక్క విద్యార్థి కూడా ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ఎప్పుడూ అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. విద్యతోనే వికాసమని



విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాకేష్, మాజీ కౌన్సిలర్ మురళి, టిపిసిసి రాష్ట్ర ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్. అనంతయ్య, పట్టణ వైస్ ప్రెసిడెంట్ రెడ్యా నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు. శ్రీకాంత్, బాలరాజు, గంగారం శ్రీకాంత్, సోషల్ మీడియా నందు, సాయి, హరి, తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్బంధంలో మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి

**నాచారం, జూలై 24 (సింగిడి):** బీఆర్ఎస్‌వీ నిరసన కార్యక్రమానికి వెళ్తున్న మల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిని గృహ నిర్బంధం చేసిన పోలీసులు. ఢిల్లీలో నీట్ బాధిత విద్యార్థులకు మద్దతుగా శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై కేంద్ర పోలీసు బలగాలు అమానుషంగా లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ, బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో ఫర్యాన్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి బయలుదేరిన మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిని పోలీసులు ఆయన నివాసంలోనే గృహ నిర్బంధం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన చర్య అని ఆయన అన్నారు. శాంతియుతంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి హాజరుకావడాన్ని అడ్డుకోవడం ద్వారా ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం దురదృష్టకరం అని ప్రజల గొంతుకను అణిచివేసే ప్రయత్నాలు ఎంత చేసినా



విద్యార్థుల పక్షాన బీఆర్ఎస్‌వీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగబద్ధమైన హక్కు ఉంది , అలాంటి హక్కును హరించే విధంగా వ్యవహరించడం పోలీసు యంత్రాంగానికి తగదు అని దేవేందర్ రెడ్డి అన్నారు.

# అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు ఫిర్యాదు

**అమనగల్లు, జూలై 24(సింగిడి):** ఆమనగల్లు పురపాలక సంఘం పరిధిలోని 13వ వార్డు, సర్వే నెం. 662/అ/2 లో చట్టవిరుద్ధంగా అనుమతులు లేకుండా డ్రిల్లింగ్, బ్లాస్టింగ్, అక్రమ మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ వార్డు కాలనీ వాసులు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు, సర్వే నెం. 662/అ/2లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పేలుళ్ల వల్ల భారీ శబ్దం, దుమ్ము కాలుష్యం ఏర్పడటమే కాకుండా, ఇళ్ల గోడలకు పగుళ్లు వస్తున్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పర్యావరణ నిబంధనలు, భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేసి సాగిస్తున్న



ఈ మైనింగ్ కార్యకలాపాలపై అధికారులు తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణ భద్రత, రాజ్యాంగబద్ధ హక్కులు మరియు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఈ ఫిర్యాదుపై అత్యవసరంగా స్పందించి తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవలసిందిగా కలెక్టర్‌కు వినతిపత్రం ద్వారా కోరినట్లు స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంతుక శివ, పులికంటి మహేష్, గోరేటి జగన్, వంకట్రామ భీమయ్య పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులు పూర్తి చేయాలి


- జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట బ్యూరో, జూలై 24(సింగిడి):** జిల్లా పరిధిలోని కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామ శివారులో దాదాపు 23 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులను జిల్లా కలెక్టర్ హైమావతి శుక్రవారం రోజున క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ ప్రాంతం మొత్తం కలియ తిరిగారు. రాష్ట్రంలోనే నిర్మాణ పురోగతిలో ఖమ్మం జిల్లా తో సమానంగా అగ్రస్థానంలో కొనసాగుతుందని, 23 ఎకరాల్లో అతి పెద్ద విద్యాసంస్థ అని చెప్పారు. మంచి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత కాల వ్యవధిలో యుద్ధ ప్రాతిపదికన పూర్తి



చేయాలని ఈడబ్ల్యూఐడీసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అధునాతన సాంకేతిక విధానంలో మై-వన్ టెక్నాలజీ తో ఎలాంటి ఇటుకలు వాడకుండా ఈ కాంప్లెక్స్ ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. చుట్టూ కొండల నడుమ పచ్చని చెట్ల మధ్య నిర్మితమవుతున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ రాష్ట్రంలో ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందని తెలిపారు.

# ఇందిరా పార్క్ వద్ద ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు





**కుత్బుల్లాపూర్, జూలై 24 (సింగిడి):** ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని తీవ్రంగా ఖండిస్తూ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు (కేటీఆర్) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన ధర్నా-నిరసన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ శంభీపూర్ రాజు తో కలిసి పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై దౌర్జన్యానికి పాల్పడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. విద్యార్థుల గొంతును అణచివేయాలని చూసే చర్యలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు వివరించారు.

# ఢిల్లీ నిరసనకారులపై పోలీసుల అత్యుత్సాహం సరికాదు



- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

**కొడంగల్, జూలై 24(సింగిడి):** నీట్ పరీక్ష పత్రాల లీకేజ్ పైన విద్యార్థులు ఢిల్లీ నడి బొడ్డున జంతర్,మంతర్ వద్ద నిరసన చేస్తున్న విద్యార్థులపై పైన ఢిల్లీ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ యువతీ, యువకుల పైన లాఠీచార్జీలు చేస్తూ, టియర్ గ్యాస్‌ను ఉపయోగిస్తూ అనేకమంది విద్యార్థిని విద్యార్థులను గాయపరిచి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని, ఈ లాఠీ చూటలకు యువతి మృతి పట్ల కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బుస చంద్రయ్యలు మాట్లాడుతూ పేపర్ లీకేజ్ పైన ప్రశ్నిస్తే పోలీసులు ఇలాంటి దుర్మానలకు పాల్పడడం సరికాదని ఢిల్లీ పోలీసులు మరిచిపోయి అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలా ప్రవర్తిస్తూ ఎంతో మంది విద్యార్థులను లాఠీలు,తూటాలతో పొట్టన పెట్టుకుంటున్నారని విమర్శించారు. నీట్ పరీక్ష పత్రాలు లీకేజీ నుంచి ప్రజల మైండ్ డైవర్ట్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆడుతున్న నాటకమే ఈ లాఠీ చార్జ్ అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా దేశ ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేసి, కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు అన్నారం సాయిలు, కెవిపిఎస్ నాయకులు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాములు, రైతు సంఘం నాయకులు కృష్ణ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకుడు వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ పై 26న అవగాహన సదస్సు

- మేడ్చల్ డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌కు ఆహ్వానం

**జవహర్ నగర్, జూలై 24 (సింగిడి):** పర్యావరణ పరిరక్షణ ఆరోగ్య భద్రత కోసం జరుగుతున్న అవగాహన సదస్సును విజయవంతం చేయాలని డంపింగ్ యార్డ్ పై ఈనెల 26న స్వర్గాంధ్ర డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగే అవగాహన సదస్సుకు పెద్ద ఎత్తున హాజరుకావాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ వాలి శివ బాబు పిలుపునిచ్చారు. చెత్త డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా ఈనెల 26వ తేదీన జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ ఆరోగ్య భద్రత జీవించే హక్కు పై డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో జరుగుతున్న అవగాహన సదస్సుకు మేడ్చల్ డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ను శుక్రవారం కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, రమేష్, చారి, సామాజిక నాయకులు బూడిద వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఎడిటోరియల్

Editorial

## బొద్దింకలను తేలికగా తీసుకోరాదు!

దేశంలో ఏ ఆందోళన జరిగినా దాని వెనక రాజకీయాలు ఉన్నాయని ఆరోపించడం పాలకులకు అలవాటుగా మారింది. అంతే తప్ప ఆ ఆందోళనల వెనక ఉన్న సత్యాలను గుర్తించడం లేదు. ఆక్రందనలను వినడం లేదు. ఆందోళనల వెనక ఉన్న సమస్యలను గుర్తించడం లేదు. దేశంలో కాంగ్రెస్, బిజెపిలు ఎవరు పాలకులుగా ఉన్నా జరుగుతున్నది ఇదే. రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా పాలనను కొనసాగిస్తున్నారు. దేశంలో ఇప్పుడు కాక్రోచ్ జనతాపార్టీ చేస్తున్న ఆందోళనను ముందే గ్రహించి, చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే పలు రకాలుగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. కానీ కేంద్రం చూసీచూడనట్లు ఉంటూ వచ్చింది. తమకు తోచిన విధంగా చర్యలు తీసుకుంది. మళ్లీ పరీక్ష నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. అయితే ఇప్పుడు బొద్దింకల ఆందోళన వెనక కేవలం ఒక్క నీట్ పరీక్ష మాత్రమే లేదన్న సత్యాన్ని ఇప్పటికీ పాలకులు గుర్తించడం లేదు. బొద్దింకలు ఎవరన్నదాని పై ఆరా తీసి, వారి వెనక పాకిస్తాన్, అమెరికా, కాంగ్రెస్, ఆప్ ఉందన్న ఆరోపణలను ముందుకేసి, సమస్యలను పక్కన పెడుతున్నారు. కానీ బొద్దింకల వెనక ఆక్రోశం ఉంది. ఆందోళన ఉంది. ఆవేదనా ఉంది. దీనిని అర్థం చేసుకోవడంలో, పరిష్కరించడంలో పాలకులు ఏళ్లుగా విఫలం అవుతున్నారు. ఎల్‌నినో వస్తే నీటి కరువు లేకుండా చేసుకునే ఆలోచనలు కూడా పాలకులల వద్దలేదు. జలవనరులను శాశ్వతంగా ఉపయోగించుకునే ప్రణాళికలు లేవంటే వీరిని ఏమనాలి. అందుకే ఇవన్నీ కలగలిపిన నిరసనలే ఢిల్లీలో బొద్దింకల ఆందోళనలకు ప్రతిరూపంగా చూడాలి. దేశాంలో నిరాశా,నిస్పృహలో ఉన్న యువత వేదిక కోసం చూస్తోంది. బొదింకల గుంపు వెనకాల ఉండి తమ ఆందోళనల ఆజ్యాన్ని పోశారు. అంతే తప్ప వీటి వెనక ఎవరున్నారన్నది వారికి అవసరం లేదు. బిజెపి 12 ఏళ్ల పాలనలో పేరుకుపోతున్న అనేకానేక సమస్యలపై యువతలో దాగివున్న ఆగ్రహం పెల్లుబికింది. అంతకుముందు యూపిఎ పదేళ్ల పాలనలోనూ ఇలాంటి కోపమే యువతలో ఆవహించింది. దానిని బిజెపి క్యాష్ చేసుకుని అధికారానికి వచ్చింది. అధికారంలో ఉన్న వారు సమస్యలను గుర్తెరిగి పరిష్కరించడం అలవాటు చేసుకోవడం లేదు. ఎసి గదుల్లో కూర్చుని పోలీసులు ఇచ్చిన నివేదికలను ముందేసుకుని చేస్తున్న చర్చ కారణంగా ప్రజల మనస్సులను తెలుసుకోలేక పోతున్నారు. దేశంలో ధరలు పెరుగుతున్నాయి. విద్య, వైద్యం ఖరీదైనదిగా మారింది. ఆస్పత్రులు మాఫియాగా మారాయి. ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలు లక్షల్లో ఫీజులు గుంజుతున్నాయి. నిరుద్యోగం ఏటికేడు పెరుగుతోంది. అలాగే రూపాయి విలువ పడిపోతోంది. ఇవన్నీ కూడా తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు. పాలకులు అన్నవారికి ఇవే ముఖ్యం కావాలి. కానీ సమస్యలను గుర్తించకుండా, వీటిపై ఎక్కడా మోడీ ప్రభుత్వం ఫోకస్ పెట్టిన దాఖలాలు లేవు. నాయకులు జీతాలు పెరిగాయి. అలా అనడం కన్నా పెంచేసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిల జీతాలు, భత్యాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకున్నారు. కార్లు, విమాన ప్రయాణాలు అన్నీ ప్రజల డబ్బుతోనే ఎంజాయ్ చేస్తున్నారు. అధికారంలోకి రాగానే కోట్లు వెచ్చించి బంగళాలు కట్టుకుంటున్నారు. ప్రాజెకట్‌ల పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్నారు. కమిషన్లకు కక్కుర్తి పడుతున్నారు. కానీ వీటివల్లల ప్రజలకు మిగిలింది సున్నా. తెలివి ఉండి కాస్తా చదువుకున్న వారంతా విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఇక్కడే ఉన్నవారు తిండికి లేక, ఉద్యోగం రాక, కూలీ దొరక్క అల్లాడిపోతున్నారు. చదువుకున్న వారి పరిస్తితి మరీ దయనీయంగా ఉంది. బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాత పెద్ద ఎత్తున పరిశ్రలమ స్థాపన లాంటివి జరగడం లేదు. ఉన్న పరిశ్రమలను మూసేస్తున్నారు. ఇలాంటివన్నీ కూడా నిరుద్యోగ, చదువుకున్న యువతలో అసహనం పెంచుతోంది. సర్ ప్రక్రియ లాంటిదే తీసుకుంటే చాలా క్లిష్టంగా ఉంది. చదువుకున్న వారే ఈ ప్రక్రియలో పాల్గొనడం కష్టంగా ఉంది. దేశంలో మోసాలు, దగాలు, రకరకాల ఆన్‌లైన్ మోసాలు పెరిగాయి. చట్టాలు ఉన్నా, ఉన్నవాడికే చుట్టంగా మారాయి. ప్రధాని మోడీ ప్రజలతో మమేకం అయి వుంటే ఇవన్నీ తెలిసేవి. కానీ మోడీ పార్లమెంటుకు రావడం తక్కువే. అక్కడ చర్చలో పాల్గొనడం కూడా తక్కువే. గతంలోలాగా ఇప్పుడు పార్లమెంటులో చర్చలకు అవకాశం లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణులను వ్యతిరేకించే వారంతా రోడ్డెక్కుతున్నారు. ఆక్రమిత కాశ్మీర్ కావచ్చు, అర్జెంటీనా కావచ్చు... ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగుతున్నారు. సమస్య చిన్నదే అని మనం అనుకుంటే సరిపోదని గుర్తించాలి. ఎందుకంటే అంతరాంతరాల్లో దాగివున్న ఆందోళనలకు, ఆగ్రహానికి ప్రతిరూపమే కాక్రోచ్ ఉద్యమం. గనులు, భూములు, ఫ్యాక్టరీల మీద ఆధిపత్యం ఉన్నవాళ్లంతా అధికారంలో ఉంటున్నారు. ఆ సంపదపై ఆధిపత్యాన్ని కొనసాగించటానికి అధికారం అడ్డం పెట్టుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో సోషల్ మీడియా ప్రజాగ్రహాన్ని కొంతమేరకు కదిలించేలా చేయగలుగుతోంది. కోట్లాది గొంతుకలను ఏకం చేస్తోంది. గతంలో ఎప్పుడూ ఇంతటి వైవిధ్య, విశాల వేదిక ప్రజలకు అందుబాటులో లేదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించలేని పరిస్థితిని సృష్టించిన తర్వాత సోషల్ మీడియానే జననాడిగా మారుతోంది. అసమ్మతులకూ, అసంతృప్తులకూ వేదికగా మారక తప్పటంలేదు. టీవీలూ, పత్రికలూ అధికార పార్టీలకు బాకాలుగా మారిన ప్రస్తుత ప్రపంచంలో సోషల్ మీడియా ప్రజలను ఏకతాటిపైకి తెస్తోంది. అన్ని దేశాల్లోనూ యువత సోషల్ మీడియానే ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలను ప్రశ్నించటం మొదలు పెట్టారు. పాలకులు చేస్తున్న తప్పులపై ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తున్నారు. జవాబుదారీతనం కోసం డిమాండు చేస్తున్నారు. అలా చేయడంలో భాగంగానే నీట్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగిపోవాలని కోరటం ద్వారా కాక్రోచ్ పార్టీ కార్యక్షేత్రంలోకి దిగింది. పనీపాటాలేని కొందరు యువత సోషల్‌మీడియా ద్వారా అనవసరంగా యాగీ చేస్తున్నారనీ, సమాజ జీవనానికి వారు బొద్దింకలుగా మారారని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసినట్లుగా వచ్చిన వార్తలు దావానలంగా మారి ఒక ఉద్యమరూపాన్ని సంతరించుకోవటం యాదృచ్ఛికం కాదు. ఇది ఒక ప్రేరణ మాత్రమే. ప్రతిపక్షాలు కూడా విశ్వసనీయత కోల్పోవడంతో యువత ఇక తామే కార్యక్షేత్రంలోకి దిగడం అన్నది కాక్రోచ్ పార్టీని చూస్తే అర్థం అవుతోంది. నైతిక బాధ్యతే లేకపోతే ప్రజాస్వామ్యానికి విలువే లేదు. ప్రజాస్వామ్యం,జవాబుదారీతనం కోసమే యువత వీధులకు ఎక్కింది. 2011 నాటి అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం, శ్రీలంకలో ఆర్థిక సంక్షోభానికి వ్యతిరేకంగా సాగిన నిరసనలు, బంగ్లాదేశ్ విద్యార్థుల ఆందోళనలు, నేపాల్‌లో తిరుగు బాటు, కెన్యాలో జెన్‌జీ ఉద్యమం లాంటివన్నీ సోషల్ మీడియానే అధికంగా ఉపయోగించుకున్నాయి. పాలకుల అపసవ్య విధానాలపై ప్రశ్నలు తలెత్తగానే స్పందించి ఉంటే సమస్యలు రావు. బొద్దింకలు ఎన్ని మందుల కొట్టినా, పుట్టుకుని వస్తూనే ఉంటాయి. పరిష్కారం చూపనంతవరకు సమస్యలు పుడుతంటాయి. యువత పాలకులను ప్రశ్నిస్తూనే ఉంటుంది. పాలకుల ఆలోచనా విధానం మారాలి. దేశం కోసం అసవర మైన పనులనే చేయాలి. అప్పడే దేశం బాగుపడుతుంది. మాటలతో ఎంతోకాలం మభ్య పెట్టలేమని గుర్తిస్తే, బొద్దింకల బాధా ఉండదు.

తెలుగు సినిమాకు శోభను చేకూర్చిన

## నటరత్నం కైకాల సత్యనారాయణ

నేడు కైకాల సత్యనారాయణ జయంతి

తెలుగు వెండితెరపై నటనకు గౌరవాన్ని తీసుకొచ్చిన గొప్ప నటుల్లో కైకాల సత్యనారాయణ పేరు శాశ్వతంగా నిలిచి పోతుంది. పాత్రను ప్రాణంగా భావించిన ఆయన, విలక్షణ నటనకు, గంభీర స్వరానికి, ఆచరణాత్మక అభినయానికి నిలువెత్తు రూపం. ఆరు దశాబ్దాల సినీ జీవితం ద్వారా తెలుగు సినిమా వైభవానికి నిలువెత్తు రూపంగా నిలిచిన అద్భుత నటుడు. ఆయనకు "నవరస నటనా సార్వభౌముడు" అనే బిరుదు మరిచిపోలేని గౌరవం.

తెలుగుదేశం పార్టీ తరఫున లోక్‌సభకు ఎన్నికై పార్లమెంటులో సేవలందించారు. సినీ రంగంలోనూ, రాజకీయాల్లోనూ స్పష్టత, చిత్తశుద్ధితో ప్రజలతో మమేకమయ్యారు. ఎన్టీఆర్ కు అత్యంత సన్నిహితుడిగా, నమ్మకమైన సహచరుడిగా ఆయన రాజకీయ చరిత్రలో చోటు సంపాదించారు.

కైకాల ప్రత్యేక గొంతు ఆయుధంగా, నటన కవచంగా పనిచేసింది. అతిశయంగా కాకుండా, అర్థవంతంగా పలికే ఆయన గళం ప్రతి డైలాగ్‌ను తగిన బరువుతో ప్రేక్షకులకు అందించేది. "నన్ను పిలిచేది నీవేనా?" వంటి అనేక సంభాషణలు వెండితెరపై మోత మోగించినవి. డబ్బింగ్ కళాకారుడిగా కూడా తన గొంతుతో పాత్రలకు బలాన్నిచ్చారు.

మానవతా విలువలకు నిత్యం నిలబడిన కైకాల సత్యనారాయణ 2011లో "కైకాల సత్యనారాయణ ఫౌండేషన్"ను స్థాపించారు. దీని ద్వారా వృద్ధ కళాకారులకు, అశక్తులకు ఆర్థిక సహాయం అందించారు.



1935 జూలై 25న కృష్ణా జిల్లా కౌతరం గ్రామంలో జన్మించిన కైకాల సత్యనారాయణ చిన్ననాటి నుంచే కళల పట్ల ఆకర్షణ కలిగినవారు. విజయవాడలో విద్యనభ్యాసం చేసిన ఆయన, నటుడిగా ఎదగాలనే ఆశయంతో మద్రాసు వెళ్లారు. తొలి చిత్రం "సిపాయి కూతురు" (1959) ఆయనను వెండితెరకు పరిచయం చేసింది. ఆ చిత్రం ఆశించిన విజయం సాధించక పోయినా, కళపై నిబద్ధత ఆయనను వెనక్కి తిప్పలేదు. ఎన్టీఆర్ రూప సారూప్యత ఉండటం వల్ల కొంత కాలం డూప్‌గా పని చేసిన ఆయన, ఆ అనుభవాన్ని తన శక్తిగా మలచు కున్నారు.

చలన చిత్రాల్లో ప్రతినాయకుడిగా, సహాయ నటుడిగా, పాత్రల్లో ప్రతి భావాన్ని పండించే పాత్రధారుడిగా తనదైన ముద్ర వేసుకున్నారు. పాలు చిత్రాల్లో ఆయన పాత్రలు ప్రేక్షకుల హృదయాలను తాకే స్ఫూర్తిదాయక రూపాలు.

పౌరాణిక చిత్రాల్లో యముడు, రావణాసురుడు, ఘటోత్కచుడు, భీముడు, దుర్యోధనుడు లాంటి పాత్రలు ఆయన చేతల్లో సజీవంగా మారాయి. ప్రతి పాత్రలో రసాత్మకత, వ్యంగ్య బాణాలు, చతురత భరిత సంభాషణలతో జీవం పోశారు. జానపద చిత్రాల్లో మాంత్రికుడిగా, రాజుగా, పౌరాణిక పాత్రలలో దేవతల వ్యతిరేక శక్తిగా కనిపించినా, పాత్రను సజీవంగా చూపడంలో ఆయనకి సమానులు లేరు. కథానాయకుడిగా కూడా మంచి విజయాలు సాధించిన ఆయన పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించారు.

1996లో మచిలీపట్నం నియోజకవర్గం నుండి

కేవలం నటుడిగా కాకుండా సేవా దృక్పథంతో జీవించిన వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు.


777కు పైగా చిత్రాల్లో నటించిన ఆయనకు "రఘుపతి వెంకయ్య" లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, నంది అవార్డులు, ఫిల్మ్‌ఫేర్ గౌరవాలు లభించాయి. ఇది, ఆయన శ్రమ, అంకితభావానికి గుర్తింపు. పౌరాణికం నుంచి ఆధునికం వరకు, సామాజికం నుంచి కుటుంబ కథా చిత్రాల వరకూ ప్రతి కోణంలో ఆయన నాటనా నైపుణ్యం మెరిపించింది.

2022 డిసెంబరు 23న ఈ మహా నటుడు పరమపదించారు. కానీ ఆయన నటన, గళం, గొప్పదనానికి మరణం లేదు. ఆయన జీవితానుభవం, నటనా అర్థవంతత, పాత్రల వైవిధ్యం తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతాయి.

"నటించటం నా జీవం -- భావాలే నా ఆయుధం" అన్నట్టు జీవించిన కైకాల సత్యనారాయణ తెలుగు సినిమాకు వరంగా వచ్చిన నటరత్నం. ఆయన నటనా స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకంగా మిగిలి పోతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## ధర్మమే జీవనానికి మూలం అని చాటి చెప్పే "తొలి ఏకాదశి "



ఆషాఢ శుద్ధ ఏకాదశి పుణ్యదినం,
ఆధ్యాత్మిక వెలుగుల తొలి కిరణం.
హరి నామస్మరణే జీవన ధ్యేయం,
భక్తి మార్గమే శాశ్వత శ్రేయం.


ఉపవాస దీక్షతో మనసు నిర్మలం,
విష్ణు చరణాల్లో భక్తి అర్పణం.
తులసి దళంతో పూజ సమర్పించి,
కరుణాకటాక్షం కోరుదాం నమించి.

పాండురంగుని నామమే పరమ మంత్రం,
గోవింద నినాదమే జీవన తంత్రం.
పాపాలన్నీ తొలగించే పవిత్ర వేళ,
ప్రేమతో నిండే ప్రతి హృదయమే నిల.

తొలి ఏకాదశి తెచ్చే శుభ సందేశం---
ధర్మమే జీవనానికి నిజమైన దిశ.
శ్రీమన్నారాయణుని కృప ఎల్లవేళలా ఉండగా,
సుఖశాంతులు నిండాలి ప్రతి ఇంటిలో నిత్యంగా.

తొలి ఏకాదశి తెలుగు వారు పవిత్రంగా భావించే తిథుల్లో ఏకాదశి ఒకటి. ప్రతినెలలో రెండుసార్లు ఏకాదశి తిథులు ఉన్నప్పటికీ, ఆషాఢమాసంలో వచ్చే తొలి ఏకాదశికి ప్రాధాన్యత ఇస్తారు. లోక రక్షకుడైన శ్రీమహావిష్ణువు అనుగ్రహంతో అకాల మృత్యుహరణంతో పాటు మోక్షప్రాప్తి కోసం ఈ రోజున కఠిన నియమాలతో ఉపవాస వ్రతాలు ఆచరిస్తుంటారు.

తొలి ఏకాదశి సందర్భముగ వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు.హిందువులు పవిత్రంగా భావించే తిథుల్లో ఏకాదశి ఒకటి. ఆషాఢమాసంలో వచ్చే తొలి ఏకాదశికి ప్రాధాన్యమిస్తారు. దీనితోనే పండుగలు ప్రారంభమవుతాయి. తొలిఏకాదశి సందర్భంగా శనివారం వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారుతెలుగు వారు పవిత్రంగా భావించే తిథుల్లో ఏకాదశి ఒకటి. ప్రతినెలలో రెండుసార్లు ఏకాదశి తిథులు ఉన్నప్పటికీ, ఆషాఢమాసంలో వచ్చే తొలి ఏకాదశికి ప్రాధాన్యత ఇస్తారు. లోక రక్షకుడైన శ్రీమహావిష్ణువు అనుగ్రహంతో అకాల మృత్యుహరణంతో పాటు మోక్షప్రాప్తి కోసం ఈ



రోజున కఠిన నియమాలతో ఉపవాస వ్రతాలు ఆచరిస్తుంటారు. సంప్రదాయవాదులు అందరూ ఈ తిథితోనే పండుగల ప్రస్థానం మొదలవుతున్నట్లుగా భావిస్తారు. మోక్ష సాధనకు మనసును మహా విష్ణువుపైన లగ్నం చేసి ఆరాధించడమే ఏకాదశి పండుగ ప్రత్యేకం. ఏకాదశి రోజున ఉపవాస దీక్షలు ఆచరించి తెల్లవారాక అంటే ద్వాదశి రోజున ఎవరికైనా భోజనం పెట్టి ఉపవాస దీక్ష విరమిస్తే లక్ష్యం సిద్ధిస్తుందని నమ్ముతారు. లోకాలన్నింటినీ పరిపాలించే శ్రీమహావిష్ణువు జగద్రక్ష విధుల్లో అలసిపోయాక విశ్రాంతికోసం యోగానిద్రలోకి వెళ్లేరోజు తొలి ఏకాదశి. అందుకే దీనిని శయనైకాదశిగా వ్యవహరిస్తారు. తిరిగి నాలుగు నెలల తర్వాత కార్తీక మాసంలోని ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు మేల్కొంటాడు. దీన్ని ఉత్థాన ఏకాదశిగా, వైకుంఠ ఏకాదశిగా వ్యవహరిస్తారు. మహావిష్ణువు యోగానిద్రలో ఉన్నంత కాలం ఆయన ప్రసన్నత కోసం నాలుగు నెలల పాటు చాతుర్మాస వ్రతాలు పాటిస్తారు. ఈ కాలంలో వచ్చే వర్షాలతో క్రిమి కీటకాదులు సంచరిస్తాయి. కాబట్టి ఆశ్రమవాసులు అంతా బయటకు రాకుండా నాలుగు నెలల పాటు మహావిష్ణువు నామస్మరణలో గడుపుతారు.

**పుణ్యప్రదం.. ఏకాదశి వ్రతం**
ఉత్తరాయణంలో కంటే దక్షిణాయనంలో పర్వదినాలు ఎక్కువగా వస్తాయి. వాతావరణంలో మార్పులు ఎక్కువగా సంభవిస్తుంటాయి. ఈ కాలంలో ఆరోగ్య పరిరక్షణ నియమాలు పాటించాలి. అందుకే పెద్దలు ఈ కాలంలో వ్రతాలు, పూజలు ఆచరించాలని నిర్దేశించారు. తొలి ఏకాదశి ఉపవాస దీక్ష ఆరోగ్యపరంగా మేలు చేస్తుందన్న మాట. చాతుర్మాస కాలంలో ఆహార



నియమాలను పాటిస్తూ విష్ణు నామస్మరణలో కాలం గడిపితే పుణ్యప్రదమే కాకుండా ఆరోగ్య పరిరక్షణ జరుగుతుందని నమ్మి పూర్వీకులు ఈ నియమాన్ని విధించారు. ఏకాదశి రోజు ఉపవాస దీక్ష పాటిస్తే, అశ్వమేధయాగం నిర్వహించిన ఫలితం దక్కుతుందని విశ్వసిస్తారు. ఏకాదశి రోజున నియమ నిష్ఠలతో ఉపవాసం, రాత్రంతా జాగరణ చేసి స్వామిని సేవిస్తారు. మరుసటి రోజున ఉదయానే స్నానానంతరం శ్రీహరి పూజచేస్తారు పురోహితులు, పుణ్యమూర్తులను పిలిచి అన్నదానం చేసి తాము భుజించి దీక్ష విరమిస్తారు.

**"పిండి వంటలకు ప్రాధాన్యం..."**
తొలి ఏకాదశి పండుగను హిందువులు ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ రోజున పిండి వంటలు చేసుకుంటారు. సకినాలు, గారెలు, అరిశెలు, చెగోడీలు వంటి పిండి పదార్థాలు తయారు చేయడంలో మహిళలు తీరిక లేకుండా గడుపుతుంటారు.

**తొలి పండుగ ఏకాదశి...**
ఆషాఢమాసం శుక్లపక్ష ఏకాదశి నాడు విష్ణుమూర్తి పాల కడలిపై యోగానిద్రలోకి వెళ్లడాన్ని తొలి ఏకాదశిగా పరిగణిస్తారు. వానకాలంలో వచ్చే మొదటి ఏకాదశి కనుక దీనిని తొలి ఏకాదశి అంటారు. ఏకాదశి అంటే పదకొండు. ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, మనస్సు కలిపి మొత్తం పదకొండు, వీటిని మనిషి తన ఆధీనంలోకి తీసుకువచ్చి వాటిన్నింటినీ ఒకటిగా చేసి, అప్పుడు దేవుడికి నివేదన చేయాలి. దీనివలన మనిషికి సహజంగా అలవడే బద్ధకం దూరమవుతుందని, రోగాలు దరిచేరకుండా ఉంటాయని, ఇంద్రియ నిగ్రహం పెరుగుతుందని నమ్మకం.ఈ పండగని భక్తి భావం తో జరుపు కుందాం ఈ పండగ ప్రాధాన్యతని అందరికీ తెలియచేద్దాం.

**కామిడి సతీష్ రెడ్డి**
**జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా**
**జూలై 25 న తొలి ఏకాదశి పండగ సందర్భంగా**
**9848445134**

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం
25-7-2026

## ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందించాలి



- సీఎస్ సంజయ్ జాజు

**పెద్దపల్లి, జూలై 24(సింగిడి):** రాష్ట్రంలోని ప్రభుత్వ, రెసిడెన్షియల్, కేజీబీవీ, మోడల్ పాఠశాలల విద్యార్థులందరికీ ఆగస్టు 30 నాటికి రెండు జతల నాణ్యమైన యూనిఫాంలు అందించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన యూనిఫాంల కుట్టు పనుల పురోగతితో పాటు ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంపై సమీక్ష నిర్వహించారు. జూలై 27 నుంచి 29 వరకు రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలను విజయవంతం చేయాలని, నీటి కొరత దృష్ట్యా వరికి బదులుగా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. యూనిఫాంల నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండకూడదని, మహిళా స్వయం సహాయక సంఘాల టైలర్ల ద్వారా కుట్టు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## తాత ఆశయాలను కొనసాగిస్తా



- వొడితల ప్రణవ్..
- ఘనంగా వొడితల
- రాజేశ్వర్ రావు వర్ధంతి

**జమ్మికుంట, జూలై 24 (సింగిడి):** రాజ్యసభ సభ్యుడిగా,రాజకీయాల్లో ప్రభుత్వం క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు ఆనాటి భారత ప్రధానమంత్రి పీవీ నరసింహారావు కు చేదోడువాదోడుగా ప్రభుత్వాన్ని నిలబెట్టడంలో కీలక కృషి చేసిన మహానుభావుడు వొడితల రాజేశ్వర్ రావు అని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం నాడు ఆయన వర్ధంతి సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ప్రణవ్. ఈ సందర్భంగా హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు,ఆయన అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హుజూరాబాద్ పార్టీ కార్యాలయంలో ఇంచార్జి ప్రణవ్,సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి రాజేశ్వర్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్ష ఉండకూడదని విద్యాసంస్థలను నెలకొల్పి వారికి ఉచిత విద్యను అందించారని, ఈ ప్రాంత బిడ్డగా నియోజకవర్గానికి సంబంధించి అనేక అభివృద్ధి పనులు రాజ్యసభ సభ్యుడిగా చేశారని,ఇప్పటికీ వారి అభివృద్ధి ఆనవాళ్లు ఇంకా ఉన్నాయని అన్నారు. వారు చూపిన బాటలో ప్రజలకు మరింత సేవ చేస్తానని ప్రణవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,వైస్ చైర్మన్ అంజలి,కౌన్సిలర్లు,దేవాలయాల చైర్మన్లు,వ్యవసాయ మార్కెట్ చైర్మెన్లు,డైరెక్టర్లు,అన్ని మండలాల,పట్టణ అధ్యక్షులు,వివిధ గ్రామాల సర్పంచులు,వార్డ్ సభ్యులు,బ్లాక్ కాంగ్రెస్,బీసీ ఎస్సీ,యువజన,సేవాదళ్,అనుబంధ సంఘాలు,సోషల్ మీడియా,యూత్ కాంగ్రెస్, మైనారిటీ నాయకులు,సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలే మంథని అభివృద్ధికి సాక్ష్యం





- మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్

**మంథని , జూలై 24 (సింగిడి):** మంథని నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలే సాక్ష్యమని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని మంథని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో మంథని నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ప్రధాన రహదారుల నిర్మాణంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో రూ. 20 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జేఎన్టీయూ కళాశాల, రత్నాపూర్ ఇండస్ట్రియల్ పార్క్, అడవి సోంపల్లి ఇంటర్నేషనల్ స్కూల్, గోదావరిపై వంతెన వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు మంథని అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేయడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని, ఇటువంటి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ సహించబోదని హెచ్చరించారు.

## విధి నిర్వహణలో ఆగిన ఫైర్ కానిస్టేబుల్ గుండె



**జమ్మికుంట, జూలై 24 (సింగిడి):** పోలీసు విధులు నిర్వహిస్తున్న సమయంలో అగ్నిమాపక కేంద్రంలో డ్రైవర్ గా పని చేస్తున్న ఓ పోలీస్ గుండె ఆగింది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న మోటం అరవింద్(29) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం వేళ విధినిర్వహణలో ఉండగా వాకింగ్ చేసేందుకు బయటకు వెళుతున్న తరుణంలో ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి ఉద్యోగులు సి పి ఆర్ చేసి హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గత సంవత్సరం క్రితం వీణవంక మండల కేంద్రానికి చెందిన అరవింద్ కు ఇల్లందకుంట మండలం టేకుర్తి గ్రామానికి చెందిన ఓ యువతితో గత తొమ్మిది మాసాల క్రితం వివాహం జరిగింది. కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

# ఎల్ఎండీ నీటి నిల్వలపై నిత్య పర్యవేక్షణకు ఆదేశం

- తాగునీటి సమస్యకు ముందస్తు చర్యలు చేపట్టాలి
- పైపులైన్ లీకేజీలు, అక్రమ నల్లా కనెక్షన్లపై కట్టడి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, జులై24(సింగిడి):** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మిషన్ భగీరథతో పాటు ఇతర తాగునీటి సరఫరా వ్యవస్థల్లో అంతరాయం లేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మిషన్ భగీరథ, ప్రజారోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తాగునీటి సరఫరా, నీటి నిల్వలు, వినియోగం, పొదుపు చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. పైపులైన్ లీకేజీలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, పనిచేయని బోర్లను మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కొత్తపల్లి--ఎలగందుల, బొమ్మకల్, విద్యారణ్యపురి, అలుగునూరు, చింతకుంటతో పాటు ఇటీవల విలీనమైన గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి మున్సిపాలిటీలు, గంగాధర, గన్నేరువరం మండలాల్లో నీటి అవసరాలు, సరఫరా పరిస్థితులను సమీక్షించారు. ఎల్ఎండీ జలాశయంలో నీటి నిల్వలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ డెడ్ స్టోరేజ్ పరిస్థితి రాకముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గన్నేరువరం మండలంలోని హనుమాజిపల్లి--జంగంపల్లి ప్రాంతాల్లో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, గంగాధర మండలంలోని నారాయణపూర్ చెరువు నీటిని గంగాధర, చొప్పదండి మండలాల తాగునీటి అవసరాలకు వినియోగించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా ఓవర్‌హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, పైపులైన్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించి నీటి వృథాను అరికట్టాలని ఆదేశించారు. ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృత అవగాహన కల్పిస్తూ, తాగునీటి సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్లు రామ్‌కుమార్, సందీప్‌కుమార్, ప్రజారోగ్య శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ సంపత్‌రావు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో సీబీఎస్ఈ క్లస్టర్--7 ఖో-ఖో పోటీల ప్రారంభం

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు అతిథుల పిలుపు

చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ అశ్విని తనాజీ



**కరీంనగర్, జులై24(సింగిడి):** కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో సీబీఎస్ఈ క్లస్టర్--7 ఖో-ఖో పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ అశ్విని తనాజీ వకాడే, సహాయ కలెక్టర్ పి. హరిప్రసాద్, సీబీఎస్ఈ ప్రాంతీయ అధికారి జంగం సునీల్ కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా సరస్వతి మాత విగ్రహానికి పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలనతో పోటీలను ప్రారంభించారు. విద్యార్థుల కేరింతల మధ్య క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపైనా దృష్టి సారించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను పెంపొందించి, ఒత్తిడిని తగ్గిస్తాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు, ఏకాగ్రత, క్రమశిక్షణ అలవడతాయని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలు జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు పొందాయని, సంస్థ అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, అల్ఫోర్స్‌లో క్రీడలకు పెద్దపీట వేస్తూ, అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయులతో శిక్షణ అందిస్తున్నామని, విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సీబీఎస్ఈ ప్రాంతీయ అధికారి జంగం సునీల్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం నిర్వహించే క్లస్టర్ క్రీడల్లో విద్యార్థులు నిబంధనలు పాటిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీబీఎస్ఈ పరిశీలకుడు భరత్ కుమార్, కరీంనగర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై. మహేందర్ రావు, తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ రిఫరీల బోర్డు కన్వీనర్ వి. సూర్యప్రకాశ్, కార్పొరేటర్ వాసాల రమేష్, బీజేపీ సీనియర్ నాయకుడు వేముల చంద్రశేఖర్, డాక్టర్ కెప్టెన్ బి. మధుసూదన్ రెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల డిమాండ్లు వెంటనే నెరవేర్చాలి

నిర్బంధాలతో గొంతు నొక్కలేరు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని ప్రభుత్వాలకు హెచ్చరిక

ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు



**కరీంనగర్, జులై24(సింగిడి):** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నెరవేర్చాలని ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనలను రాజకీయాలకు వేదికగా మార్చకుండా, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. శుక్రవారం కరీంనగర్‌లో దేశవ్యాప్త విద్యార్థుల నిరసనలకు సంఘీభావంగా నిర్వహించిన విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడి చదివిన విద్యార్థుల ఆశలు, తల్లిదండ్రుల కలలు ప్రశ్నాపత్రాల లీకేజీలతో దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాల వల్ల పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోగా, లక్షలాది మంది భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక పరీక్షలో జరిగిన లోపం మాత్రమే కాకుండా దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతకు మచ్చగా మిగిలిందన్నారు. నాణ్యమైన విద్య, పారదర్శక పరీక్షా విధానం కోసం ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఖండించారు. శాంతియుతంగా ఆందోళన చేసిన విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకుని, వారికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ అక్రమాల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఫీజు తిరిగి చెల్లింపు, వసతి భత్యాలు, ఉపకార వేతనాలు సకాలంలో విడుదల చేయాలని కోరారు. అలాగే ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షలను పారదర్శకంగా నిర్వహించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు నిరుద్యోగ యువత సమస్యలను నిర్లక్ష్యం చేస్తే తీవ్ర అసంతృప్తి నెలకొనే ప్రమాదం ఉందని హెచ్చరించిన ఆయన, పరిస్థితిని దుర్వినియోగం చేసేందుకు ప్రయత్నించే సంఘవ్యతిరేక శక్తుల పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కన్నం లక్ష్మణ్, కూరతోట సురేందర్, కల్వకుంట్ల వంశీధర్‌రావు, బండ సుధాకర్‌రెడ్డి, జనగామ కరుణాకర్‌రావు, పిన్నింటి లక్ష్మణ్‌కుమార్, జంపాల బాబు, పోల్సాని సునీల్, కనపర్తి సాయి, మిరుదొడ్డి అనిల్, భరత్, మంద మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశ తలరాత మార్చే శక్తి యువతకే ఉంది

యువతపై బిజెపి సర్కార్ దాడి హేయమైన చర్య

మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ నిరసన




**జమ్మికుంట జులై 24 (సింగిడి):** ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర బీజేపీ సర్కార్ కొనసాగిస్తున్న అణచివేత కు నిరసనగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ యువతతో పెట్టుకుంటే దేశాలే సర్వనాశనం అయ్యాయని అన్యాయంగా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నది కేంద్ర ప్రభుత్వమని మండిపడ్డారు. యువత విద్యార్థుల స్వరం మారుతోంది నవతరం మేల్కొంటుందని ఈ తరం యువకులు సీబీఐ, ఈడీ, ఐటీ బెదిరింపులకు భయపడదని విద్యార్థులు కోరేది అధికారం కాదు న్యాయం, భవిష్యత్తు మాత్రమే 2 కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చి యువతను మోసం చేశారని అన్నారు. మేక్ ఇన్ ఇండియా అని చెబుతూ లీక్ ఇన్ ఇండియా గా మార్చారని ఇది రాజకీయ కార్యక్రమం కాదని విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై కేసులు వెంటనే ఎత్తివేయాలని భవిష్యత్ నిర్మాతలైన యువత కు కేంద్రం జవాబు చెప్పాల్సిందే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ కౌన్సిలర్స్ కొలుగూరి సురేష్ మంద రాజేష్ పొన్నగంటి రాము మైనార్టీ నేత జానీ టిఆర్ఎస్వి నాయకులు కొమ్ము నరేష్ పాల్గొన్నారు.

## వినాయక నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

- అన్ని మండపాలకు ఉచిత విద్యుత్, రహదారులు పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి
- మేయర్ కొలగాని శ్రీనివాస్




**కరీంనగర్, జులై24(సింగిడి):** కరీంనగర్ నగరంలో రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆదేశాల మేరకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లకు అధికారులు చర్యలు ప్రారంభించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మేయర్ ఉత్సవాల ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. వినాయక మండపాలకు వెళ్లే ప్రధాన రహదారుల్లో గుంతలు పూడ్చడం, అవసరమైన చోట్ల రహదారి మరమ్మతులు చేపట్టడం, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, తాగునీటి సౌకర్యాలు కల్పించడం వంటి పనులను ఉత్సవాలకు ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలోని అన్ని వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులతో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. మండపాల విద్యుత్ బిల్లులను నగరపాలక సంస్థ నిధుల ద్వారా చెల్లించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని టవర్ సర్కిల్‌ను ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణలు, ఆకర్షణీయ అలంకరణలతో సుందరీకరించనున్నట్లు తెలిపారు. అలాగే విద్యుత్, మున్సిపల్, పారిశుధ్య తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి బాధ్యతలను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యం మరియు అన్ని శాఖల సమన్వయంతో ఈసారి వినాయక నవరాత్రి ఉత్సవాలను గతంలో కంటే మరింత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మండపాల నిర్వాహకుల విజ్ఞప్తులను పరిశీలించి అవసరమైన సౌకర్యాల కల్పనకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఉత్సవాలు ప్రశాంతంగా సజావుగా జరిగేలా నగరపాలక సంస్థ అన్ని విధాలుగా చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు.

## చిన్న దూరమైనా హెల్మెట్ తప్పనిసరి

**గోదావరిఖని, జూలై 24(సింగిడి):** చిన్న దూరం ప్రయాణమైనా హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. శుక్రవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ చౌరస్తాలో ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రజలకు సూచనలు చేశారు., ట్రాఫిక్ నిబంధనలు ప్రతి రహదారిలో అమలులో ఉంటాయని సీఐ లు స్పష్టం చేశారు.



## ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమే

మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్




**జమ్మికుంట, జూలై 24 (సింగిడి):** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని సుమారు 30 సంవత్సరాలుగా పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత సుధాకర్ సార్ కు దక్కుతుందని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులుగా పదవి విరమణ పొందుతున్న సుధాకర్ సార్ సేవలను చైర్మన్ అభినందించారు. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ తన సేవలను వీలైనప్పుడల్లా విద్యార్థులకు అందించాలని తమ అనుభవాలను రాబోయే తరం టీచర్లకు తెలుపుతూ వారి శేష జీవితం ఆనందమయంగా గడపాలని కోరారు. అనంతరం సుధాకర్ ను శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట ప్రభుత్వ క బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాదం సురేష్ బాబు ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### సుందిళ్లలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు




**మంథని, జూలై 24(సింగిడి):** సుందిళ్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేస్తూ కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### గులాబీ గూటికి చేరిన అరుణ్



**మంథని, జూలై 24(సింగిడి):** సుందిళ్ల గ్రామానికి చెందిన యువజన నాయకుడు వేముల అరుణ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం విద్యానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సుందిళ్ల గ్రామ బీఆర్ఎస్ శాఖ అధ్యక్షుడు బోగిరి భాస్కర్ ఆధ్వర్యంలో ఆయన బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వేముల అరుణ్‌ను అభినందించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామంలో పార్టీ అభివృద్ధికి యువత కీలక పాత్ర పోషించాలని వారు పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



**జమ్మికుంట, జూలై 24 (సింగిడి):** రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ విద్యార్థి మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన రావి కంటి సుజల్(18) అనే విద్యార్థి తన స్నేహితుడు అబ్బిడి అశ్విత్ తో కలిసి జగ్గయ్య పల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా రెండు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో సుజల్ కు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన బాధితున్ని హన్మకొండ ఆసుపత్రికి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి రావి కంటి వినయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.

# తొలి ఏకాదశి..ఆధ్యాత్మికతకు శ్రీకారం

**సీజనల్ పండుగలకు తొలిమెట్టు**
**శ్రీ మహావిష్ణువును ఆరాధించే పర్వదినం..**
**ఉపవాసాలు జాగరణలు**
**ఆషాఢ మాసంలో ప్రత్యేక విశిష్టత**
**నేడు తొలి ఏకాదశి**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (సింగిడి):** ఆషాఢ శుద్ధ ఏకాదశి.. తొలి ఏకాదశిగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైన పర్వదినం. హిందూ సంప్రదాయంలో ఏకాదశి తిథికి ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశుల్లో ఆషాఢ మాసంలో వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశిగా పిలుస్తారు. ఈ రోజు నుంచే పండుగల పరంపరకు శ్రీకారం చుడుతుందని పెద్దలు చెబుతారు.





**విష్ణు ఆరాధనకు విశిష్టమైన రోజు..**
తొలి ఏకాదశి రోజున భక్తులు తెల్లవారు జామునే నిద్రలేచి తలస్నానం చేసి ఇళ్లను శుభ్రం చేసుకుని శ్రీమహావిష్ణువును భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. విష్ణు ఆలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. రోజంతా ఉపవాసం ఉండి పండ్లు, పాలు వంటి సాత్విక ఆహారం తీసుకోవడం, విష్ణు నామస్మరణ చేయడం ఆనవాయితీగా వస్తోంది.

**చాతుర్మాస్యానికి ఆరంభం**
తొలి ఏకాదశి నుంచే చాతుర్మాస్యం ప్రారంభమవుతుందని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ కాలంలో శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో యోగనిద్రలోకి వెళ్తారని భక్తుల విశ్వాసం. నాలుగు నెలల అనంతరం వచ్చే ప్రబోధిని ఏకాదశి రోజున స్వామివారు మేల్కొంటారని చెబుతారు. అందుకే చాతుర్మాస్య కాలాన్ని భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తూ పూజలు, వ్రతాలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**ఉపవాసం.. ఆత్మ నియంత్రణకు ప్రతీక**
ఏకాదశి ఉపవాసం కేవలం ఆహార నియమం మాత్రమే కాకుండా ఆత్మ నియంత్రణకు ప్రతీకగా భావిస్తారు. ఇంద్రియాలను అదుపులో ఉంచి భగవంతునిపై మనసును కేంద్రీకరించడం ఈ వ్రతం ప్రధాన ఉద్దేశంగా భక్తులు విశ్వసిస్తారు. ఉపవాసం చేయలేని వారు తమ ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా సాత్విక ఆహారం తీసుకుంటూ భగవంతుడిని స్మరించవచ్చు.

**భక్తి.. దానధర్మాలకు ప్రాధాన్యం**
తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు, హరినామ సంకీర్తనలు నిర్వహిస్తారు. భక్తులు దానధర్మాలు, అన్నదాన కార్యక్రమాలు చేపడతారు. పేదలకు, అవసరమైన వారికి సహాయం చేయడం ద్వారా పుణ్యం లభిస్తుందని విశ్వసిస్తారు.

**పండుగల సీజన్‌కు శ్రీకారం**
తొలి ఏకాదశి తర్వాత శ్రావణ మాసం, వరలక్ష్మీ వ్రతం, రాఖీ పౌర్ణమి, కృష్ణాష్టమి, వినాయక చవితి, దసరా, దీపావళి వంటి అనేక ముఖ్యమైన పండుగలు వరుసగా వస్తాయి. అందుకే తొలి ఏకాదశిని "పండుగల సీజన్‌కు తొలిమెట్టు"గా కూడా అభివర్ణిస్తారు.

**ఆధ్యాత్మికతను పెంపొందించే పర్వదినం**
మొత్తంగా తొలి ఏకాదశి మనిషిలో భక్తి, నియమం, ఆత్మ నియంత్రణ, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించే పవిత్రమైన పర్వదినం. ఈ రోజున భక్తిశ్రద్ధలతో శ్రీమహావిష్ణువును పూజించి, సత్యం, ధర్మం, దయ, సేవ వంటి సద్గుణాలను జీవితంలో ఆచరించాలని పెద్దలు సూచిస్తారు. తొలి ఏకాదశి పర్వదినం ప్రతి ఇంటా భక్తి, శాంతి, సుఖసంతోషాలను నింపాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

## రామగుండం జీజీహెచ్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**గోదావరిఖని, జూలై 24(సింగిడి):** రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ప్రత్యేక వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయాలని, వాటిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనవసరంగా ఖర్చు చేయకుండా ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఆసుపత్రిలోని న్యూరో సర్జరీ, ఫిజియోథెరపీ, 2డీ ఎకో, అడిక్షన్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ, పీడియాట్రిక్ సర్జరీ, యూరాలజీ, న్యూరో ఫిజీషియన్ విభాగాలను పరిశీలించిన కలెక్టర్, ప్రతి విభాగంలో అందుతున్న సేవల వివరాలను తెలుసుకున్నారు. ప్రత్యేక వైద్యుల అందుబాటు రోజులు, చికిత్సల వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేస్తూ గ్రామాలు, పట్టణాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



- రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ..
- పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన బీఆర్ఎస్ నాయకులు



**మహాముత్తారం, జూలై 24(సింగిడి):** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మహాముత్తారం మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేటీఆర్ చేపట్టిన 'గ్రీన్ ఛాలెంజ్' స్ఫూర్తితో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మార్క రాము గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాధారపు స్వామి, బోర్లగూడెం సర్పంచ్, మహాముత్తారం మండల బీఆర్ఎస్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అజ్మీర ధరమ్ సింగ్, మాజీ సర్పంచ్ వనజ కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు చీకట్ల లింగయ్య గౌడ్, కనుకునూరు మాజీ సర్పంచ్ లక్ష్మీ రాంబాబు, సింగంపల్లి ఉపసర్పంచ్ రవీందర్, బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పంతకాని లక్ష్మయ్య, బోడ బాలాజీ, సత్తిరెడ్డి, పంగ సంపత్, స్రవంతి, కొయ్యల రమేష్, మహేష్, బెల్లంకొండ పోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్హుడి ఓటు జాబితాలో ఉండేలా చూడాలి

**ఎమ్మెల్యే విజయరమణరావు**



**పెద్దపల్లి, జూలై 24(సింగిడి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు పేరు తప్పనిసరిగా నమోదయ్యేలా చూడాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. పట్టణ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బిఎల్ఓలకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఓటర్లకు అవగాహన కల్పించాలని, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## సర్‌పై విస్తృతస్థాయి సమావేశం



**జమ్మికుంట, జూలై 24 (సింగిడి):** రాష్ట్రంలో సమగ్ర ఓటు సవరణ నమోదు ప్రక్రియ(సర్ )సమయం దగ్గర పడుతున్నా కొద్దీ కాంగ్రెస్ పార్టీ నమోదు ప్రక్రియలో బిఎల్ఏ ల పని తీరు పై,సందేహాలపై విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు సుడా మాజీ ఛైర్మెన్,హుజురాబాద్ సర్ ఇంచార్జి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్..శుక్రవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కమలాపూర్,వీణవంక మండల పరిధిలోని గ్రామాల బిఎల్ఏ,కో ఆర్డినేటర్లతో ముఖ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఇప్పటివరకు బిఎల్ఏ వద్ద ఉన్న పూర్తి సమాచారం కో ఆర్డినేటర్ల వద్ద ఉందా లేదా అని ప్రశ్నించారు?గ్రామాల్లో ఓటు నమోదు ఫారం రాకపోతే బిఎల్అఓ కో ఆర్డినేటర్లకు తెలపాలని అక్కడ నుండి మాకు చేరవేస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సర్ పై సీరియస్ గా దృష్టి పెట్టింది కావున ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుజురాబాద్ కి సంబంధించి పూర్తి సమాచారాన్ని తెలిపారని తెలిపారు.తెలిసి ఒక్క కూడా వృధా కాకుండా చూడాలని కార్యకర్తలకి సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్,వీణవంక మండల నాయకులు,గ్రామాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అటవీ భూముల ఆక్రమిస్తే చర్యలు తప్పవు!

**డోజర్లు, ట్రాక్టర్ల యజమానులతో పోలీసుల సమావేశం**
**ఆక్రమణలకు పాల్పడితే కఠినచర్యలు**



**మహాముత్తారం, జూలై 24(సింగిడి):** అటవీ భూముల పరిరక్షణకు పోలీసు, అటవీ శాఖ అధికారులు కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహాముత్తారం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం డోజర్, ట్రాక్టర్ యజమానులతో పోలీసులు, అటవీ శాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో కాటారం, ఆజంనగర్, పెగడపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారులతో కలిసి ఈ సమావేశం జరిగిన సమావేశంలో ఎస్సై రమేష్ మాట్లాడుతూ అటవీ భూములను ఆక్రమించేందుకు ఎవరూ ప్రయత్నించవద్దని అటవీ భూములను అక్రమంగా చదును చేయడం, ఆక్రమణలకు పాల్పడటం లేదా వాటికి సహకరించడం చట్టవిరుద్ధమని తెలిపారు. డోజర్లు, ట్రాక్టర్లను ఉపయోగించి అటవీ భూముల్లో అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ శాఖ అధికారులతో దురుసుగా ప్రవర్తించడం, విధులకు ఆటంకం కలిగించడం కూడా చట్టరీత్యా నేరమని వివరించారు. అటవీ సంపద, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ రమేష్ కోరారు. ఈ సమావేశంలో రేంజ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసుల దాడి

**8 మంది అరెస్ట్.. రూ.5,430 నగదు,**
**3 ద్విచక్ర వాహనాలు, 8 మొబైల్ ఫోన్లు స్వాధీనం**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, జూలై 24 (సింగిడి):** పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.5,430 నగదు, 3 ద్విచక్ర వాహనాలు, 8 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతకాని గ్రామ శివారులో జరిగింది. భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు జిల్లా సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో చింతకాని గ్రామ శివారులోని పేకాట స్థావరంపై ఆకస్మికంగా దాడి చేశారు. పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నగదుతో పాటు 3 ద్విచక్ర వాహనాలు, 8 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు దాడి చేస్తున్న సమయంలో మరో వ్యక్తి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న నగదు, వాహనాలు, మొబైల్ ఫోన్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కాటారం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. పరారైన నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ.. జిల్లాలో జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని



హెచ్చరించారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ పరిసరాల్లో పేకాట లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు.

## చేనేత ఉత్పత్తులను పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

**కులవృత్తులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం**
**కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్**



**జమ్మికుంట జూలై 24 (సింగిడి):** చేనేత ఉత్పత్తులను పెంచడం ద్వారా చేనేత వృత్తుల వారికి చేయూత ఇస్తున్నామని హుజురాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చేనేత కుల వృత్తులను ఆదుకుంటామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శుక్రవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సమీకృత వస్త్రోత్పత్తి కేంద్రాన్ని ప్రణవ్ సందర్శించారు.ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా ఎన్నికైన అధ్యక్ష,కమిటీ వారిని సన్మానించారు.కేంద్రంలో జరుగుతున్న పనులను,దినసరి వేతనం గురించి కార్మికులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,జిల్లా చేనేత సెల్ అధ్యక్షుడు సదానందం,సంఘం అధ్యక్షుడు ఉపేందర్,ఉపాధ్యక్షులు తిరుపతయ్య,కోశాధికారి మహదేవ్,కమిటీ సభ్యులు,కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అటవీ సంపద పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

**వనపర్తి డిఎఫ్ఓ రేవంత్ చంద్ర**



**వనపర్తి ప్రతినిధి, జూలై 24 (సింగిడి):** అటవీ సంపద పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని వనపర్తి జిల్లా అటవీశాఖ అధికారి రేవంత్ చంద్ర కోరారు. నాగర్ కర్నూల్ జిల్లా అటవీ శాఖ అధికారిగా ఉన్న రేవంత్ చంద్ర వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలకు జిల్లా అటవీ శాఖ అధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన అటవీ శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణ, అటవీ భూముల పరిరక్షణ, అక్రమ కలప రవాణా నియంత్రణ, అటవీ నేరాల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. అటవీ శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మొక్కల సంరక్షణ, హరితహారం, కంపా పనులు, నర్సరీల నిర్వహణ ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని కోరారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా శాఖ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని, పనులను నాణ్యతతో చేపట్టాలని కోరారు. ప్రతి అధికారి, ఉద్యోగి సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేటీఆర్ సేవలు

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**గోదావరిఖని, జూలై 24(సింగిడి):** తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) అని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని రామగుండంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు, మొక్కల నాటడం, విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ, డయాలసిస్ రోగులకు ఆర్థిక సహాయం, రోగులకు పండ్ల పంపిణీ, రక్తదాన శిబిరం, ఆశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కేటీఆర్‌కు తెలంగాణ సమాజం అండగా నిలవాలని కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో కౌశిక్ హరి, పీటీ స్వామి, నడిపెల్లి మురళీధర్ రావు, మూల విజయారెడ్డి, మిర్యాల



రాజిరెడ్డి, మేకల సమ్మయ్య యాదవ్, కర్క పద్మజ, తోకల రమేష్, మెతుకు దేవరాజ్, నూతి తిరుపతి, బొడ్డుపెల్లి శ్రీనివాస్, ఈదునూరి పర్వతాలు, కృష్ణవేణి, ఈదునూరి శ్రీకాంత్, కిరణ్ జి, చింటూ,



దొమ్మేటి వాసు, కనుకరాజు, సాజీదా, పద్మ, కర్రావుల రామరాజు, కోల సంతోష్, మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెత్త బయట వేస్తే అపరాధ రుసుము

**మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి**



**జమ్మికుంట, జూలై 24 (సింగిడి):** మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి ఆదేశాల మేరకు జమ్మికుంట ప్రధాన రహదారిపై పారిశుద్ధ్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక స్వీట్ హౌస్ మరియు ఒక కిరాణా దుకాణం యాజమాన్యాలు తమ వ్యాపార సంస్థల చెత్తను రోడ్డుపై వేయడం గుర్తించారు. మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆయా రెండు వ్యాపార సంస్థలకు రూ.1,000 చొప్పున అపరాధ రుసుము విధించారు. వ్యాపారులు తమ దుకాణాల నుంచి వచ్చే చెత్తను రోడ్డుపై వేయకుండా మున్సిపాలిటీ చెత్త సేకరణ వాహనానికే అందజేయాలని కమిషనర్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇలాంటి చర్యలు నిరంతరం కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జవాన్లు కె. కిరణ్, దొడ్డ సంపత్ పాల్గొన్నారు.

# భూముల రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

**వనపర్తి ప్రతినిధి, జూలై 24 (సింగిడి):** భూముల రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వినోద్ కుమార్ కోరారు. ఖిల్లా ఘనపూర్ మండలంలోని ల్యాండ్ రీ-సర్వే పైలట్ ప్రాజెక్ట్ గ్రామమైన మల్కాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మల్కాపూర్ గ్రామాన్ని ల్యాండ్ రీ-సర్వే పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయడం ప్రత్యేక అవకాశమని అన్నారు. భూముల రికార్డులను సమగ్రంగా, పారదర్శకంగా నవీకరించడం, భూ సరిహద్దు వివాదాలను పరిష్కరించడం, డిజిటల్ భూ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు.ల్యాండ్ రీ-సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని, రైతులు తమ భూముల సరిహద్దుల నిర్ధారణలో రెవెన్యూ, సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. గ్రామస్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత




అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు.అనంతరం ఎల్-నినో ప్రభావంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ రాబోయే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు, స్వల్పకాలిక పంట రకాల ఎంపిక, బిందు సేద్యం (మైక్రో ఇరిగేషన్) వంటి నీటి పొదుపు పద్ధతులను అనుసరించాలని తెలిపారు.ఉద్యానవన పంటల సాగులో నేల తేమను కాపాడుకునే చర్యలు చేపట్టడంతో పాటు, దిగుబడి తగ్గకుండా శాస్త్రీయ పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. ఎల్-నినో ప్రభావానికి సంబంధించిన అన్ని జాగ్రత్తలు, సాంకేతిక సూచనలను క్షేత్రస్థాయిలో రైతులకు నిరంతరం అందిస్తూ అందుబాటులో ఉండాలని మండల స్థాయి అధికారులు, వ్యవసాయ అధికారులు (ఏఓలు), ఉద్యానవన అధికారులు, పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులుపాల్గొన్నారు.

# జిమ్.. డైటింగ్ అవసరం లేదు..!

## ఈ చిన్న మార్పులతో బరువు తగ్గడం చాలా ఈజీ..

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మందిని వేధిస్తున్న ప్రధాన సమస్య అధిక బరువు. బరువు తగ్గడం కోసం రాత్రి రాత్రికే కఠినమైన డైటింగ్స్ చేయడం, జిమ్‌లలో గంటల తరబడి చెమటలు చిందించడం చేస్తుంటారు.అయితే బరువు తగ్గడానికి కఠినమైన నియమాలు అవసరం లేదని.. మన దైనందిన జీవితంలో చేసుకునే చిన్న చిన్న మార్పులే ఇందుకు ఉత్తమ మార్గమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఒకే రోజులో మ్యాజిక్ జరగదు కాబట్టి లాంగ్ టర్మ్‌లో ఫిట్‌గా ఉండటానికి వైద్య నిపుణులు సూచిస్తున్న ఆ 3 సింపుల్ అండ్ పవర్‌ఫుల్ లైఫ్‌స్టైల్ మార్పులు ఏంటో తెలుసుకుందాం..





**రాత్రి పూట స్వీట్ క్రేవింగ్స్‌కు ఇలా చెక్ పెట్టండి**

చాలా మందికి రాత్రి భోజనం చేసిన తర్వాత లేదా అర్ధరాత్రి పూట సడన్‌గా స్వీట్లు, చాక్లెట్లు లేదా కేకులు తినాలనే కోరిక కలుగుతుంది. బరువు పెరగడానికి ఇది ఒక ముఖ్య కారణం. ఈ అలవాటును అదుపు చేయడం చాలా మందికి ఒక పెద్ద సవాలు. అయితే ఇలాంటి సమయాల్లో అధిక క్యాలరీలు ఉండే చాక్లెట్లకు ప్రత్యామ్నాయంగా ప్రకృతి సిద్ధమైన పండ్లను ఎంచుకోవాలని న్యూట్రిషనిస్టులు సలహా ఇస్తున్నారు. ఉదాహరణకు.. ఒక ఆపిల్ ముక్కపై కొద్దిగా నట్స్ బటర్ రాసుకుని తినడం వల్ల శరీరానికి ఎలాంటి హాని జరగదు. పైగా తక్కువ క్యాలరీలతోనే స్వీట్ తినాలనే కోరిక తీరుతుంది.

**డైట్ ప్లాన్ -- క్యాలరీల లెక్క**


ఆరోగ్యకరమైన వెయిట్ లాస్ కోసం సరైన ఆహార నియమాలతో పాటు రోజువారీ వ్యాయామం సమపాళ్లలో ఉండాలి. ఇందుకోసం మీ రోజువారీ భోజనాన్ని ఇలా ప్లాన్ చేసుకోండి..

**ఉదయపు అల్పాహారం :** బ్రేక్‌ఫాస్ట్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ స్కిప్ చేయకూడదు. ఇది పూర్తిగా, పోషకాలతో నిండి ఉండాలి.

**మధ్యాహ్న భోజనం :** లంచ్ ఎప్పుడూ మితంగా ఉండాలి.

**రాత్రి భోజనం:** డిన్నర్ చాలా తేలికగా, తక్కువ క్వాంటిటీలో ఉండాలి.

ముఖ్యంగా నూనెలో వేయించిన ఫ్రైలు, కొవ్వు పదార్థాలను పక్కన పెట్టి.. ఆకుకూరలు, కూరగాయలు, గుడ్డు తెల్లసొన వంటి ప్రోటీన్, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి.



**ఒకే రోజులో మార్పు రాదు.. కన్సిస్టెన్సీ ముఖ్యం**

శరీరంలో మార్పులు అనేవి ఒకే రోజులో లేదా ఒకే రాత్రిలో జరిగిపోవు. అందుకే నెలకు 10 కిలోలు తగ్గాలి లాంటి భారీ లక్ష్యాలు పెట్టుకోకుండా.. వారంతపు ప్రాతిపదికన చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలి. ఎప్పుడో ఒకసారి వ్యాయామం చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. నిరంతరాయంగా, ప్రతిరోజూ చేసే చిన్నపాటి వ్యాయామం మాత్రమే శరీరంలో మెటబాలిజం రేటును పెంచి, కొవ్వును వేగంగా కరిగిస్తుంది. అలసట పడకుండా ఈ సింపుల్ అలవాట్లను లైఫ్‌స్టైల్‌గా మార్చుకుంటే దీర్ఘకాలిక ఆరోగ్యం మీ సొంతం అవుతుందని వైద్య నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

## గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారికి

# మసాలాలు లేని హెల్తీ కొత్తిమీర కోడికూర

కొత్తిమీర చికెన్ కూర ఒంటికి చలువు చేయడమే కాకుండా, కడుపుకు ఎంతో హాయిని ఇస్తుంది. ఈ రుచికరమైన కూరను తయారు చేయడానికి ముందుగా అడుగు మందంగా ఉండే కడాయిలో ఐదారు స్పూన్ల నూనె వేడి చేయాలి. అందులో మూడు మీడియం సైజు ఉల్లిపాయల సన్నని ముక్కలు, కరివేపాకు, ఉప్పు వేసి ఉల్లిపాయలు మంచి గోల్డెన్ కలర్ వచ్చే వరకు వేయించుకోవాలి.





తర్వాత కొద్దిగా పసుపు, ఒక కేజీ శుభ్రం చేసిన చికెన్ వేసి హై ఫ్లేమ్ మీద ఐదారు నిమిషాలు వేయించి, ఆపై మూత పెట్టిలో ఫ్లేమ్‌లో మగ్గనివ్వాలి. చికెన్ మగ్గేలోపు ఒక కప్పు నిండా తాజా కొత్తిమీర, కొద్దిగా అల్లం, 10-15 వెల్లుల్లి రెబ్బలు, 5-6 పచ్చిమిర్చి వేసి నీళ్లు పోయకుండా మిక్సీలో మెత్తని పేస్ట్‌లా గ్రైండ్ చేసుకోవాలి.



ఇప్పుడు మగ్గుతున్న చికెన్ లో తగినంత కారం వేసి, చికెన్ లోని నీరంతా పూర్తిగా ఇగిరిపోయి నూనె పైకి తేలే వరకు వేయించాలి. ఆతర్వాత మనం గ్రైండ్ చేసి పెట్టుకున్న పచ్చటి కొత్తిమీర-అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను కూరలో వేసి రెండు మూడు నిమిషాలపాటు బాగా కలుపుతూ వేయించాలి.

ఈ మసాలా ముక్కలకు బాగా పట్టిన తర్వాత, గ్రేవీ కోసం కొన్ని వేడి నీళ్లను పోసి, ఉప్పు అడ్జస్ట్ చేసుకుని మూత పెట్టి లో ఫ్లేమ్ లో మరికొంత సేపు ఉడికించుకోవాలి. కూర చక్కగా ఉడికిన తర్వాత నూనె పైకి తేలుతుంది. చికెన్ ముక్క సాఫ్ట్‌గా ఉడికి, గ్రేవీ చిక్కబడగానే స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. కొంచెం పులుపు ఇష్టపడేవారు చివర్లో కొద్దిగా నిమ్మరసం పిండుకోవచ్చు.

అంతే, ఎలాంటి గరం మసాలా పొడులు వాడకపోయినా అస్సలు నీచు వాసన రాకుండా, కొత్తిమీర ఫ్లేవర్‌తో గుమగుమలాడే చికెన్ కర్రీ రెడీ. దీనిని వేడి వేడి అన్నం, బగారా రైస్, చపాతీ లేదా జొన్న రొట్టెల్లోకి తింటే రుచి అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్యానికి ఆరోగ్యం, రుచికి రుచి ఇచ్చే ఈ సింపుల్ చికెన్ కర్రీని మీరు తప్పకుండా ట్రై చేయండి!



## ఏఐ యుగంలో బహుళ

# విషయ విద్యే భవిష్యత్

## ప్రొఫెసర్ వాల్టర్ లీల్, డాక్టర్ ఆశిష్ భరద్వాజ్



**హైదరాబాద్ బ్యూరో (సింగిడి):** కృత్రిమ మేధస్సు (ఏఐ), వేగవంతమైన సాంకేతిక మార్పుల నేపథ్యంలో విద్యార్థులను కేవలం మొదటి ఉద్యోగానికే కాకుండా జీవితకాలంలో ఎదురయ్యే పలు వృత్తి మార్పులకు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని వరల్డ్ పీస్ యూనివర్సిటీ (డబ్ల్యూపీయూ), గోవా ప్రతినిధులు పేర్కొన్నారు.జూన్ 20న నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో మాట్లాడిన డబ్ల్యూపీయూ గోవా వైస్ ఛాన్సలర్ లిప్రొఫెసర్ వాల్టర్ లీల్‌లి, బహుళ విషయ (ట్రాన్స్‌డిసిప్లినరీ) విద్యా విధానం ద్వారా విద్యార్థుల్లో అనుకూలత, జీవితకాల అభ్యాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే విశ్వవిద్యాలయ లక్ష్యమని తెలిపారు.డబ్ల్యూపీయూ గోవా ప్రో వైస్ ఛాన్సలర్ లిడాక్టర్ ఆశిష్ భరద్వాజ్‌లి మాట్లాడుతూ, భవిష్యత్తు ఉద్యోగాలకు కేవలం ప్రత్యేక నైపుణ్యాలు సరిపోవని, నిరంతరం నేర్చుకునే సామర్థ్యం, వివిధ రంగాల ఆలోచనలను అనుసంధానించే నైపుణ్యం అత్యంత కీలకమని అన్నారు.ప్రస్తుతం డబ్ల్యూపీయూ గోవాలో బీటెక్ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్), బీఎంఎస్ (ఆనర్స్), బీడిజైన్, బీఎస్సీ సైకాలజీ (ఆనర్స్) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్తులో వచ్చే కొత్త అవకాశాలు, వృత్తి మార్పులను ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే ఉన్నత విద్య ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు.

## 16 రకాల ఔషధాలను నిషేధించిన కేంద్రం

ప్రజారోగ్యం దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యాంటి బయాటిక్స్, టాపికల్, కాస్మటిక్స్‌కు సంబంధించిన 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలను నిషేధించింది. వీటి తయారీ, విక్రయం, సరఫరా నిలిపివేయాలని ఆదేశించింది. ఈ ఔషధాల కలయిక వల్ల చికిత్స నయం కావడానికి ఎలాంటి శాస్త్రీయపరమైన ఆధారాల్లేవని నిరూపితమైనట్టు పేర్కొంది. డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డుకు చెందిన నిపుణుల కమిటీ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.



రెండు, మూడు రకాల ఔషధాలను ఒకే మోతాదులో కలిపి ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలను తయారుచేస్తారు. వీటి పనితీరుపై డీటీఏబీ కొన్నేళ్లుగా సమీక్షిస్తోంది. ఈ క్రమంలోనే చికిత్స మెరుగుదలకు ఎలాంటి ప్రయోజనం లేని 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలపై నిషేధం విధించాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు యాంటిబయాటిక్స్, టాపికల్, కాస్మటిక్స్‌కు చెందిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్లను కేంద్రం బ్యాన్ చేసింది.

## పీఎం కిసాన్ నిధులు విడుదల

రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్ నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరింది. కేంద్రప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు ..

**మీ పేరుందా..?**

పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్ధిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్ధిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇ-కేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇ-కేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

## మాసీఐకాన్ 2026లో కోక్లియర్ ఇంప్లాంట్‌పై నిపుణుల చర్చలు



**హైదరాబాద్, (సింగిడి):** మా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ (ఎం ఐ ఎస్ హెచ్ ), మా ఈఎన్‌టీ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాసీఐకాన్ 2026 సదస్సులో కోక్లియర్ ఇంప్లాంట్ రంగంలోని తాజా సాంకేతికతలు, క్లినికల్ సవాళ్లు, పునరావాస విధానాలపై నిపుణులు చర్చించారు. వినికిడి లోపమున్న చిన్నారుల్లో మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందించి వారి సమగ్ర అభివృద్ధికి తోడ్పడే మార్గాలపై మేధోమథనం జరిగినట్లు సంస్థ వ్యవస్థాపకులు, చైర్‌పర్సన్ సునీత కుమార్ తెలిపారు. జూన్ 20, 21 తేదీల్లో జరుగుతున్న ఈ సదస్సులో డా. సుమన్ కుమార్, ప్రొఫెసర్ రాజశేఖర్, రవి వడ్లమాని, రమేష్ వంగల, శివాని త్రివేవాలా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 150 మంది ఈఎన్‌టీ వైద్యులు, ఆడియాలజిస్టులు, పరిశోధకులు హాజరయ్యారు. కోక్లియర్ ఇంప్లాంట్ అర్హతలు, శస్త్రచికిత్సలు, మ్యాపింగ్, తాజా సాంకేతిక పురోగతులపై రెండు రోజుల పాటు నిపుణుల ఉపన్యాసాలు, ప్యానెల్ చర్చలు జరగనున్నాయి.

**స్టాక్ మార్కెట్**
**Stock Market**



## సూచీల లాభాలకు

# 'ఐటీ' బ్రేక్

## ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ.4859.07 కోట్లు

## డీఐఐ విక్రయాలు.. రూ.1159.64 కోట్లు

ఐటీ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో దేశీయ సూచీలు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. బహుళజాతి ఐటీ సంస్థ యాక్సెంచర్, భవిష్యత్తు ఆదాయ అంచనాల్లో కోత విధించడం ఇందుకు కారణమైంది. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం ఖరారుకు సంబంధించిన చర్చలు వాయిదా పడటం వల్లా మదుపర్ల సెంటిమెంటు దెబ్బతింది. ఫలితంగా అయిదు రోజుల వరుస లాభాలకు అడ్డుకట్ట పడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు పెరిగి 94.33 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.66% పెరిగి 80.38 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్ మినహా మిగతావి నష్టాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో ఆరంభమయ్యాయి.

బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.7000 కోట్లు తగ్గి రూ.477.53 లక్షల కోట్ల (5.05 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

ఆద్యంతం నష్టాల్లోనే: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 76,852.86 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 77,409.98) ఆరంభమైంది. అదే ఒరవడి కొనసాగిస్తూ ఒక దశలో 76,469.72 పాయింట్లకు దిగివచ్చింది. చివరకు 607.08 పాయింట్ల నష్టంతో 76,802.90 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 154.90 పాయింట్లు కోల్పోయి 24,013.10 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,047.20 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని; 23,901.90 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది.

12 మినహా మిగతావి నష్టాల్లో..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 12 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ ఎక్కువగా నష్టపోగా.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.32%, మహీంద్రా అండ్ మహీంద్రా 2.11%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.39%, హిందుస్థాన్ యునిలీవర్ 1.02%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.01% తగ్గాయి. ఎటర్నల్ 2.21%, భారతీ ఎయిర్‌టెల్ 1.8%, పవర్‌గ్రిడ్ 1.32%, ఎన్‌టీపీసీ 1.04%, టైటన్ 0.84%, ఐటీసీ 0.79%, ట్రెంట్ 0.77% పెరిగాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో ఐటీ, చమురు- గ్యాస్, ఇంధనం, స్థిరాస్తి, పీఎస్‌యూ బ్యాంక్ డీలాపడగా.. టెలికాం, విద్యుత్, ఇండస్ట్రియల్స్, ఆరోగ్య సంరక్షణ, యుటిలిటీస్ రాణించాయి.

ఐటీ షేర్లు దిగాలు..: పూర్తి సంవత్సరానికి ఆదాయ అంచనాలను యాక్సెంచర్ తగ్గించడంతో, దేశీయంగా ఐటీ కంపెనీల షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఇన్ఫోసిస్ 6.69%, ఎల్‌టీఎం 4.12%, టీసీఎస్ 3.53%, హెచ్‌సీఎల్ 2.74%, టెక్ మహీంద్రా 2.47%, విప్రో 1.2% నష్టపోయాయి. ఈ సంస్థలన్నీ కలిసి రూ.77,597.46 కోట్ల మార్కెట్ విలువను కోల్పోయాయి.

రిలయన్స్ షేరుకు 1.39% నష్టం: ఏజీఎం నేపథ్యంలో, ఈ వారంలో 6% పెరిగిన రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరుకు శుక్రవారం లాభాల స్వీకరణ ఎదురైంది. బీఎస్ఈలో ఈనెల 11న షేరు ధర రూ.1253. ఇది 52 వారాల కనిష్ఠస్థాయి కాగా, గురువారం రూ.1328 వద్ద ముగిసింది. శుక్రవారం ఈ షేరు 1.39% తగ్గి రూ.1,309.35 వద్ద ముగిసింది.

5 కంపెనీల ఐపీఓలకు సెబీ ఆమోదం

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్, ఏజీఎస్ హెల్త్, పీజీపీ గ్లాస్, శ్రేణి షేర్స్, ఎస్ఆర్ఐటీ ఇండియా ఐపీఓ దరఖాస్తులకు సెబీ ఆమోదం లభించింది. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపేణా జరగనుంది. 20.37 కోట్ల వరకు షేర్లను ప్రస్తుత ప్రమోటర్లయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆముంది హోల్డింగ్ విక్రయించనున్నాయి. ఏజీఎస్ హెల్త్, పీజీపీ గ్లాస్ ఐపీఓ ముసాయిదా పత్రాలను సెబీకి రహస్య పద్ధతిలో సమర్పించాయి. శ్రేణి షేర్స్ ఇష్యూలో 60 లక్షల వరకు తాజా షేర్లను, ఓఎఫ్ఎస్ ద్వారా 82 లక్షల షేర్లను విక్రయిస్తారు. ఎస్ఆర్ఐటీ ఇండియా ఐపీఓ పూర్తిగా తాజా షేర్ల రూపేణా ఉండనుంది. 1.68 కోట్ల తాజా షేర్లను జారీ చేయనున్నారు.

## ఎల్‌నినో ప్రభావం..
## ఆరుతడి పంటల వైపు రైతులు మళ్లాలి



**కోదాడ, (సింగిడి):** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగును తగ్గించి ఆరుతడి పంటల సాగు పై దృష్టి సారించాలని కోదాడ మండల వ్యవసాయ అధికారి పాలెం రజని సూచించారు. శ్రీరంగాపురం, బాలాజీనగర్, దొరకుంట, కాపుగల్లు, బీక్యతండ గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి తక్కువ నీటితో సాగయ్యే పెసర, కంది, మినుములు, బొబ్బర్లు, కూరగాయల వంటి పంటలను సాగు చేయాలని సూచిం చారు. ఈ పంటల విత్తనాలు రాయితీపై వ్యవసాయ శాఖ ద్వారా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే నష్టాలను తగ్గించుకోవచ్చని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలే సాగు చేయాలి



**కోదాడ, (సింగిడి)::** కోదాడ రూరల్ మండలం దోరకుంట గ్రామంలో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) మహేశ్ మాట్లాడుతూ, ఈ ఏడాది తక్కువ వర్షాలు, నీటి కొరత ఉండే అవకాశం ఉన్నందున రైతులు వరి, పత్తికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. తక్కువ నీటితో అధిక లాభాలు ఇచ్చే కందులు, పెసర్లు, మినుములు, బొబ్బర్లు వంటి పంటలను సాగు చేసి నష్టాలను నివారించుకోవాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలకి సురేష్, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదిన వేడుకలు..
## ఆటో డ్రైవర్లకు రూ.10 లక్షల ప్రమాద బీమా



**కోదాడ, (సింగిడి):**కోదాడ పట్టణంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని 10వ వార్డు కౌన్సిలర్ మామిడి రామారావు ఆధ్వర్యంలో ముందస్తుగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా 25 మంది ఆటో డ్రైవర్లకు రూ. 10 లక్షల ప్రమాద బీమా పత్రాలను పంపిణీ చేశారు. కష్టపడి జీవనం సాగించే ఆటో కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రామారావు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనంతుల సైదయ్య, కౌన్సిలర్ చంద్రశేఖర్, బత్తుల కృష్ణ, వీరబాబు, మాజీ కౌన్సిలర్ లలిత, చందు, వెంకటి, వెంకన్న, సీతయ్య, సిలర్, అఖిల్, మున్నా, లింగ, ఆటో యూనియన్ నాయకులు బోధల్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మకు బోనమెత్తిన బొమ్మరెడ్డిపల్లి.



**ధర్మారం (సింగిడి):** మండలంలోని బొమ్మ రెడ్డి పల్లి గ్రామంలో ఈ రోజు పోచమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. ఆషాడ మాసంతో పాటు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఉత్సవాలను సర్పంచ్ రాజకుమార్ ధార, పాలక మండలి సభ్యులతో పాటు వివిధ కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలందరూ బోనమెత్తారు. కులాలకు అతీతంగా జరిగే ఈ ఉత్సవాన్ని పంబాల పూజారి గౌరీ ప్రభాకర్ సమక్షంలో నిర్వహించారు. దాదాపు ప్రతి ఇంటి నుండి ఒక బోనం గ్రామం వీధుల గుండా వెళ్లి స్థానిక పోచమ్మ గుడి వద్ద ఉంచారు. పంబాల పూజారులు గావు పిల్లను పట్టివేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులందరూ పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న కేబుల్ ఆపరేటర్స్



**జమ్మికుంట, (సింగిడి):**కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన కేబుల్ ఆపరేటర్ దాసరి రామ్మూర్తి ఇటీవల మృతి చెందగా మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన కేబుల్ ఆపరేటర్లు.. రూ. 50,016 ఆర్థిక సాయం అందజేశారు. జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక ప్రాంతాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల మృతిచెందిన కేబుల్ ఆపరేటర్ దాసరి రామ్మూర్తి గౌడ్ కుటుంబానికి అండగా నిలుస్తూ ఆయన కుటుంబ సభ్యులకు రూ. 50,016 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రామ్మూర్తి గౌడ్‌కు ఇద్దరు కుమార్తెలు ఉండటంతో వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేబుల్ ఆపరేటర్లు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి ఈ సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఇలాంటి క్లిష్ట సమయంలో తోటి కేబుల్ ఆపరేటర్ కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్-సీ నెట్‌వర్క్ ఇన్‌చార్జి చల్లగొండ నరేంద్ర రావు, చంచు వీరేశం, కట్టంగూరి సచిన్ రెడ్డి, దూలం అంజి గౌడ్, నరగోని విశ్వనాథ్ గౌడ్, వొద్ది రవీందర్, అరెల్లి సురేష్ తోపాటు ఇల్లెందుకుంటా వీణవంక జమ్మికుంట మండలాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# కస్తూరిబా విద్యాలయానికి 45 డిస్క్ బెంచీల విరాళాలు



**ఆర్మూర్, (సింగిడి):**నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం ఏరుగట్ల మండల కేంద్రంలో గల కస్తూర్బా బాలికల విద్యాలయానికి సుమారు రెండు లక్షల రూపాయల విలువ గల 45, డిస్క్ బెంచీలను విరాళంగా విద్యార్థినిలకు దాత -వసంత టూర్ అండ్ ట్రావెల్స్ అధినేత ఏనుగు దయానంద రెడ్డి అందజేశారని స్థానిక సర్పంచ్ కొలిపాక ఉపేంద్ర తెలిపారు. గురువారం రోజున స్థానిక సర్పంచ్ కొలిపాక ఉపేంద్ర, బాల్కొండ ఫిజికల్ డైరెక్టర్ జైడి రాజ్ కుమార్, మాజీ జెడ్పిటిసి గుల్లే రాజేశ్వర్, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఏ.రాజా పూర్ణ నందం, బద్దం శ్రీనివాస్, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపిటిసి జక్కాని మధుసూదన్, మాజీ ఎంపిటిసి అంజయ్య, దేవుడు నరసయ్య, బద్దం హనుమాన్లు, రూక్కేడ మోహన్, పారిపల్లి రమేష్, అట్లా పోచయ్య, సున్నం శ్రీనివాస్, బద్దం శ్యామ్ సుందర్, ఎల్ఈడి బాల కిషన్, జాతీయస్థాయి క్రీడాకారులు పీ.ఈ.టీ.లు. జైపాల్, ఆనంద్, పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దల సమక్షంలో కస్తూరిబా బాలికల విద్యార్థినిలకు 45, డిస్క్ బెంచ్ లను సర్పంచ్ కొలిపాక ఉపేంద్ర ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కస్తూరిబా బాలికల విద్యాలయంలో డిస్క్ బెంచీల కొరత ఉందని తెలుసుకున్న వసంత టూర్స్ అండ్ ట్రావెల్స్ అధినేత ఏనుగు దయానంద రెడ్డి అందజేయడంతో, తమ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇట్టి సహాయాన్ని త్వరితగతిన అందించేలా, పాఠశాలకు సక్రమంగా చేరేలా, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో, సకాలంలో విద్యాలయానికి చేరుకుని పలువురు చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో విద్యార్థిను లకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ఈ సందర్భంగా కస్తూరిబా విద్యాలయ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినిలు, స్థానిక గ్రామ ప్రజలు దాత ఏనుగు దయానంద రెడ్డికి, సహకరించిన మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## బానోత్ రాము



**వైరా, (సింగిడి):** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఖానాపురం ప్రాథమి కోన్నత పాఠశాల ఉపాధ్యాయులు బానోత్ రాము పిలుపు నిచ్చారు. గురువారం పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో పౌరుల బాధ్యతను, కర్తవ్యాన్ని వివరిస్తూ, ప్రస్తుతం ప్రకృతిలో ఏర్పడుతున్న అసమతుల్య వాతావరణ పరిస్థితుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయుల ఉద్దేశించి మధ్యాహ్న భోజన సమయంలో "దయచేసి మీ ప్లేట్లు, గ్లాసులు వెంట తెచ్చుకోండి" అని కోరారు. ఆయన పిలుపుకు స్పందించిన తోటి ఉపాధ్యాయులు వెంటనే సహకరించడంతోపాటు పర్యావరణ పరిరక్షణలో తమ బాధ్యతను, కర్తవ్యాన్ని, సామాజిక చైతన్యాన్ని చాటిచెప్పారు. ఉపాధ్యాయుల స్పందన పై బానోత్ రాము కృతజ్ఞతలు తెలియజేశారు.

# తహసీల్దార్ కార్యాలయంలో సర్ పై సమీక్ష సమావేశం

### పాల్గొన్న హుజురాబాద్ ఆర్టీవో జల కుమారి



**జమ్మికుంట, (సింగిడి)::** జమ్మికుంట తహసి ల్దార్ కార్యాలయంలో హుజురాబాద్ ఆర్డిఓ జల కుమారి ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, ప్రతి అర్హుడైన ఓటరుకు అవకాశం కల్పించేలా స్థానిక కౌన్సిలర్స్, బీఎల్ఓలు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ సమన్వయంతో జమ్మికుంట పట్టణ పరిధిలోని 30 వార్డుల కౌన్సిలర్స్ బీఎల్ఓలతో కలిసి గ్రౌండ్ లెవెల్‌లో ప్రతి ఓటరును గుర్తించి, ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితాలో మిస్ కాకుండా ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను వంద శాతం విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, ఎమ్మార్వో గడ్డం సుధాకర్, కౌన్సిలర్స్ బి ఎల్ వో లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# ఘనంగా శ్రీ వారాహి మాత నవరాత్రి ముగింపు ఉత్సవాలు



**చింతపల్లి, (సింగిడి):**మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో శ్రీ వారాహి మాత నవరాత్రి ముగింపు ఉత్సవాలను గురువారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడగా, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలతో ఆధ్యాత్మిక వాతావ రణం నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ్య-పావని దంపతులు శ్రీ వారాహి మాతకు ప్రత్యేక అభిషేకాన్ని అత్యంత భక్తిశ్ర ద్ధలతో నిర్వహించారు. అనంతరం 108 మూలికలతో మహా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. హోమంలో పాల్గొన్న భక్తులు అమ్మవారి అనుగ్రహం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ్య మాట్లా డుతూ, శ్రీ వారాహి మాత అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాం క్షించారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసా దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్య దర్శి కొమిరిశెట్టి వెంకటయ్య-చంద్రకళ దంపతులు, కోశాధికారి ఊరే కృష్ణయ్య-కృష్ణవేణి దంపతులు, కొమిరిశెట్టి వినోద్ కుమార్--స్వాతి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై శ్రీ వారాహి మాత ఆశీస్సులు పొందారు.

## తోటి రిపోర్టర్‌కు మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ సభ్యులు చేయూత



**మల్కాజిగిరి, (సింగిడి):** అనారోగ్యంతో బాధపడుతూ తులసి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రిపోర్టర్ పరమేష్ ను మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ సభ్యులు 518/23 ఆధ్వర్యంలో వెళ్ళి పరామర్శించి రూ. 10 వేల చెక్కును అందజేసి, తాను త్వరగా కోలుకోవాలని సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బాలరాజు, ప్రధాన కార్యదర్శి విశాల్ యాదవ్, రెహమాన్, సంగమేష్, మహేందర్ యాదవ్, నాగరాజు, అక్కల రాజు, ప్రభాకర్, కృష్ణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

### సర్ ప్రోగ్రాం ను విజయవంతంగా
## పూర్తి చేయాలి
### హుజురాబాద్ ఆర్డీవో జల కుమారి
### బి ఎల్ ఓ లకు రైన్ కోట్స్ పంపిణీ



**జమ్మికుంట, (సింగిడి):** సర్ ప్రోగ్రాంను విజయవంతంగా పూర్తి చేయాలని ఎక్కడ ఎలాంటి తప్పులు లేకుండా పూర్తిస్థాయిలో ఓటర్లకు అవగాహన కల్పించి హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలో ఈ కార్యక్రమాన్ని నెంబర్ వన్ స్థానంలో నిలిపేలా బిఎల్వోలు నిబద్ధతతో పనిచేయాలని హుజురా బాద్ ఆర్డీవో జల కుమారి అన్నారు. గురువారం జమ్మికుంట మండలంలోని పలు గ్రామాలలో ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బిఎల్ఓ ల పనితీరును ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే ఉత్సాహంతో పూర్తిస్థాయిలో సర్ ప్రోగ్రాంను విజయవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయంలో బిఎల్ఓ లకు రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని రైన్ కోట్స్ ను అందించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి జమ్మికుంట తహసిల్దార్ గడ్డం సుధాకర్ డిప్యూటీ తహసిల్దార్ ఏశంకర్ గిర్ధవార్లు జి శంకర్ సత్యనారాయణ కార్యాలయ సిబ్బంది పలువురు బిఎల్వోలు పాల్గొన్నారు.

### ఈదులకుంట చెరువులో
## పడి వ్యక్తి గల్లంతు



**జవహర్ నగర్, (సింగిడి):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని ఈదులకుంట చెరువులో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి పడి గల్లంతయ్యాడు. ఈ ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం దమ్మాయిగూడ పరిధిలోని ఆర్ జి కే కాలనీలో శివ భార్య పిల్లలతో కలిసి నివసిస్తు న్నాడు. శివ సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్నేహితులతో కలిసి జవహర్ నగర్ లోని ఈదులకుంట చెరువు లో పడి మృతి చెందాడు. స్థానికులు జవహర్ నగర్ పోలీసులకు సమాచారం అందించగా వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని డిఆర్ఎస్ బృందాలతో శివమృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
## ఎల్గొన్న బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి



**ఎల్బీనగర్, (సింగిడి):** భారతీయ మజ్దూర్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివేకానంద నగర్ ఆటో డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు రూపులాల్ ఆధ్వర్యంలో గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ బస్ స్టాప్ వద్ద బీఎంఎస్ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ నాయకులు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి హాజరై ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా భారతీయ మజ్దూర్ సంఘ్ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సామాజిక భద్రత కోసం నిరంతరం సేవలందిస్తోందని కొని యాడారు. దేశ ఆర్థికాభివృద్ధికి కార్మికుల శ్రమే పునాది అని, వారి గౌరవం సంక్షేమాన్ని కాపాడటానికి భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. బీఎంఎస్ స్థాపన నుంచి జాతీయ భావజాలంతో కార్మికులను ఏకతాటిపైకి తీసుకువచ్చి దేశాభివృద్ధిలో భాగస్వాములను చేస్తోందని పేర్కొంటూ, ఆటో డ్రైవర్లు సహా అన్ని వర్గాల కార్మికుల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్, బీఎంఎస్ ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులు షైక్ ఉమర్, కేశవ్, నర్సింహా, చింటూ, శారదానగర్ కాలనీ పెద్దలు శివరామయ్య, స్థానిక నాయకులు, బీజేపీ కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 28 నుంచి హైదరాబాద్ ప్రాపర్టీ షో




**హైదరాబాద్ బ్యూరో, (సింగిడి):** క్రెడాయ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రాపర్టీ షో-2026 ఆగస్టు 28 నుంచి 30 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లోని హాల్స్ 1, 3లో నిర్వహించ నున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాది ప్రాపర్టీ షో థీమ్ "రేటు ఆగదు... డిమాండ్ తగ్గదు"గా నిర్ణయించారు. షోలో 100కు పైగా రెరా ఆమోదిత ప్రాజెక్టులు ప్రదర్శనకు ఉండగా, కొనుగోలుదారులు డెవలపర్లతో నేరుగా మాట్లాడే అవకాశం, ప్రముఖ బ్యాంకుల నుంచి గృహ రుణాలపై సమాచారం, ఆర్థిక సలహాలు పొందే వీలుంటుందని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్. జైదీప్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల విస్తరణ, ఐటీ రంగ అభివృద్ధితో రియల్ ఎస్టేట్‌కు నిరంతర డిమాండ్ కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.

### జగ్గారెడ్డి - నిర్మల ఆధ్వర్యంలో సంగారెడ్డిలో
# 1000 మందితో మహా పాదయాత్ర
### రాహుల్ గాంధీ కి మద్దతుగా నల్ల టీ షర్ట్స్ ధరించి క్లాసిక్ గార్డెన్స్ నుండి గంజి మైదాన్ వరకు పాదయాత్ర
### మద్దతుగా గత మూడు రోజులనుండీ సంగారెడ్డిలో కొనసాగుతున్న ఆందోళనలు



**సంగారెడ్డి బ్యూరో, (సింగిడి):** నీట్ పేపర్ లీకేజీ ఘటన బాధితులపై చర్యలు తీసుకోవాలంటూ... రాహుల్ గాంధీ చేసిన నిరసనలకు మద్దతుగా సంగారెడ్డిలో మూడో రోజు ఆందోళనలు కొనసాగాయి. ప్రజల పక్షాన నిలుస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం ఆటవికపు చర్య అంటూ సంగారెడ్డిలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. తమ పార్టీ నేతలను నిర్బంధించి... పార్లమెంటులో గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆరోపించారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులతో పాటు. రాహుల్ గాంధీకి మద్దతుగా పాదయాత్ర చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా... నల్ల టీ షర్టు ధరించి సుమారు 1000 మంది ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. సంగారెడ్డి పట్టణం లోని క్లాసిక్ గార్డెన్స్ నుండి మొదలుకుని గంజి మైదాన్ వరకు 5 కిలోమీటర్ల మేర ర్యాలీ సాగింది. ప్లకార్డులు ప్రదర్శన, నినాదాలతో కార్యకర్తలు నిరసన ను హోరెత్తించారు.

## కుత్బుల్లాపూర్ అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



**కుత్బుల్లాపూర్, (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సుమారు రూ. 20 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పేట్ బషీరాబాదు లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నియోజకవర్గంలోని రహదారుల నిర్మాణం, విద్యుత్ సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో ఎమ్మెల్యే సమగ్రంగా సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి అభివృద్ధి పనిని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎల్–నినో ప్రభావంపై సమన్వయంతో పనిచేయాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్






**హుస్నాబాద్, (సింగిడి):** హుస్నాబాద్ ఇంటిగ్రేటెడ్ ఆఫీసర్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఎల్–నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ కార్యాచరణపై సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ పీఠభూమి ప్రాంతం కావడంతో సాధారణ పరిస్థితుల్లోనే వర్షాల కొరత ఉంటుందని, ఈసారి ఎల్–నినో ప్రభావం నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం వర్షాభావ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉన్నందున తాగునీరు, సాగునీరు, పశుగ్రాసం, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. రైతులు వరి సాగును తగ్గించి మొక్కజొన్న, కందులు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఆయిల్‌పామ్ వంటి తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను సాగు చేసేలా వ్యవసాయ శాఖ విస్తృతంగా అవగాహన కల్పించాలని, నర్మెట్ట సమీపంలో ఆయిల పామ్ ఫ్యాక్టరీ ఉన్నందున ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని, ఒక గ్రామంలో 100 నుంచి 200 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తే రూ. 5 లక్షల ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు. విబీజీ రామ్‌జీ, తెలంగాణ జలసిరి పథకాల ద్వారా ఫామ్‌పాండ్లు, ఇంకుడు గుంతలు నిర్మించి నీటి సంరక్షణ చేపట్టాలని, ప్రతి ఇంటి వద్ద, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఇంకుడు గుంతలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్‌ఎం డీ నుంచి నిరంతరాయంగా తాగునీటి సరఫరా, భూగర్భ జలాల వారపు సమీక్ష, విద్యుత్ పొదుపు, ప్లాస్టిక్ రహిత నియోజకవర్గం, పశుగ్రాస నిల్వలు, పాడిపశువుల యూనిట్ల పంపిణీ వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే హుస్నాబాద్ నియోజకవర్గంలో శాతవాహన విశ్వ విద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల, 250 పడకల ఆసుపత్రి, పీజీ మెడికల్ కళాశాల, కరీంనగర్––హుస్నాబాద్ ఫోర్‌లేన్ రహదారి, అక్కన్నపేట–హుస్నాబాద్ రహదారి విస్తరణ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ఎల్లమ్మ చెరువు అభివృద్ధి, అర్బన్ ఫారెస్ట్ పార్క్, గౌరవెల్లి ప్రాజెక్టు వంటి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి మాట్లాడుతూ రైతు వేదికల ద్వారా వరి సాగును తగ్గించి ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తూ కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేస్తున్నామని తెలిపారు. హనుమ కొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ పంట మార్పిడిని ప్రోత్సహిస్తూ తాగునీటి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని చెప్పారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు, పంటల మార్పిడి, తాగునీటి నిర్వహణపై క్షేత్రస్థాయిలో కార్యాచరణ అమలు చేస్తున్నామని వివరించారు. సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, రెవెన్యూ, మున్సిపల్, గ్రామీణాభివృద్ధి, ఇరిగేషన్, మిషన్ భగీరథ, గ్రౌండ్ వాటర్, పంచాయతీరాజ్, ప్రణాళిక, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విలాసాగర్‌లో భూభారతి రీసర్వే అవగాహన సదస్సు

## హాజరైన హుజూరాబాద్ ఆర్డీవో జల కుమారి





**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామంలో గురువారం స్థానిక సర్పంచ్ గంగిరెడ్డి శ్రీకాంత్ ఆధ్వర్యంలో భూభారతిపై రీ సర్వే అవగాహన సదస్సు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుజూరాబాద్ ఆర్డీవో జల కుమారి జమ్మికుంట తహసీల్దార్ సుధాకర్ సహాయ సంచాలకులు కొలతల విభాగం కిషన్‌రావు హాజరయ్యారు. అధికారులు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించే భూముల రీ సర్వేతో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతాయని భూ సరిహద్దుల విషయంలో గొడవలు లేకుండా ఉంటాయని తెలిపారు. భూ రికార్డుల ప్రక్షాళనతో ప్రతి రైతుకు తమ భూమి హక్కుల పై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. రైతులు ఈ ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. అనంతరం రైతులు లేవనెత్తిన పలు సమస్యలకు వారు సమాధానం అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శంకర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఏ ఈ ఏఈఓ జెబిఓ భాను ప్రసన్న చందర్ రాజు పంచాయతీ కార్యదర్శి విష్ణు గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ ఉపసర్పంచ్ అర్జెల్లి దివ్య తోపాటు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**అధికారులను సన్మానించిన సర్పంచ్ శ్రీకాంత్**

భూభారతి రీసర్వే అవగాహన కార్యక్రమానికి విలాసాగర్‌కు వచ్చిన హుజూరాబాద్ ఆర్డీవో జల కుమారి జమ్మికుంట తహసీల్దార్ సుధాకర్ రావు తో పాటు ఇతర అధికారులను గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి శ్రీకాంత్ తో పాటు పాలకవర్గం వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై అధికారులకు పాలక వర్గ సభ్యులు తెలిపారు. ఈ విషయంపైస్పందించిన అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం చేపడతామని పేర్కొన్నారు.

దూదేకుల కార్పోరేషన్ ఏర్పాటుకై

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు వినతి


### నూరు బాషా కార్పొరేషన్ ఏర్పాటుకై ప్రశ్నిస్తానని హామీ



**జమ్మికుంట, (సింగిడి):** ఇటీవల మన రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల కుల కార్పొరేషన్లను ఏర్పాటు చేసిందని దీనిలో దూదేకుల నూర్ భాషా కుల కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా పక్కన పెట్టిందని దీనిని తక్షణమే కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురావాలని దూదేకుల నూర్ భాషా జేఏసీ లీగల్ సెల్ ఇంచార్జ్ మహమ్మద్ అంకూస్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాదులో ఎమ్మెల్సీ మల్లన్న కార్యాలయం లో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లా డుతూ రానున్న వర్షాకాలపు శాసనసభ సమావేశాల్లో నూర్భాష కులస్తుల కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రశ్నిస్తానని ఏర్పాటు చేసేంతవ రకు వదిలి పెట్టనని ఈ సందర్భంగా మల్లన్న హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో నూర్భాష జేపీసీ జాయింట్ సెక్రెటరీ రంజాన్, ఎం ఆర్ పి ఎస్ సీనియర్ నాయకులు చంద్రమౌళి పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులపై క్షేత్రస్థాయి పరిశీలన

### గడువులోగా నిర్మాణం పూర్తిచేయాలి: కలెక్టర్ సత్యప్రసాద్



**ధర్మపురి (సింగిడి):** నేరెళ్ల గ్రామంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, భవనాల రూపకల్పన, తరగతి గదులు, వసతి గృహాలు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని స్పష్టం చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ద్వారా విద్యార్థులకు ఆధునిక విద్యతో పాటు అత్యుత్తమ వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి పనిని బాధ్యతతో చేపట్టాలని సూచించారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రణాళికలను ప్లాన్ మ్యాప్ ద్వారా పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆర్డీవో మధుసూదన్, జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, తహసీల్దార్ శ్రీనివాస్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

'నీట్'పై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ

# 'చాయ్ పే చర్చ'

### ధర్మేంద్ర రాజీనామా, ప్రధాని క్షమాపణలు కోరిన మేధావులు విద్యార్థులపై దమనకాండను ఖండించిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్, (సింగిడి):** నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు. విద్యార్థులపై లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్య విరుద్ధమని, దేశం, ధర్మం పేరుతో మాట్లాడే కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనపై నైతిక బాధ్యత వహించాలని అన్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ కలెక్టరేట్ రోడ్డులోని సిరి టీ హోటల్ వద్ద మేధావులు, న్యాయవాదులు, వైద్యులు, వయోవృద్ధులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో కలిసి 'చాయ్ పే చర్చ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలపై చర్చించి, మేధావుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. నీట్ లీకేజీపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం, శాంతియుత నిరసన తెలిపిన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మేధావులు మాట్లాడుతూ, విద్యార్థులపై జరిగిన దమనకాండకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొరివి వేణుగోపాల్, పెంచాల లక్ష్మణ్‌రావు, వైద్యులు చాట్ల శ్రీధర్, వొద్దే రాంరెడ్డి, గుడిపాటి రమణారెడ్డి, పి. కిషన్‌రావు, ఎల్లారెడ్డి, బోయిని అశోక్, పలువురు మేధావులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్కింగ్ ఫీజు.. మురుగు కష్టాలు

## దేవుడి దర్శనానికి వెళ్తే.. దోమలతో పోరాటం



**ధర్మపురి, (సింగిడి):** జగిత్యాల జిల్లా ధర్మ పురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. వారి వాహ నాల కోసం మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన పార్కింగ్‌లో కనీస పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ కోసం కేటాయించిన స్థలం మురుగు నీటితో నిండిపోయి బురదమయంగా మారింది. రోజుల తరబడి నిల్వ ఉన్న మురుగు నీటిలో దోమలు విపరీతంగా పెరిగాయని భక్తులు చెబుతున్నారు. వాహనాలను నిలిపిన తర్వాత కార్ల డోర్లు తెరవగానే దోమలు గుంపులుగా లోపలికి దూసుకొస్తుండటంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నా రని వాపోతున్నారు. పార్కింగ్ స్థలాన్ని వినియోగిం చలేని పరిస్థితి ఏర్పడడంతో పలువురు భక్తులు తమ వాహనాలను ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారులపైనే నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. పార్కింగ్ ఫీజు మాత్రం క్రమం తప్పకుండా వసూలు చేస్తున్నా, పార్కింగ్ స్థలాన్ని వినియోగానికి అనువుగా ఉంచడంలో మున్సిపాలిటీ విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిల్వ ఉన్న మురుగు నీటిలో దోమలు, ఇతర క్రిమికీటకాలు విస్తరిస్తుండటంతో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భక్తుల ఆరోగ్యంతో పాటు పట్టణ ప్రతిష్ఠకు సంబంధించిన ఈ సమస్యను అధికారులు ఇకనైనా సీరియస్‌గా తీసుకుని మురుగు నీటిని వెంటనే తొలగించి, పార్కింగ్ స్థలాన్ని పరిశుభ్రంగా మార్చడంతో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టాలని భక్తులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు

## హుస్నాబాద్‌లో పలు ఆలయాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రార్థనలు



**హుస్నాబాద్, (సింగిడి):** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో జీవించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించు కుని రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు చేసిన మంత్రి, అనంతరం అయ్యప్ప ఆలయంలో 108 మంది ఋత్వికులు, 21 హోమగుండాలతో నిర్వహించిన శ్రీ వారాహి మూలమంత్ర హోమ మహా యజ్ఞంలో పాల్గొన్నారు. ఆ తర్వాత శ్రీకృష్ణ దేవాల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మరకత శివాలయంలో 108 కలశాలతో నిర్వహించిన వరుణ యాగంలో పాల్గొని రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోవాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో రైతాంగం ఆందోళన చెందుతోందని, అమ్మవారి అనుగ్రహంతో రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయం పుంజుకోవాలని, రైతులు ఆర్థి కంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్క రూ తమ కుటుంబ సభ్యుల సంక్షేమంతో పాటు లిలి" సర్వేజనా సుఖినో భవంతు"లిలి అనే భావనతో సమాజ శ్రేయస్సు కోసం కూడా ప్రార్థించాలని పిలుపుని చ్చారు. రైతు అభివృద్ధి చెందితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, రైతు బాగుంటేనే వ్యాపారులు, కార్మికులు, చేతివృత్తులవారు సహా సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. వారాహి అమ్మవారి కృపాకటాక్షంతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉం డాలని, ప్రతి ఇంట ఆనందం వెల్లివిరియాలని ఆకాం క్షిస్తూ ఈ మహాయజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న వేద పండితులు, నిర్వాహకులు, యజ్ఞ దంపతులను అభినందించారు. కార్యక్రమాల్లో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వేద పండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరికి బదులు ఆరుతడి పంటలే మేలు

### ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి: వ్యవసాయశాఖ అధికారి భాస్కర్



**ధర్మపురి (సింగిడి):** ఎల్ నినో ప్రభా వంతో ప్రస్తుత వానాకాలంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగు పై దృష్టి సారించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గురువారం ధర్మపురి రైతు వేదికలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ధర్మపురి డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయాధి కారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో ఆయన ఎల్ నినో ప్రభావం, ఖరీఫ్ సీజన్ పరిస్థితులు, ఆరుతడి పంటల ప్రణాళికపై సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది వానాకాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీటి అవసరం ఉన్న వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో అధిక దిగుబడులు అందించే ప్రత్యామ్నాయ పంటలైన కంది, మొక్కజొన్న, పెసర, మినుము, జొన్న, వేరుశెనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేసేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, విత్తనాల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణా ళికతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు విధానాలపై సాంకేతిక సూచనలు అందిస్తూ నష్టాలను తగ్గించే దిశగా వ్యవసాయ శాఖ సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆత్మ డిపిడి జాన్ సుధాకర్, ధర్మపురి సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) రాంచందర్, ధర్మపురి ఏఈఓ రాజ్ కుమార్, డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.


# నీట్ లీకేజీపై కాంగ్రెస్ నిరసన




**భిక్కనూరు, (సింగిడి):** నీట్ పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ బిక్కనూరు మండల కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ, రాస్తారోకో, దిష్టిబొమ్మ దహనం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని ఆరోపిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, బిక్కనూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, మం డల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్, మాజీ మం డల అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భీమ్ రెడ్డి, సర్పంచ్ బల్యాల రేఖ, సొసైటీ చైర్మన్ భూమ య్య, ఆలయ కమిటీ చైర్మన్ లింబాద్రి, జిల్లా కార్యదర్శి రాజబాబు గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జీవన్, యువజన కాంగ్రెస్ స్పోక్ పర్సన్ ప్రదీప్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్నాల శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం

### ఆర్టీసీ బస్సులో సురక్షితంగా ప్రయాణం చేద్దాం: జమ్మికుంట గద్దపాక బస్ సర్వీస్ ను ప్రారంభించిన ప్రణవ్





**జమ్మికుంట (సింగిడి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఉచిత బస్ సౌకర్యాన్ని కల్పించామని, మహిళల చుట్టే కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గురువారం జమ్మికుంట నుండి గద్దపాక వరకు నడిచే బస్ సర్వీసును బొంతుపల్లిలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రణవ్ కు మంగళ హారతు లతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మహి ళలతో కలిసి టికెట్ తీసుకొని బస్ లో ప్రయాణిం చారు. మహాలక్ష్మీ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని మహిళలను అడగగా అందుతున్నాయని చాలా సంతోషంగా ఉన్నామని వారు తెలిపారు. అంతకు ముందు ఇదే గ్రామంలో 8 లక్షల ఎస్డియఫ్ నిధులతో నిర్మించిన కల్వర్టును ప్రణవ్ ప్రారంభించారు. ఈ కల్వర్టు ద్వారా సుమారు 60 ఎకరాల పై చిలుకు రైతులకు ఇది ఉపయోగపడు తుందని, ఈ విషయంపై హుజురా బాద్ ఇంచార్జి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే మంజూరు చేపించిన ప్రణవ్‌కు గ్రామస్థులు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ముందుకు వెళ్తున్నారని, ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలకు ప్రయోజనం చేకూరే పనులు చేస్తున్నామని, గ్రామాల్లో రవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని దీన్ని గ్రామాల ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సర్వీసు మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇంచార్జి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వీణవంక మండల అధ్యక్షుడు రఘుపాల్ రెడ్డి తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్ కార్యక్రమంలో నియోజకవర్గం

# మొదటి స్థానంలో ఉండాలి.

### మ్యాపింగ్ అన్ మ్యాపింగ్ వివరాలు బిఎల్‌ఎల వద్ద ఉండాలి
### బిఎల్‌ఎల సమీక్షా సమావేశంలో ప్రణవ్




**జమ్మికుం, (సింగిడి):** హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హుజురాబాద్ మండల, పట్టణ బిఎల్‌ఏలతో సమగ్ర ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ(సర్) పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ గారు. ఇప్పటివరకు వార్డు, గ్రామాల్లో మ్యాపింగ్, అన్ మ్యాపింగ్ సంబంధించి పూర్తి వివరాలు బిఎల్‌ఏ దగ్గర ఉండాలని, సమస్యలు ఉన్న దగ్గర సంబంధిత కో ఆర్డినేటర్లకు సమాచారం అందజేయాలని, త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేసి హుజురాబాద్ నియోజకవర్గాన్ని అగ్ర స్థానంలో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, మండల, పట్టణ అధ్యక్షులు, వార్డ్ అధ్యక్షులు, బిఎల్‌ఏలు పాల్గొన్నారు.

'నీట్'పై ఢిల్లీ పోలీసుల

# చర్యలు ఖండనీయం

### శాంతియుత నిరసన హక్కును గౌరవించాలి
### జిల్లా కాంగ్రెస్ వైద్య విభాగం చైర్మన్ డా.వెంకటేశ్వర్లు



**కరీంనగర్, (సింగిడి)::** నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో శాంతి యుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులపై ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ వైద్య విభాగం చైర్మన్ డా. వెంకటేశ్వర్లు తెలిపారు. దేశంలో సివిల్స్‌తో సమానమైన ప్రతిష్ఠ కలిగిన ప్రవేశ పరీక్షగా భావించే నీట్ కోసం విద్యార్థులు వేల గంటలపాటు కఠోరంగా శ్రమించడంతో పాటు కుటుంబాలు ఆర్థిక, మానసిక త్యాగాలు చేస్తాయని అన్నారు. అలాంటి పరీక్ష ప్రశ్నాపత్రం పదేపదే లీక్ కావడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుతో పాటు దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయత కూడా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తూ శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులు, తల్లిదండ్రులపై పోలీసులు, గుర్తు తెలియని వ్యక్తులు హింసకు పాల్పడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, మేధావులు ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటం క్షమించరాని చర్య అని అన్నారు. అదే సమయంలో తెలంగాణ పోలీసులు ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షిస్తున్న తీరును అభినందించారు. నిరసన తెలిపే హక్కును గౌరవిస్తూ సమస్యలను సంయమనంతో పరిష్కరించే విధానం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలవాలని డా. వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు.

# ఖోఖో పోటీలకు ఆల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్ సర్వం సిద్ధం

### తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 155 జట్లు.. జూలై 24న ఘనంగా ప్రారంభం
### ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాలలో జూలై 24 నుంచి ప్రారంభమయ్యే సీబీఎస్ఈ క్లస్టర్–7 ఖో–ఖో పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. పోటీల ఏర్పాట్లను ఖో–ఖో ప్రతినిధు లతో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, ఒత్తిడి నివారణతో పాటు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందిం చడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. పాఠశాల మౌలిక సదుపాయాలను దృష్టిలో ఉంచుకుని సీబీఎస్ఈ ఈ టోర్నీ నిర్వహణ బాధ్యతలను అప్పగించింద న్నారు. అండర్–14, అండర్–17, అండర్–19 బాలికల విభాగాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి మొత్తం 155 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. వీటిలో అండర్–14లో 87 జట్లు, అండర్–17లో 55 జట్లు, అండర్–19లో 13 జట్లు ఉన్నాయి. క్రీడాకారిణులకు వసతి, భోజనం తదితర అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జూలై 24 ఉదయం 11 గంటలకు జరిగే ప్రారంభోత్సవానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా (ఐఏఎస్), సీబీఎస్ఈ ప్రాంతీయ అధికారి జంగం సునీల్ కుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర, కరీం నగర్ జిల్లా ఖో–ఖో సంఘాల ప్రతినిధులు కూడా పాల్గొంటారని చెప్పారు. సీబీఎస్ఈ పరిశీలకుడు ఇప్పటికే పాఠశాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలిం చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఖో–ఖో సంఘం రిఫరీ బోర్డు కన్వీనర్ వి. సూర్యప్రకాశ్, అంతర్జాతీయ ఖో–ఖో రిఫరీ ఏ. రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వివిధ జట్ల నిర్వాహకులు, శిక్షకులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ బడుల్లో... ఫీజుల దరువు...!

రాష్ట్రంలోని పలు ప్రైవేట్ బడుల్లో ఫీజుల మోత దరువేస్తుంది. ఆయా ప్రైవేట్ బడుల యాజమాన్యాలు అందినకాడికి దండుకోవాలనే లక్ష్యంతో ప్రతీ ఏడాది ఫీజులు పెంచుతుండటంతో తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. పిల్లల భవిష్యత్తే తమ భవిష్యత్తుగా భావించి, అప్పులు చేసి మరీ పిల్లలను చదివిస్తున్నారు. డిజిటల్ బోధన, టెక్నో పాఠశాల, ఐఐటీ ఫౌండేషన్ల పేరిట కొన్ని ప్రైవేట్ పాఠశాలలు అత్యధిక ఫీజులు వసూలు చేస్తూ,లక్షల్లో ఆదాయాన్ని పోగేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ లేకుండాపోవడంతో పాటు నియంత్రించే అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు కోకొల్లలుగా ఉన్నాయి. చూసీచూడనట్లు వ్యవహరించడంతో ప్రైవేట్ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఫీజులు మాత్రమే కాదు కొన్ని పాఠ శాల్లోనే యూనిఫాంలు, టై, బెల్టు లు, పుస్తకాలను కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా మారుతున్నాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఫీజులు భారంగా మారాయి. లాభార్జనే ధ్యేయంగా కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల పెంపుదలను కొనసాగిస్తున్నాయి. పాఠశాల ఫీజులతో పాటు ల్యాబ్, లైబ్రరీ, స్పోర్ట్స్, ట్యూ షన ఫీజుల కింద అందిన కాడికి దండుకుంటున్నాయి. ఫీజుల నియంత్రణను నిరంతరం పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలొస్తున్నాయి.

**అధిక దోపిడీతో ఆగమవుతున్న తల్లిదండ్రులు**

పిల్లల చదువు అనగానే కొందరు తల్లిదండ్రులు తమ ఆర్థిక స్తోమతను మరిచి ఎంత ఖర్చయినా ఫర్వాలేదని,మంచి స్కూల్‌లో చేర్పించాలని అనుకుంటుంటారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఒకటో తరగతికే రూ. 50వేలు ఫీజు అంటే దోపిడీ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మొదట అడ్మిషన్ ఫీజు పేరుతో రూ. 2వేల నుంచి రూ. 10వేల వరకు లాగే స్తున్నాయి. ఆ తరువాత ట్యూషన్ ఫీజు, స్పెషల్ ఫీజు, స్కూల్ డెవలప్‌మెంట్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ఫీజు, స్మార్ట్ క్లాసులు ఇలా ఫీజులు చిట్టా విప్పి, వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాయి. కొత్తగా అడ్మిషన్ తీసుకుంటే రెగ్యులర్ ఫీజుతో పాటు అదనపు భారాన్ని మోయాల్సిందే. అతి కష్టం మీద ఈ ఫీజులు చెల్లించిన తరువాత పుస్తకాలు, యూనిఫాం, షూలు, అట్టలు ఇలా వాటి జాబితా కూడా చాంతాడంత ఉంటోంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఫస్ట్‌టర్మ్ ఫీజు 60శాతం చెల్లించి, బతుకుజీవుడా అనుకుంటూ బయటపడేలోపే రెండో టర్మ్ ఫీజు చెల్లించాలని, లేదంటే పరీక్షలు రాయించమని పిల్లల డైరీల్లో రాసి పంపిస్తున్నారు. కనీస సదుపాయాలు లేని పాఠశాలలు సైతం ఫీజుల విషయంలో నిక్కచ్చిగా ఉంటున్నాయి. ముక్కుపిండి ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఆ స్థాయిలో సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. పేరుకే కార్పొరేట్ పాఠశాలలుగా చెప్పుకుంటున్నా అక్కడ వాస్తవ పరిస్థితుల్లో ఇరకు భవనాల్లో నడుపుతున్నారు. క్రీడా మైదానాలు కనిపించవు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు మరుగుదొడ్లు ఉండడం లేదు. ఇలాంటి స్కూళ్లపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు ఉన్నాయి.

**గతంలో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు ఇలా...**

ప్రభుత్వ నిబంధనల మేరకు ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లో రూ. 6వేలు, మండల కేంద్రాల్లో ఉన్న పాఠశాలల్లో రూ. 7,500, పట్టణాల్లో 8,600, జిల్లా కేంద్రంలో రూ. 10వేలు వసూలు చేయాలి. 4, 5 తరగతులకు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ. 9వేలు, పట్టణాల్లో రూ. 10,500, జిల్లా కేంద్రంలో రూ. 12వేలు ఆరో తరగతికి గ్రామీణ ప్రాంతాల్లో రూ. 9వేలు, మండల కేంద్రాల్లో 9,500, పట్టణాల్లో రూ. 11,100గా నిర్ణయించారు. పాఠశాల స్టార్ రేటింగ్ మేరకు ఈ ఫీజులను నిర్ణయించారు. అయితే ఈ ఫీజులతో తాము పాఠశాలలు నడపలేమని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు చెబుతున్నాయి.

**అమలు కానీ నిబంధనలు...?**

కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులపై అధ్యయనం చేయడానికి ఐఏఎస్ అధికారులతో ప్రభుత్వం గతంలో ఓ కమిటీని నియమించింది. ఏ పాఠశాలలో ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ప్రాంతాల వారీగా ఈ కమిటీ పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి అందించింది. పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని గ్రామాలు, పట్టణాల్లో పాఠశాలలను ఐదు కేటగిరీలుగా విభజించారు. మొత్తం 474 స్కూళ్లకు రేటింగ్‌లు ఇచ్చారు. స్టార్ రేటింగ్ స్కూళ్లకు సంబంధించి ఒకటి నుంచి పదో తరగతి వరకు ఫీజులు కూడా నిర్ధారిస్తూ ఈ కమిటీ సిఫారసు చేసింది. అలాగే ఎంత ఫీజు వసూలు చేస్తున్నారు.. ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలకు ఉన్న ప్రత్యేకతలు ఏమిటి? తదితర సౌకర్యాల వివరాలను తల్లిదండ్రులకు కనిపించేలా బోర్డులో ప్రదర్శించాలి. పాఠశాలలో వసూలు చేసే ఫీజులన్నిటికీ రసీదులు ఇవ్వాలి. ఇలా పలు రకాల నిబంధనలు విధించారు. కానీ, ఈ నిబంధనలేవీ అమలు కావడం లేదు.

**సొంత సిలబస్‌తో... పాఠ్యపుస్తకాలు..!**

రాష్ట్రంలోని పలు జిల్లాలో కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను విక్రయిస్తున్నాయి. ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి వరకు పాఠ్యపుస్తకాలకు రూ. 10వేలు నుంచి రూ. 12వేలు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలు కాకుండా ఒక్కొక్క పాఠశాల ఒక్కొక్క పబ్లికేషన్ పుస్తకాలను ఐటీఐ ఒరియంటెడ్ పేరుతో విక్రయాలు చేపడుతూ వాటినే బోధిస్తున్నాయి. నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన పుస్తకాలను బోధించాలి. కానీ, ఐదో తరగతి వరకు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇక ఆరో తరగతి నుండి తొమ్మిదో తరగతి వంకు ఇంటర్ స్థాయిలో ఉండే సిలబస్‌ను జోడించి సొంతంగా పుస్తకాలను తయారు చేయించి విక్రయాలు చేపడుతున్నారు. డైరీ, కంప్యూటర్, ఐఐటీ, నీట్ తదితర పుస్తకాలను వేలాది రూపాయిలకు అమ్మకాలు చేస్తున్నారు.


**అన్నీ తెలిసినా... మౌనం వీడని అధికారులు...?**

ప్రైవేటు పాఠశాలల్లో ఎటువంటి నోట్‌పుస్తకాలు, పాఠ్యపుస్తకాలను విక్రయించకూడదు. ప్రభుత్వ నిబంధన మేరకు పాఠ్య ప్రణాళికలు అనుసరించి సిలబల్ ఉండాలి. నిబంధనలు పాటించని పాఠశాలలకు నోటీసులు,తగు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేసిన చర్యలు తీసుకోవాల్సిన జిల్లా,మండల స్థాయి అధికారులు మాత్రం మౌనం వీడకుండా,అంతా తామే అన్నట్లుగా వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది.



ఈదునూరి మహేష్
ఎంసిజె(జర్నలిజం)
సీనియర్ జర్నలిస్ట్
సెల్: 9949134467

## 104వ ఉమ్మడి బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కట్ట లింగం



**హైదరాబాద్ (సింగిడి):** గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ దేవి, శ్రీ శ్రీ శ్రీ మాత మహంకాళి దేవి 104వ ఉమ్మడి బోనాల ఉత్సవ కమిటీకి అధ్యక్షుడిగా కట్ట లింగం, ప్రధాన కార్యదర్శిగా అల్లె రాంకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దొర్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ, బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహించేందుకు కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రధాన కార్యదర్శి ఆనందేశి వేణుబాబు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవ సలహాదారులు కట్ట రాజయ్య, గూడబోయిన శివరత్నం, కట్ట శివరాజ్, సేనాపతి చంద్రశేఖర్, గాండ్ల నిరంజన్ బాబు, ప్యాట నందకిషోర్‌తో పాటు గంగపుత్ర సంఘం ప్రతినిధులు, కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలుగు సాహిత్యానికి ఇంద్రగంటి ఎనలేని సేవలు

## నేడు ఇంద్రగంటి శ్రీకాంత శర్మ వర్ధంతి

తెలుగు సాహితీ ప్రపంచంలో సుపరిచితులైన సాహితీవేత్త ఇంద్రగంటి శ్రీకాంతశర్మ. ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ దాదాపు లేదనే చెప్పాలి. పండిత వంశంలో జన్మించి, సాహితీ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని, సినిమా పాటలు రాసిన కవిగా, పండితునిగా,



కథా రచయితగా, పత్రికా సంపాదకునిగా, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ ప్రత్యేక గుర్తింపు పొందారు.

తూర్పు గోదావరి జిల్లా, రామచంద్ర పురంలో శ్రీకాంత శర్మ మే 29 1944 న జన్మించారు. ఆయన తండ్రి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి కవి గొప్ప కవి. తెలుగు పొట్టి కథలకు "కథానిక" అనే అద్భుతమైన పేరు సూచించి, ఆ సాహితీ ప్రక్రియకు ఒక సమున్నత స్థానాన్ని కల్పించిన హనుమచ్ఛాస్త్రి గొప్ప కవి కావడం మూలాన, చిన్ననాటి నుండే సాహిత్య వాతావరణంలో పెరిగిన శ్రీకాంత శర్మ, విద్యార్థి దశలోనే రచనా వ్యాసంగం చేపట్టారు. తెలుగులో ఎం. ఏ. పట్టభద్రులై, తర్వాత అభ్యుదయ కవిగా శర్మ పేరొందారు.

అనేక? లలిత గేయాలు కవితలు, సాహిత్య వ్యాసాలతో పాటు రేడియో నాటికలు, నాటకాలు, డాక్యుమెంటరీలు, సంగీత రూపకాలను రచించారు. జన్మనిచ్చిన పితృ దేవుల వారసత్వాన్ని నిలబెట్టడంతో పాటు, అర్థవంతమైన రచనలెన్నో చేసి, సాహితీ ప్రియుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు శ్రీకాంత శర్మ. అపురూపమైన భావావేశం సొంతం చేసుకొని, ఆవేశాన్నైనా, ఆవేదననైనా అక్షరాల్లో లయబద్ధంగా అమర్చ గలగడం, పాఠకుల మనసులతో పాటు, మెదళ్ళనీ రచనల ద్వారా కదిలించ గలగడం శ్రీకాంత శర్మ ప్రత్యేకతలు.

పలు తెలుగు సినిమాల్లో ఆయన పాటలు రాశారు. 'కృష్ణావతారం', 'నెలవంక', 'రావుగోపాలరావు', 'రెండుజెళ్ల సీత', 'పుత్తడిబొమ్మ', 'చైతన్యరథం' వంటి చిత్రాల్లో శ్రీకాంత శర్మ పాటలు రాశారు. తన కుమారుడు ఇంద్రగంటి మోహనకృష్ణ తెరకెక్కించిన 'సమ్మోహనం' సినిమాలోనూ ఆయన పాటను రాశారు.

ఆంధ్రజ్యోతి వారపత్రికలో ఉప సంపాదకులుగా ఉద్యోగ జీవితం మొదలు పెట్టినా, కొంతకాలం సినిమా రంగంలో పని చేసినా, ఆలిండియా రేడియోలో అడుగు పెట్టాకనే శ్రీకాంతశర్మ సృజనాత్మకత పూర్తిగా రెక్కలు విప్పుకుంది. ఆయన రచించిన ఎన్నో సంగీత రూపకాలు జాతీయ స్థాయిలో బహుమతులు అందుకున్నాయి. ఆయన రచించిన లలిత గీతాలు ఈనాటికీ బహుళ ప్రాచుర్యంలో ఉన్నాయి. తెలుగు నాటక రంగానికీ, తెలుగు సాహిత్య రంగానికీ ఆయన చేసిన కృషి ఎన్నదగినది.

1976లో ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో అసిస్టెంట్ ఎడిటర్ గా శర్మ చేరాడు. తెలుగు ప్రసంగాల శాఖకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాసంగికులు ఉషశ్రీకి సహాయకునిగా సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. శర్మ వివిధ పత్రికలలో గేయాలు, కవితలు, సాహిత్యవ్యాసాలు వ్రాశారు. అనేక రేడియో నాటికలు, నాటకాలు, డాక్యుమెంటరీలు, సంగీత రూపకాలు రచించారు. రేడియో ప్రసంగాలు చేశాడు. 1994లో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ గా నిజామాబాద్ కేంద్రంలో పని చేశాడు. 1995లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సంపాదకులుగా చేరారు.

1977లో అనుభూతి గీతాలు కవితా సంపుటికి ఫ్రీవర్స్ ఫ్రంట్ పురస్కారం, 1979లో నూతలపాటి సాహితీపురస్కారం, 1981లో ఆకాశవాణి వార్షిక పోటీలలో అమరామరం డాక్యుమెంటరీకి ప్రథమ బహుమతి, 1981లో ఆకాశవాణి వార్షిక పోటీలలో వర్షానందిని సంగీత రూపకానికి ప్రథమ బహుమతి, 1986లో ఆకాశవాణి వార్షిక పోటీలలో నేనుకాని నేను సృజనాత్మక రూపకానికి ప్రథమ బహుమతి, 1988లో ఆకాశవాణి వార్షిక పోటీలలో మాటా – మౌనం సంగీత రూపకానికి ప్రథమ బహుమతి, 1988లో ఆకాశవాణి వార్షిక పోటీలలో నిశ్శబ్దగమ్యానికి ద్వితీయ బహుమతి, 1990లో ఆకాశవాణి వార్షిక పోటీలలో మెట్లకు ద్వితీయ బహుమతి, తదితరాలు సొంతం చేసుకున్నారు. ఆయన సతీమణి ఇంద్రగంటి జానకీబాల ప్రముఖ రచయిత్రి. నవలా రచయిత్రిగా, రేడియో కళాకారిణిగా, లఘు కథల రచయిత్రిగా, కవయిత్రిగా సుపరిచితులు. కుమార్తె కిరణ్మయి కూడా లఘు చిత్రాలు తీస్తూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చు కున్నారు. కుమారుడు ఇంద్రకంటి మోహన కృష్ణ సినీ దర్శకునిగా మంచి గుర్తింపు పొందారు. దర్శకునిగా ఆయన తొలి చిత్రం 2004లో గ్రహణంకు భారత జాతీయ చలన చిత్ర పురస్కారం, ఉత్తమ నూతన దర్శకులుగా నంది పురస్కారంతో పాటు ఆ సినిమాకు 11 అవార్డులు దక్కడం విశేషం. 2006లో మాయాబజార్, 2008 లో అష్టా చమ్మా, 2011లో గోల్కొండ హైస్కూల్, 2013లో అంతకు ముందు ఆ తర్వాత ( ఉత్తమ కథా రచయిత గా నంది అవార్డు), 2015లో బందిపోటు, 2016లో జెంటిల్ మాన్, 2017 లో అమీతుమీ, 2018లో సమ్మోహనం, 2020లో వి. తదితర చిత్రాలలో తన ప్రతిభను చాటారు.

**– రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పౌరాణిక చిత్రాల బ్రహ్మ కమలాకర కామేశ్వరరావు

**నేడు కామేశ్వర రావు వర్ధంతి**

తెలుగు సినిమా ప్రపంచంలో ప్రత్యేక స్థానం కమలాకర కామేశ్వరరావు ది. పౌరాణిక సినిమాలకు కేరాఫ్ అడ్రస్ ఆయనదే. తెలుగు సినిమా ప్రేక్షకుల హృదయాలలో దైవ స్వరూపునిగా సుస్థిర స్థానం సంపాదించుకుని, పాత తరానికి చెందిన కొందరిచే చిత్ర పట పూజలు సైతం అందుకున్న ఎన్టీఆర్, పౌరాణిక హీరోగా వెలుగు వెలగడానికి కారణం కమలాకర కామేశ్వరరావు తీసిన సినిమాలే. తెలుగు పౌరాణిక చిత్రాలకు సాటి రాగల పౌరాణికాలు యావద్భారత దేశంలోనే మరే భాషలో లేవు. తెలుగు పౌరాణికాలకు ఆ ఘనతను సాధించి పెట్టిన చిత్రాలు చాలానే ఉన్నాయి. నర్తనశాల, పాండవ వనవాసం లాంటివి ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనంగా మిగిలి పోయాయి. వాస్తవానికి తెలుగు ప్రేక్షకులకు తన సినిమాలతో భక్తి మార్గం పట్టించిన ఘనుడాయన. ఆయన తీసిన సినిమాలు.. ఒక్కొక్కటి ఒక్కొక్క ఆణిముత్యం.

కమలాకర కామేశ్వరావు 1911 అక్టోబర్ 4న మచిలీపట్నంలో జన్మించారు. అక్కడే బి.ఎ పూర్తి చేశారు. మొదట్లో కృష్ణా పత్రికలో 'సినీఫాన్' అన్న పేరుతో సినిమా రివ్యూలు వ్రాసే వారు. విడుదలైన తెలుగు సినిమాలను; న్యూ థియేటర్స్, ప్రభాత్ వారి హిందీ సినిమాలనూ కూలంకషంగా పరిశీలిస్తూ నిశితంగా విమర్శించేవారు. సినిమాల్లో కథ, కథాసంవిధానం ఎలా వున్నాయి? ఆ సినిమాలు టెక్నికల్ గా ఎలా వున్నాయి? అన్న విషయాల మీద ఆయన విమర్శలు సాగేవి. తెలుగు, హిందీ సినిమాలే గాక ఆంగ్ల చిత్రాల గురించి కూడా వ్రాసేవారు. 1931లో నోబెల్ బహుమతి గ్రహీత పెరల్ బుక్ రాసిన 'గుడ్ ఎర్త్' నవలను 1937లో సిడ్నీ ఫ్రాంక్లిన్ దర్శకత్వంలో ఇర్వింగ్ తాల్ బర్గ్ సినిమాగా నిర్మించగా, అందులో పాల్‌ముని, లూసీ రైనర్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఆస్కార్‌ను గెలుచుకుంది. ఈ సినిమా గురించి కమలాకర నాలుగు వారాలు సమీక్షలు రాశారు. నిశిత దృష్టితో రాసిన ఆ సమీక్షలు పాఠకులను విపరీతంగా ఆకర్షించాయి.

ఆయన సినిమా విమర్శలకు ఎంతో విలువ ఉండేది. ఆ విమర్శలు విజ్ఞులందరికీ ప్రామాణికంగా ఉండేవి. ఆ విమర్శల్ని చదివి, వాటిలో 'బాగుంది' అని వ్రాస్తేనే ఆ సినిమాలను చూసేవాళ్ళు, బాగలేదని వ్రాస్తే చూడని వాళ్ళు కూడా ఉండేవారు. ఆయాన విమర్శలను నార్ల వెంకటేశ్వరరావు, గూడవల్లి రామబ్రహ్మం లాంటి ప్రముఖులందరూ ప్రశంసించారు. 'వస్త్రాపహరణం', 'మానసంరక్షణం' చిత్రాల మీద వ్రాసిన విమర్శలే కామేశ్వర రావును సినిమా రంగంలోకి అడుగులు వేసేలా చేశాయి. 1936లో ఆయన సినిమాల మీదున్న మక్కువతో మద్రాస్ చేరారు. స్క్రిప్ట్ మీదున్న పట్టువల్ల, మొదట్లో రచయితగా పని చేశారు. అదే సమయంలోనే



కె.వి. రెడ్డి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు. ఆయనతో కలిసి అనేక సినిమాలకు స్క్రిప్ట్ వర్క్ కూడా చేశారు.

వాహినీ వారి దేవత చిత్రం నుంచి కామేశ్వరరావు అసోసియేట్ గా పనిచేశారు. ఆసియాలోకెల్లా అతిపెద్ద స్టూడియోగా పేరుపొందిన వాహినీ స్టూడియోకు శంకుస్థాపన జరిగినప్పుడు మట్టి వేసిన వారిలో కామేశ్వరరావు ఒకరు.

బందరులో కామేశ్వరరావుకు పింగళి నాగేంద్రరావుతో ఉన్న పరిచయంతో, కామేశ్వరరావు ఆయనను కె.వి.రెడ్డికి, బి.ఎన్.రెడ్డికి పరిచయం చేశారు. అలా తెలుగు సినిమా చరిత్రలో అత్యంత ప్రతిభా వంతమైన రచయితను పరిశ్రమకు పరిచయం చేసింది కూడా కామేశ్వరరావే.

కమలాకర కామేశ్వరావు దర్శకత్వం వహించిన మొదటి సినిమా 'చంద్రహారం'. ఇది జానపద సినిమాగా తెరకెక్కింది. ఇదే సినిమాను తమిళ వెర్షన్‌లో కూడా చేశారు. ఆ తర్వాత తీసిన 'పెంకి పెళ్లాం' సినిమా చేశారు. ఎన్టీఆర్‌తో కలిసి 'పాండురంగ మహాత్మ్యం' అనే పౌరాణిక సినిమా చేసిన కామేశ్వరావుకు ఊహించని పేరు వచ్చింది. ఈ సినిమా అప్పటి వరకు గ్లామర్ హీరోగా వెలిగిన ఎన్టీఆర్ ఈ సినిమాలో మరో కోణంలో చూపించి సక్సెస్ అందుకున్నారు. తర్వాత వరుసగా 'శోభ', 'రేచుక్క పగటి చుక్క', 'మహాకవి కాళిదాసు' 'మహామంత్రి తిమ్మరుసు' లాంటి సినిమాలు ఆయన దర్శకత్వంలో వచ్చి హిట్స్ అందుకున్నాయి. 'మహాకవి కాళిదాసు', 'మహామంత్రి తిమ్మరుసు' సినిమాలకు రాష్ట్రపతి పురస్కారం అందుకున్నారు కామేశ్వరరావు.

1962లో వచ్చిన 'గుండమ్మకథ', 'మహామంత్రి తిమ్మరుసు' వంటి వరుస సక్సెస్‌లతో బాక్సాఫీస్ దగ్గర కామేశ్వరావు పేరు మారుమ్రోగి పోయింది. 'గుండమ్మ కథ' సినిమా కుటుంబ కథా చిత్రంగా కామేశ్వరావుకు మంచి పేరు తెచ్చుకుంది.

కామేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన మరో హిట్ మూవీ 'నర్తనశాల'. ఈ సినిమాతోనే ఎస్. వి. రంగారావుకు ప్రపంచ వ్యాప్తంగా పేరొచ్చింది. జకార్తాలో జరిగిన ఆఫ్రో ఏషియన్ ఫిలిం ఫెస్టివల్‌లో పాల్గొని ఉత్తమ నటుడిగా ఎస్వీఆర్ అవార్డు అందుకున్నారు.

అంతకు ముందు కమలాకర దర్శకత్వంలో వచ్చిన 'పాండవ వనవాసం' సినిమా కూడా కామేశ్వరరావుకు మంచి పేరు తీసుకొచ్చింది. పౌరాణిక సినిమాల్లో అదే ఆయన ఫస్ట్ మూవీ. ఆ తర్వాత 'శకుంతల', 'శ్రీకృష్ణ తులాభారం', 'కాంభోజరాజు కథ', 'శ్రీకృష్ణావతారం', 'కలిసిన మనసులు', 'వీరాంజనేయ' లాంటి సూపర్ హిట్ సినిమాలు దర్శకుడిగా ఆయన ఖ్యాతిని పెంచాయి.

పౌరాణికాల మీదున్న పట్టుతో 1972లో కామేశ్వరరావు పిల్లలతో 'బాల భారతం' సినిమా తీసి ప్రేక్షకులను మెప్పించారు. 1970 ద్వితీయార్థానికి తెలుగులో పౌరాణికాలకు ఆదరణ పెరిగింది. ఒక రకంగా ఎన్టీఆర్ పౌరాణిక హీరోగా ఒక వెలుగు వెలగడంలో కమలకర కామేశ్వరరావు తీసిన సినిమాలే కీ రోల్ పోషించాయి. రామారావు కూడా కమలకర కామేశ్వరరావును తన గురువుగా భావించేవారు.

'కురుక్షేత్రం', అంతగా విజయవంతం కాకున్నా, తర్వాత ఆయన దర్శకత్వంలో వచ్చిన 'సీతారామ వనవాసం', 'వినాయక విజయం', 'వాసవీ కన్యకా పరమేశ్వరి మహాత్మ్యం', 'సంతోషిమాత వ్రత మహాత్మ్యం', 'శ్రీదత్త దర్శనం', 'అష్టలక్ష్మి వైభవం', 'ఏడుకొండల స్వామి' లాంటి పౌరాణిక సినిమాలెన్నో బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్‌గా నిలిచాయి.

దర్శకుడిగా కమలాకర కామేశ్వరావు పౌరాణిక, చారిత్రాత్మక, జానపద, సాంఘిక సినిమాలు చేసినా... ఆయనకు పేరు సంపాదించి పెట్టినవి మాత్రం పౌరాణికాలే. అందుకే ఆయన్ని అందరు తెలుగు వెండితెర పౌరాణిక బ్రహ్మగా కీర్తిస్తారు. ఎన్నో అపురూపమైన చిత్రాలలో ప్రేక్షకుల మనసు దోచుకున్న కామేశ్వర రావు 1998 జూన్ 29న కన్ను మూశారు. గ్లాస్గో పంచె, తెల్లని మల్లెపూల వంటి జబ్బా, నెరసిన జుట్టు, నుదుట కుంకుమ బొట్టు... జీవితంలో ప్యాంటు వేయని మూర్తీభవించిన తెలుగుదనానికి ప్రతీకగా నిలిచిన కమలాకర కామేశ్వరావు మన మధ్య లేకపోయినా. ఆయన సినిమాలతో ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో చిరంజీవిగా నిలిచే ఉన్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494**

## శవ్యాప్తంగా జాతీయ పోలియో నిర్మాణ కార్యక్రమం



**పాలేరు (సింగిడి):** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేలకొండపల్లి ఆధ్వర్యంలో దేశవ్యాప్త గా ,నిర్వహించబడుతున్న జాతీయ పోలియో నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 12.30.గంటలకు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజారాంపేట గ్రామంలో నిర్వహిస్తున్న పోలియో కేంద్రాన్ని సందర్శించి 0-5 సంవత్సరంలోపు పిల్లలకు పోలియో చుక్కలని వేయటం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 0-5 సంవత్సరంలోపు పిల్లలందరూ తప్పనిసరిగా పోలియో చుక్కలు తీసుకోవాలని చిన్నారుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఆదివారం ఉదయం 8:00 గంటలకు చెరువు మాదారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోలియో నిర్మూలన కార్యక్రమం ఖమ్మం జిల్లా పల్స్ పోలియో,ప్రత్యేక అధికారి డాక్టర్ అరుణ, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్, వైద్యాధికారి డాక్టర్ సన, మండల అభివృద్ధి అధికారి ఎర్రయ్య, మండల తహసిల్దార్ రాంప్రసాద్, చెరువు మాదారం గ్రామ సర్పంచ్ ఎల్లయ్య సంయుక్తంగా మండల వ్యాప్త పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్యం విస్తరణ అధికారి చంద్రశేఖర్,జనూ శ్రీమతి శాంతిరాణి, ఆరోగ్యశాఖ సూపర్వైజర్లు, ఫార్మసీ ఆఫీసర్ జ్యోత్స్న మరియు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చెరువు మాదారశీ పరిధిలో 0-5 సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులు 3046 మంది అని అందుకుగాను గాను ఆదివారం,2954 అనగా 97% మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించడం జరిగిందని మిగిలిన వారిని 29, 30 తారీకులలో,ఇంటింటిని సందర్శించి ఆదివారం పోలియో టీకాలు వేపించుకొని వారిని గుర్తించి 100% పూర్తి చేస్తామని తద్వారా మండలాన్ని పోలియో రహిత మండలం గా తీర్చిదిద్దుతామని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు.




# ఎక్కిరిస్తున్న ఏవుసం... కరిగిపోతున్న కార్తెలు

వ్యవసాయం తెలంగాణకు జీవనాధారం. రాష్ట్ర అభివృద్ధిలో ఇది ప్రధాన భూమిక పోషిస్తూ ఉంది. రాష్ట్ర జనాభాలో దాదాపు 55% కంటి ఎక్కువగా వ్యవసాయాన్ని నమ్ముకొని ఉన్నారు. 2014 మరియు 2015 సంవత్సరానికి గాను రాష్ట్ర మొత్తం జిఎస్ జిపిలో 9.3% గా ఉంది. నూతనంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని లాభసాటి వనరుగా తయారు చేయాలని సంకల్పించింది. ఇందుకోసం ప్రత్యేకంగా బడ్జెట్లో అత్యధికంగా నిధులను కేటాయిస్తుంది. వ్యవసాయ అభివృద్ధి ప్రధాన అజండాగా చేసుకుని లక్ష సాధనకు తీవ్రమైన కృషి చేస్తుంది. ఎందుకోసం విత్తన ఉత్పత్తికి తగిన విధంగా పరిశోధనలు కూడా సాగుతున్నాయి.

ప్రస్తుత తెలంగాణ పరిస్థితి: ప్రస్తుతం తెలంగాణలో కార్తెలు కరిగి వెళ్ళిపోతున్నాయి, ఆరుద్ర కార్తె ప్రవేశించి వారం రోజులు దాటిపోతున్న వర్షాలు జడాపత్తా లేకుండా పోయితున్నాయి. ఇటీవల రైతులు వేసిన పత్తి తదితర విత్తనాలు దుక్కి లోనే ఎండిపోతున్నాయి. వరి నాట్ల సమయం దగ్గర పడుతున్నా పొలాలు నెర్రెలు బట్టి పోతున్నాయి. జలాలు అడుగంటి పోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఇది ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన వర్షాభావ సమస్య.

ఖరీఫ్ సీజన్: తెలంగాణలో
ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటిపోతున్న వర్షాలు కరుణించకపోవడంతో తెలంగాణ అన్నదాతలు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. రోహిణి కార్తె మృగశిర కార్తెలు ముగిసినా ఆరుద్ర కార్తె వెళ్ళిపోతున్న తెలంగాణ వ్యాప్తంగా ఆశించిన స్థాయిలో వర్షాలు పడటం లేదని రైతుల ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి పెట్టిన రైతులు తమ పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరే అవుతుందని కన్నీరు మున్నీరు అవుతున్నారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యం అవుతుండడంతో ప్రత్యామ్నాయ పంటలుగా కంది



మొక్కజొన్న ఆముదం పత్తి వంటి పంటలను సాగు చేయాలని చెబుతున్నా ఇప్పటికే విత్తిన పత్తి మొక్కజొన్న కు పెట్టుబడి పెట్టిన రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు జంకుతున్నారు. ఈసారి రైతులు విత్తనాలు ఎరువులు కొనాలంటే పెట్టుబడి రెట్టింపు అవుతుందని అప్పులు పెరిగిపోతాయని భయపడుతున్నారు. దిగుబడి వస్తుందో రాదోనని అనుమానంతో ప్రత్యామ్నాయ పంటల జోలికి పోవడం లేదు.

ఆరంభం నుంచి జాడ లేని వాన: ఈసారి ఖరీఫ్ మొదలైనప్పటినుండి ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 101 మిల్లీమీటర్ నమోదు కావాల్సి ఉన్నప్పటికీ 84 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయి వానల జాడే లేకుండా పోయింది. జూన్ నెలలోనే ఈ లోటు ఏర్పడడంతో ఖరీఫ్ సాగుపై నీలి నీడలు నెలకొన్నాయి. చెరువులు కుంటలు బోర్లలో నీటిమట్టం అడుగడుగునా ఎండిపోతుండడంతో సిద్దిపేట హన్మకొండ వరంగల్ జిల్లాలో భారీగా వర్షపాతం లోటు ఉండగా అదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్, మహబూబాబాద్ మేడ్చల్ సిద్దిపేట తదితర జిల్లాలో లోటు వర్షపాతం నమోదయింది.

పంటల స్థితి: తెలంగాణ వ్యాప్తంగా ప్రస్తుత సీజన్లో 1.32 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉండగా ఇప్పటివరకు తెలంగాణ రైతులు దాదాపుగా 15 లక్షల ఎకరాల్లో పంటలు వేసి ఉన్నారని వ్యవసాయ శాఖ తన రోజువారి వివరాల నివేదికలో స్పష్టం చేసింది. గత ఏడాది అనగా 2024 మరియు 2025 సంవత్సరాల్లో ఇదే సమయానికి దాదాపుగా 30 లక్షల ఎకరాల్లో పంట సాగు అయిందని వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి. ఈ వర్షాకాలంలో దాదాపుగా 62 లక్షల ఎకరాల్లో వరి సాగుకు లక్ష్యంగా ఉండగా ఇప్పటివరకు వేల ఎకరాల్లోనే వారి నాట్లు ఉండడం ఆందోళనకు గురి చేసే అంశం.

ప్రత్యామ్నాయాలు: ప్రస్తుతం ఎన్ని ఆటంకాలు ఉన్నప్పటికీ ప్రస్తుత వాతావరణ పరిస్థితి రాష్ట్రంలో వ్యవసాయ పరిస్థితిని మెరుగుపరచడం చాలా ముఖ్యం. అందుబాటులో ఉన్న వ్యవసాయ సామర్థ్యాన్ని శక్తి వంచన లేకుండా పునికి పుచ్చుకొని సాంకేతిక విజ్ఞానంతో వనరులతో సంపూర్ణంగా ఉపయోగించుకొని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ దార్శనికతను రూపకల్పన చేసుకోవడం మేలు. దీనికోసం రైతులు వాణిజ్యపరంగా గిట్టుబాటు అయ్యే వాణిజ్య పంటల వైపు వెళ్లడం విత్తనాలు ఎరువులు మొదలైన అవసరాలు రుణాలు విజ్ఞానం సమాచార సాంకేతిక సదుపాయాలు రైతులకు సులభంగా అందుబాటులోకి తేవడం ఉపరితల భూగర్భ జల అవకాశాలను ఉపయోగించు కొని సేద్యపు నీటిని సరిగా ఉపయోగించడం సమర్థవంతమైన భూసార జల నిర్వహణకు వీలుగా భూ జల అభివృద్ధికి మార్గాలను కనుగొనడం సాంకేతిక విజ్ఞాన వినియోగం కోసం సుశిక్షితులైన సిబ్బందిని అనగా ఏవోలు, ఏ ఈ ఓ లు, రైతుల వద్దకే పంపడం బిందు సేద్యం తుంపర సేద్యం మొదలైన వాటి ద్వారా సమర్థవంతంగా ప్రస్తుత పరిస్థితిని నెట్టుకు రావడం ముఖ్యం. మరియు ఐఎన్ఎం, ఐపియం ద్వారా వ్యవసాయాన్ని పర్యావరణ సహితంగా మార్చేలా రైతులను వారి సాధికారికతను పెంచడం ముఖ్యం. ఈ విధమైన ఆటుపోటులను అధిగమించేలా వ్యవసాయ అభివృద్ధి కోసం కొత్త ప్రయత్నాలు చేసినప్పుడే వ్యవసాయ రంగం పచ్చని తెలంగాణగా అభివృద్ధి చెంది వ్యవసాయాన్ని ఉత్తమ రంగంగా తీర్చిదిద్ది తెలంగాణను అన్నపూర్ణ రాష్ట్రంగా తీర్చిదిద్దవచ్చు.

### యోగా ఆరోగ్యకరమైన

## జీవన విధానానికి పునాది.

### అదనపు కలెక్టర్ ఎన్.వి.గిరి.



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (సింగిడి)::** యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక,మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వి.గిరి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం కామారెడ్డి ఖేలో ఇండియా కేంద్రంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వారసత్వమని,ఇది శరీరం,మనస్సు,ఆత్మల మధ్య సమతుల్యతను నెలకొల్పుతుందని తెలిపారు. నేటి వేగవంతమైన జీవన విధానంలో ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు,యువత, క్రీడాకారులు,ఆయుష్ శాఖ సిబ్బందితో కలిసి యోగాసనాలు నిర్వహించారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థులు,యువత,క్రీడాకారులు, ఆయుష్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. డా. వెంకటేశ్వర్లు (ఆయుష్ నోడల్ అధికారి,అదనపు డీఎంహెచ్ఓ),జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాజా గౌడ్,జిల్లా యువజన సేవల సిబ్బంది,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి వివిధ యోగాసనాలను ప్రదర్శించారు. జిల్లా ప్రజలు యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని అదనపు కలెక్టర్ ఎన్.వి.గిరి కోరారు.

### సీనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని

## నాగేశ్వరరావుకు నివాళి



కోదాడ, **(సింగిడి):** అనంతగిరి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన సీనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని జొన్నలగడ్డ నాగేశ్వరరావు ఇటీవల అకాల మరణం చెందడంతో కత్రం ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఎన్ఆర్ఐ శ్రీకాంత్ రెడ్డి ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం నాగేశ్వరరావు సతీమణి ఈశ్వరమ్మ, కుమారుడు రంగారావును కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. నాగేశ్వరరావు మరణం గ్రామానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు.




### ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు

## కొనసాగించడమే అసలైన నివాళి.

-శాసనసభ్యులు కాలె యాదయ్య..



**చేవెళ్ళ (సింగిడి):** తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి వేడుకలను చేవెళ్ల మండల విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య తో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు పార్టీల నేతలు చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జయశంకర్ తన జీవితాన్ని రాష్ట్ర సాధ న కోసం పూర్తిగా అంకితం చేశారన్నారు. ఆయన జీవితమంతా తెలంగాణ కోసం కలలు కంటూ, ఉద్యమానికి మార్గదర్శనం చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను, స్ఫూర్తిని కొనసాగిస్తామని, అందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, కౌన్సిలర్లు శైలజ ఆగిరెడ్డి, మంగలి కల్యాణి యాదగిరి, బక్కారెడ్డి మాధవి యాదిరెడ్డి, కె. మంగమ్మ మల్లేష్, మద్దెల శ్రీనివాస్, డి. గోపాల్ రెడ్డి, కృష్ణా నాయక్, తాళ్లపల్లి నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ బేగరి రాములు, పిఏసిఎస్ చైర్మన్లు, దేవర వెంకటరెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ లొశిక శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గిరిధర్ రెడ్డి, ఎర్రోనిగూడ మల్లేష్, రామన్నగూడ, ప్రభాకర్, ఖదీర్, సీనియర్ జర్నలిస్ట్ వి, శ్రీనివాసచారి,విశ్వకర్మ సంఘం నాయకులు శ్రీనివాస చారి,ఆనంద్ చారి, శేఖర్ చారి తదితరులు పాల్గొన్నారు..



అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కెజిఆర్ గార్డెన్లో యోగా సాధన కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువుల ఆధ్వర్యంలో ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు ప్రజలు, యోగాసనాలు, మెడిటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు బండారు శైలజ ఆగి రెడ్డి, మనిషా అనంతరెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎం యాదగిరి, చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, బిజెపి జిల్లా నాయకులు కుంచం శ్రీనివాస్ గుప్తా, డాక్టర్ వైభవ్ రెడ్డి, స్థానిక నాయకులు, యువకులు తదితరులు ఉన్నారు..

**(చేవెళ్ళ (సింగిడి )**

# -పేదలకు సొంతింటిని నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం. -శాసనసభ్యులు కాలే యాదయ్య.



**చేవెళ్ల (సింగిడి):** పేద ప్రజలను గుర్తించి సొంతింటిని కల సహకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యులు కాలే యాదయ్య అన్నారు.. ఆదివారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దండు ఇందిరమ్మ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజలకు సొంత ఇల్లు ఉండాలనే చిరకాల కోరికను నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది.
ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రతి పేద కుటుంబం సురక్షితమైన, శాశ్వతమైన గృహంలో నివసించాలనే సంకల్పంతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది. గ్రామీన పట్టణ ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సహాయాన్ని అందిస్తోంది. "పేద ప్రజలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రతి అర్హకుటుంబానికి ఇల్లు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇల్లు లేని ప్రతి పేదవారికి సొంత గూడు కల్పించేందుకు ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుంది" అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతూ, వారి ఆర్థిక మరియు సామాజిక స్థితిగతులను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తోంది. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం ప్రజల మన్ననలు పొందుతోంది. ప్రతి కుటుంబం సొంత ఇంటితో సంతోషంగా జీవించే రోజులు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు,మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పిఏసిఎస్ చైర్మన్లు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మున్సిపల్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

# యోగా ద్వారా శారీరక.. మానసిక ఆరోగ్యం





**పాలేరు (సింగిడి):** నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం హై స్కూల్ గ్రౌండ్లో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు శ్రీ సత్య సాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా శ్రీ భద్రయ్య గురూజీ, శ్రీ మధు గురూజీలు పాల్గొని యోగా యొక్క ప్రాముఖ్యత, ఆరోగ్య పరిరక్షణలో దాని పాత్ర గురించి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రాజేశ్వరపురంతో పాటు పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై యోగా సాధనలో పాల్గొన్నారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని గురూజీలు సూచించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన రాజ్యేశ్వరపురం గ్రామ సర్పంచ్ దండ రంగయ్య ముతాపురం గ్రామ సర్పంచ్ ఏలూరు రామారావు భారతీయ జనతా పార్టీ నాయకులు నున్నా రవికుమార్ ఇంటూరి అశోక్, దండా నరసింహారావు, బెల్లం లక్ష్మి బాగా మురళి, గరిణ వెంకటేశ్వర్లు, భువనగిరి యుగంధర్ నిర్వాహకులను పాల్గొన్న వారు అభినందించారు.

# అర్హులైన కూలీలందరికీ కొత్త జాబ్ కార్డులు మంజూరు చేయాలి..

### మంగళవారం ఖమ్మం కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి.

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధినేని కర్ణకుమార్ డిమాండ్

**పాలేరు (సింగిడి):** గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు ఉపాధి హామీ పథకం కింద వెంటనే కొత్త జాబ్ కార్డులను మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధినేని కర్ణకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ శాఖ సమావేశం చుట్టూ వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిద్ధినేని కర్ణకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ పేదల జీవనోపాధికి భద్రత కల్పించాల్సిన ఉపాధి హామీ పథకాన్ని అధికారులు, ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. కొత్త జాబ్ కార్డుల కోసం పేదలు నాలుగేళ్లుగా దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. ఒకవైపు అర్హులకు కొత్త కార్డులు ఇవ్వడం లేదు సరే, మరోవైపు ఇప్పటికే పాత కార్డులు ఉన్నవారికి కూడా నాలుగేళ్లుగా సరిగ్గా పనులు చూపించకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 14 వారాలుగా కూలీలు చేసిన పనికి రావాల్సిన ఉపాధి బకాయి డబ్బులను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తీవ్రమైన ఎండల్లో పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశాల్లో కనీసం ఓఆర్ఎస్ ( ఓ ఆర్ ఎస్ ) ప్యాకెట్లు, తాగునీరు, నీడ సదుపాయం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. అలాగే, ఏళ్లుగా ఆశగా ఎదురుచూస్తున్న అర్హులైన వితంతు మహిళలకు వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తాటి వేంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పేదల సమయాన్ని వృథా చేస్తూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారుల మొండి వైఖరి



నశించాలన్నా, మన హక్కులు సాధించుకోవాలన్నా పోరాటమే శరణ్యమని స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జరిగే మహా ముట్టడి కార్యక్రమానికి భైరవునిపల్లి గ్రామం నుండే కాకుండా మండలంలోని ప్రతి గ్రామం నుండి ఉపాధి కూలీలు, వితంతువులు, వ్యవసాయ కార్మికులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు, గ్రామ సహాయ కార్యదర్శి బాలెబోయిన వేంకటేశ్వర్లు, శాఖ సభ్యులు కుంచం బిక్షం, ముత్యాల వేంకటేశ్వరరావు, బాలిన పెద్ద నారాయణ, బాలిన చిన్న నారాయణ మరియు ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక ప్రొఫెసర్ జయశంకర్

### నల్లబెల్లి మండలంలో ఘన నివాళులు.

**నల్లబెల్లి, (సింగిడి );** తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా నల్లబెల్లి మండలంలో ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రొఫెసర్ జయశంకర్ పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు మామిండ్ల చిన్న ఐలయ్య మాట్లాడుతూ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ అందించిన సిద్ధాంతపరమైన దిశానిర్దేశం, ఉద్యమానికి కల్పించిన మేధోబలంచిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం ఆయన జీవితాంతం అంకితభావంతో పనిచేశారని అన్నారు. తెలంగాణ ఉద్యమం విజయవంతం కావడంలో ఆయన ఆలోచనలు, రచనలు, ప్రసంగాలు కీలకంగా నిలిచాయని చెప్పారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన దీర్ఘకాల పోరాటంలో జయశంకర్ చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రాంతీయ స్వాభిమానం కోసం ఆయన కలలు కన్న సమాజ నిర్మాణమే ఆయనకు నిజమైన నివాళి అని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో నల్లబెల్లి మండల ఉద్యమకారులు వేముల రాజు, ఎన్నమల్ల నరసయ్య, బత్తిని మల్లయ్య, పులి రమేష్ గౌడ్, కొత్తగట్టు ప్రభాకర్, సామల రాజు, జన్ను రాజయ్య, మహేష్‌తో



పాటు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ అభివృద్ధి, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల మనసుల్లో ప్రొఫెసర్ జయశంకర్ ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారని, ఆయన ఆశయ సాధనే ఆయనకు అర్పించే గొప్ప నివాళి అని పేర్కొన్నారు.

# రుద్రగూడెం ఎస్సీ కాలనీకి సీసీ రోడ్డు వరం రూ.6 లక్షలతో నిర్మాణం..

### ఎన్నికల హామీల అమలులో మరో ముందడుగు గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే మాధవ రెడ్డి కృషి ఫలితం

### -- కాంగ్రెస్ నాయకుల వెల్లడి.

**నల్లబెల్లి, (సింగిడి):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని రుద్రగూడెం ఎస్సీ కాలనీ ప్రజల ఎన్నో ఏళ్ల రహదారి సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సుమారు రూ. 6 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశాలు, ఆశీస్సులతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఎస్సీ కాలనీలో వర్షాకాలంలోబురదమయంగా మారే రహదారుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటుండగా, సీసీ రోడ్డు నిర్మాణంతో ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోతు చరణ్ సింగ్ మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే తమ లక్ష్యమని అన్నారు. పదవి చేపట్టిన తక్కువ సమయంలోనే గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. గ్రామంలో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ రుద్రగూడెంను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు



కృషి చేస్తున్నామని వెల్లడించారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కట్టుబడి ఉన్నారని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి గ్రామ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంతో విద్యార్థులు, వృద్ధులు, మహిళలు, రైతులు రాకపోకల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులుతొలగిపోతాయని గ్రామస్థులుఅభిప్రాయపడ్డారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజ్మీర తిరుపతి, వరంగల్ జిల్లా కార్యదర్శి చిట్యాల తిరుపతి రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రఘుపతి రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కర్నూరి కట్టయ్య, యూత్ అధ్యక్షుడు అయ్యప్ప, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కరుణాకర్, శివాజీ, చింటు, రాజు, 4వ వార్డు సభ్యురాలు అజ్మీర శ్రీలత రాజు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు గంధం కుమార్, సోషల్ మీడియా ఇన్‌చార్జి గద్దల సురేష్, పార్టీ సీనియర్ నాయకులు ప్రతాప్ సింగ్, లింగారెడ్డి, అమరేందర్, రమేష్, బాలరాజు, కుమార్, రాజయ్య, సుభాష్, మహిళా సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



చేవెళ్ల మున్సిపాలిటీ దేవుని ఎర్రవల్లి మూడో వార్డులో అర్జున్ స్వప్న నరసింహులు నూతన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశాన్ని కౌన్సిలర్ కరికే మీనాక్షి సత్యనారాయణ రిబ్బన్ కట్ చేసి నూతన గృహప్రవేశం చేశారు. అనంతరం దంపతులను శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ చీర శ్రీనివాస్ సామ విట్టల్ రెడ్డి బెస్ట్ పురం శ్రీశైలం సామ మాణిక్య రెడ్డి కంకంటి శ్యామలయ్య మంగలి నరసింహులు ఎదురే రాములు చాకలి పాండు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

(చేవెళ **(సింగిడి)**)

### చిన్నారులను ఆశీర్వదించిన భాగం హేమంత రావు, వెన్నపూసల సీతారాములు



**పాలేరు (సింగిడి): :** మండల పరిధిలోని భైరవునిపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన నూతన పట్టువస్త్రాల వేడుక నయనానందకరంగా సాగింది. సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు – నందిని దంపతుల కుమారుడు, కుమార్తెల నూతన పట్టువస్త్రాల వేడుకలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంత రావు, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, కాంగ్రెస్ మండల నాయకులు నల్లని మల్లికార్జున్ రావు, ఉప సర్పంచ్ ఆలేటీ ఉమామహేష్ ప్రజాప్రతినిధులు మరియు బంధుమిత్రులు పాల్గొని చిన్నారులకు దీవెనలు అందించారు.

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

### బిజెపి నాయకులు పిట్టల సూరిబాబు



పాలేరు జూన్ **(సింగిడి):**
ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వాటిని సమరీక్షించాలని బిజెపి ఓబీసీ మండల అధ్యక్షుడు పిట్టల సూరిబాబు అన్నారు. నరేంద్రమోదీ గారి 12 సంవత్సరాల పాలన సందర్భంగా రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు పిట్టల సూరిబాబు ఆధ్వర్యంలో అమ్మ పేరుతో మొక్క నాటే కార్యక్రమంలో భాగంగా స్థానిక సెంటర్లో ఓబీసీ మోర్చా నాయకులతో మొక్కను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి 12 ఏళ్ల పాటు ప్రధానిగా అనేక సేవలు అందించారని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు కేంద్ర ప్రభుత్వంతో సంక్షేమ ఫలాలు పొందారని అన్నారు. మోడీ పాలనలో దేశం మరింత ముందుకు పోతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్, మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, మండల నాయకులు షేక్ షర్ఫుద్దీన్ పురాణం దివాకర్, సయ్యద్ మోహినుద్దీన్,కొండా హర్షవర్ధన్, ఓబీసీ నాయకులు, కందరబోయిన గోపి, దేశబోయిన వేణుబాబు, పుట్టా సత్యనారాయణ, ఎలిగేటి గిరి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా యోగా వేడుకలు.



పాలేరు జూన్ **(సింగిడి):** ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా మండలం లోని వివిధ గ్రామాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ హస్పిటల్ లో వైద్యాధికారుల ఆధ్వర్యంలోనిర్వహించిన యోగ డే లో పలువురు పాల్గొన్నారు. యోగా విన్యాసాలను ప్రదర్శించారు. యోగా వలన ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులతో పాటు బీజేపీ పార్టీ నాయకులు పాగర్తి సుధాకర్, మల్లెబోయిన గోవిందరావు, కొండా హర్ష వర్ధన్, కందరబోయిన గోపి, పిట్టల సూరిబాబు, రామకృష్ణ, దివాకర్ తదితరులు పాల్గొన్నారు. మండలం లోని పలు ప్రవేట్ సంస్థలలో యోగా డే ను నిర్వహించారు. మండలం లోని నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం తదితర గ్రామాలలో పలు చోట్ల యోగా దినోత్సవం ను నిర్వహించారు.

### రాజ నర్సింలు కు దళిత రత్న అవార్డు.




కామారెడ్డి జిల్లా ప్రతినిధి **(సింగిడి):** కామారెడ్డి జిల్లా అడ్లూరు గ్రామానికి చెందిన పెరుమాండ్ల రాజ నర్సింలు దళిత హక్కులు,ఆత్మగౌరవం కోసం కొనసాగిస్తున్న పోరాటానికి గుర్తింపుగా దళిత రత్న అవార్డు అందుకున్నారు పెరుమాండ్ల రాజ నర్సింలు గత కొన్ని సంవత్సరాలుగా దళిత,బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ హక్కుల కోసం,అలాగే పేదల సంక్షేమం కోసం నిరంతర పోరాటం చేస్తున్నారు. ఆయన సేవలను,కృషిని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుతో సత్కరించింది. అవార్డును డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ నగరం లోని బంజారా హిల్స్ మినిస్టర్ క్వార్టర్స్ లోని తెలంగాణ ప్రభుత్వ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా పెరుమాండ్ల రాజ నరసింహ కు అందించారు. దళిత రత్న అవార్డు పెరుమాండ్ల రాజ నరసింహ పోరాటానికి ఒక గుర్తింపు అని మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డా పసుల రాంమూర్తి కొనియాడారు ఇట్టి కార్యక్రమంను సుతారి సుధాకర్, కంకణాలు రమేష్,కంకణాల జగన్,రవి,శ్యామ్, గణేష్,మరియు పలువురు ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



# రణబలి విడుదలపై అయోమయం

## దసరా లేదా దీపావళికి తీసుకువచ్చే యత్నం

కథానాయకుడు విజయ్ దేవరకొండ.. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి'. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక కథానాయిక. ఆర్నాల్డ్ వోస్లూ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమాని సెప్టెంబరు 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు గతంలో ప్రకటించారు. కానీ, ఇప్పుడిది ఆ తేదీకి రాకపోవచ్చనే సంకేతాలందుతున్నాయి. ప్రస్తుతం ఈ సినిమాని దసరా లేదా దీపావళి బరిలో దించేందుకు చిత్ర నిర్మాతలు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ చిరంజీవి 'విశ్వంభర' దసరాకి రానట్లయితే అక్టోబరు 16న దీన్ని తెరపైకి తీసుకురావాలని.. లేదంటే దీపావళి సందర్భంగా నవంబరు 6న విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఇది 1854 – 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా. విజయ్ ఇందులో ఓ యోధుడి పాత్రలో అలరించనున్నారు. ఈ చిత్రానికి అజయ్ – అతుల్ సంగీతమందిస్తున్నారు.



సినిమా సింగిడి Cinma Singidi

శనివారం 25-7-2026

మరో డిఫరెంట్ ప్రేమకథ..

# చెన్నై లవ్ స్టోరీ

కిరణ్ అబ్బవరం 'చెన్నై లవ్‌స్టోరీ' ఫస్ట్ గ్లింప్స్ నుంచే సినిమాపై ఆసక్తిని పెంచించింది. తొలిప్రేమ గురించి చెప్పే సంభాషణలు ఉత్సాహాన్ని పెంచాయి. 'కలర్ ఫోటో', 'బేబీ' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి రాజేశ్ ఈ చిత్రానికి కథ ఇవ్వడం, ఈ సినిమా క్లాసిక్ అవుతుందనే కోణంలో చేసిన ప్రచారం? ఇవన్నీ సినిమాపై అంచనాలు పెంచాయి. ప్రేమించిన వ్యక్తి పెళ్లి మండపంలోనే మోసం చేయడంతో నివి (శ్రీ గౌరీ ప్రియ) కుంగిపోతుంది. అలాంటి సమయంలో ఆమె జీవితంలోకి అడుగుపెట్టిన స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) మళ్లీ ప్రేమ, జీవితంపై ఆశలు చిగురించేలా చేస్తాడు. ఈ ఇద్దరి స్నేహం ప్రేమగా మారుతుంది. కానీ విధి ఈ ప్రేమకథను ఊహించని మలుపు తిప్పుతుంది. ఏమిటా మలుపు? ఈ కథకు ఎలాంటి ముగింపు దొరికిందన్నదే 'చెన్నై లవ్ స్టోరీ' కథ. ప్రేమకు ఫాంటసీ జోడించిన కథ ఇది. ప్రేమలో విఫలమై దేవదాసులా మారిన కథానాయిక కోణంలో కథను ప్రారంభించడం తొలి సగానికి కొత్తదనాన్ని తీసుకొచ్చింది. స్టీవెన్ శంకర్ నివి జీవితంలోకి అడుగు పెట్టిన తర్వాత ఇద్దరి మధ్య పెరిగే అనుబంధం, ప్రేమ సహజంగా ఆకట్టుకుంటాయి. ఇంటర్వెల్ ట్విస్ట్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతుంది. ద్వితీయార్ధంలో దర్శకుడు కథను పూర్తిగా ఫాంటసీ వైపు మళ్లిస్తాడు. అది ఇదివరకే వచ్చిన 'ఎందుకంటే? ప్రేమంట!' సినిమాను గుర్తు చేసినా, 'చెన్నై లవ్‌స్టోరీ' ఆత్మ వేరు. హీరో పాత్రలో వచ్చే జెలసీ కావాల్సిన వినోదాన్ని పంచుతుంది. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషన్స్ హత్తుకునేలా ఉంటాయి. ప్రేమ విషయంలో రెండు పాత్రల మధ్య కాస్త గందరగోళం ఏర్పడినప్పటికీ, ఈ సినిమాకు దర్శకుడు ఇచ్చిన క్లైమాక్స్ హత్తుకునేలా ఉంటుంది. స్టీవెన్ శంకర్ పాత్రలో కిరణ్ అబ్బవరం చూపించే అమాయకత్వం, చలాకీతనం సహజంగా ఉంటాయి. చాలా ఎమోషన్ ఉన్న పాత్ర ఇది. దర్శకుడు కావాలనే తన కల, అలాగే నివితో ప్రేమ, తను అనాథ అనే భావం.. ఇవన్నీ సహజంగా పలికించాడు. నివి పాత్రలో శ్రీగౌరీ ప్రియ ఈ సినిమాకు మరో ప్రధాన బలంగా నిలిచింది. ఆమె నటన చాలా హుందాగా ఉంది. ఈ జోడీ తెరపై అందంగా కనిపించింది. దర్శకుడు రవి నంబూరి సాయి రాజేశ్ కథలోని భావోద్వేగాలను తెరపై చక్కగా ఆవిష్కరించారు. సాంకేతికంగా మణిశర్మ సంగీతం సినిమాకు ప్రాణం పోశాయి. 'గుర్తుందా', 'వదలనే' పాటలు చక్కగా కుదిరాయి. విశ్వాస్ డేనియల్ ఛాయాగ్రహణం, చెన్నై వాతావరణం, వర్షం, కొన్ని క్లాసిక్ సినిమాలని గుర్తు చేసే ఫ్రేమ్స్, ఉన్నతమైన నిర్మాణ విలువలు సినిమాకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి.

# విశ్వనాథ్ అండ్ సన్స్...



## తమిళ సినిమానే తెలుగులో డబ్ చేసి విడుదల చేస్తున్నాం

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న అత్యంత ఆసక్తికర చిత్రాల్లో 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఒకటి. తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్యకు జోడీగా యువ నటి మమితా బైజు నటిస్తుండగా, ఆగస్టు 14న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో దర్శకుడు వెంకీ అట్లూరి తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమాపై చాలా రోజులుగా ప్రచారంలో ఉన్న ఒక ముఖ్యమైన విషయానికి క్లారిటీ ఇచ్చారు. ఇప్పటివరకు ఈ చిత్రాన్ని తమిళం, తెలుగు భాషల్లో ఒకేసారి చిత్రీకరించిన ద్విభాషా సినిమాగా చాలా మంది భావించారు. అయితే అది పూర్తిగా నిజం కాదని ఆయన స్పష్టం చేశారు. 'విశ్వనాథ్ అండ్ సన్స్‌ను పూర్తిగా తమిళ భాషలో మాత్రమే చిత్రీకరించాం. తర్వాత తెలుగు ప్రేక్షకుల కోసం డబ్బింగ్ వెర్షన్‌ను విడుదల చేస్తున్నాం. ఇది బైలింగ్వల్ సినిమా కాదు' అని వెల్లడించారు. దీంతో ఈ చిత్రంపై నెలకొన్న సందేహాలకు తెరపడింది. తెలుగు నిర్మాతలు నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న కారణంగా ఈ సినిమాను చాలా మంది తెలుగు–తమిళ ద్విభాషా చిత్రంగా భావించారు. కానీ దర్శకుడి తాజా వ్యాఖ్యలతో ఇది తమిళ చిత్రంగానే రూపొంది, తెలుగులో డబ్ అవుతున్న సినిమా అని స్పష్టమైంది. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రచార చిత్రాలు, సూర్య స్టైలిష్ లుక్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలు కలగలిపిన కథతో ఈ సినిమా తెరకెక్కుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. విడుదలకు ముందే మంచి బజ్‌ను సొంతం చేసుకున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

# జననాయగన్ ఓపెనింగ్స్ అంతంతమాత్రమే

## జీ5 ఓటీటీ హక్కులు పొందినట్లు ప్రచారం

తమిళ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' తెలుగులో 'జన నాయకుడు' ఎట్టకేలకు జూలై 23న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. రిలీజ్‌కి ముందు ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి.




అయితే మూవీ విడుదల తర్వాత బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి ఓపెనింగ్స్ రాకపోయినా, ఇప్పుడు సినిమా ఓటీటీ హక్కుల వ్యవహారం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు హెచ్. వినోద్ తెరకెక్కించిన ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో విజయ్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి దళపతి వెట్రి కొండన్ పాత్రలో కనిపించారు. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, ప్రకాష్ రాజ్, ప్రియమణి, మమితా బైజు కీలక పాత్రలు పోషించారు. సినిమాలో విజయ్ మాస్ ఎలివేషన్స్, యాక్షన్ సన్నివేశాలు అభిమానులను ఆకట్టుకున్నప్పటికీ, కథనం నెమ్మదిగా సాగడం, కొన్ని సన్నివేశాలు సాగదీతగా ఉండటంపై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. సినిమా విడుదలకు ముందే అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సినిమా డిజిటల్ హక్కులను సుమారు రూ. 110 కోట్లకు సొంతం చేసుకునే దిశగా చర్చలు జరిపినట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపించాయి. అయితే విడుదల ఆలస్యం, ఇతర కారణాలతో ఆ ఒప్పందం చివరికి కుదరలేదని సమాచారం. ఆ తర్వాత ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా హక్కులను సుమారు రూ. 50 కోట్లకు దక్కించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో దాదాపు రూ. 60 కోట్ల తేడాతో ఓటీటీ భాగస్వామి మారిపోయిందనే వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అయితే దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఆగస్టు 21 నుంచి 'జన నాయగన్' జీ5లో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో సినిమా అందుబాటులోకి రానుందని తెలుస్తోంది. విజయ్ సినీ జీవితానికి ముగింపు పలికిన ఈ చిత్రాన్ని థియేటర్లలో చూడాలని అభిమానులు భావిస్తుండగా, ఓటీటీ విడుదల కోసం కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే డిజిటల్ రిలీజ్, హక్కుల వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## అమెరికా ప్రచారంలో రామాయణ టీమ్




దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తోన్న పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ' గ్లోబల్ ప్రమోషన్స్ జోరందుకున్నాయి. అమెరికాలో జరుగుతోన్న ప్రముఖ శాన్ డియాగో కామిక్–కాన్ 2026 వేడుకల్లో చిత్ర బృందం పాల్గొని సందడి చేసింది. రణ్‌బీర్ కపూర్, యశ్, దర్శకుడు నితీశ్ తివారీతో పాటు నిర్మాత నమిత్ మల్హోత్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రణ్‌బీర్ కపూర్‌పై యశ్ ప్రశంసలు కురిపించారు. 'రాముడి పాత్ర పోషించడం చాలా కష్టం. రణ్‌బీర్ కపూర్ గొప్పగా నటించాడు. ఈ పాత్ర కోసం చాలా కష్టపడ్డారు. ఈ సినిమా చూసినప్పుడు అతడి నిబద్ధత కనిపిస్తుంది. ఇలాంటి సినిమాను చిత్రీకరించాలంటే సంకల్ప బలం ఉండాలి. మంచి టీమ్ ఉన్నప్పుడు ప్రతీది కలిసి వస్తుంది. ఈ సినిమా ప్రారంభించాక జీవితానికి సంబంధించిన ఎన్నో విషయాలను అర్థం చేసుకోవడం మొదలుపెట్టాం. మేకప్ నుంచి లుక్స్ వరకూ సాంకేతికంగా ఇది ఎంతో సవాలుతో కూడుకున్న పని. మా శక్తివంచన లేకుండా కృషి చేశాం' అని యశ్ అన్నారు. ఈ సినిమా ట్రైలర్ నేడు విడుదల కావాల్సి ఉండగా.. వాయిదా పడింది. అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని టీమ్ భావిస్తోంది. త్వరలో కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు.



# మంగళవారం మూవీకి సీక్వెల్

తెలుగు సినీ పరిశ్రమలో తనదైన మేకింగ్ స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అజయ్ భూపతి మరోసారి ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'ఆర్ఎక్స్ 100' సినిమాతో దర్శకుడిగా సంచలన విజయాన్ని అందుకున్న ఆయన, 'మహాసముద్రం' తో నిరాశపరిచినా, 'మంగళవారం' చిత్రంతో మళ్లీ బ్లాక్‌బస్టర్ హిట్ సాధించారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఆ మిస్టరీ థ్రిల్లర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ప్రస్తుతం అజయ్ భూపతి దర్శకత్వంలో రూపొందిన 'శ్రీనివాస మంగాపురం' చిత్రం జూలై 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో రషా తడానీ హీరోయిన్‌గా నటిస్తుండగా, మోహన్ బాబు, నరేష్, బ్రహ్మాజీ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా పాల్గొన్న ఇంటర్వ్యూలో అజయ్ భూపతి తన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 'మంగళవారం' చిత్రానికి సీక్వెల్‌పై వస్తున్న వార్తలకు అజయ్ భూపతి అధికారికంగా స్పందించారు. 'మంగళవారం 2' తప్పకుండా తెరకెక్కుతుంది. ఈసారి ప్రేక్షకులు ఊహించని స్థాయిలో కథను సిద్ధం చేస్తున్నాం. మొదటి భాగానికి పూర్తి భిన్నంగా, మరింత థ్రిల్లింగ్ అనుభూతిని అందించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు. ఈసారి కథలో సూపర్ నేచురల్ అంశాలకు పెద్దపీట వేస్తున్నామని అజయ్ భూపతి వెల్లడించారు. ప్రతి పాత్ర, ప్రతి సంఘటన ప్రేక్షకులను చివరి వరకు ఉత్కంఠకు గురిచేసేలా కథను రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం 'శ్రీనివాస మంగాపురం' పనుల్లో పూర్తిగా బిజీగా ఉన్నానని, ఆ సినిమా విడుదలైన తర్వాత పూర్తిస్థాయిలో 'మంగళవారం 2' స్క్రిప్ట్‌పై దృష్టి పెడతానని తెలిపారు. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'మంగళవారం 2' కథను అజయ్ భూపతి దర్శకుడు కొరటాల శివకు వినిపించినట్లు తెలుస్తోంది. కథ నచ్చడంతో ఆయన తన నిర్మాణ సంస్థ యువసుధా ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ఆసక్తి చూపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. అజయ్ భూపతి తాజా వ్యాఖ్యలతో 'మంగళవారం 2' టాలీవుడ్‌లో ఇప్పటి నుంచే హాట్ టాపిక్‌గా మారింది. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090